www.visalaandhra.com | VISALAANDHRA Regd No.VJ/042/2018-20 | పేజీలు : 12+టాబ్లాయిడ్ +ఆదివారం అనుబంధం | వెల రూ.4.00

SUNDAY
విశాలాంధ్ర
స్థాపితం : 1952
అక్షరాక్షరం అభ్యుదయం
సంపుటి : 66, సంచిక : 252
ఆదివారం 04-03-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | విజయవాడ ప్రచురణ



హల్లో...
చెవుడొచ్చింది...

ప్రయాణాలలో కబుర్లు కరవు

ఇయర్‌ఫోన్లతోనే కాలక్షేపం

యువతలో పెరుగుతున్న జాఢ్యం

వినికిడి సమస్యలకు ఆహ్వానం

7లో

సెల్‌ఫోన్లు, స్మార్ట్‌ఫోన్లు రాజ్యమేలుతున్న పరిస్థితుల్లో బస్సులు లేదా రైళ్లలో వయస్సుతో సంబంధం లేకుండా ఎక్కగానే ఇయర్‌ఫోన్లు తీసి స్మార్ట్‌ఫోన్లకు తగిలించి చెవుల్లో పెట్టేసుకుంటున్నారు. ఇక వారికి ప్రపంచంతో ఎటువంటి సంబంధం ఉండదిక. ముఖ్యంగా యువతలో ఈ దుర అలవాటు ఎక్కువైపోయింది.

ఇంటి పనులతో...
కొవ్వు కరుగు...

- బట్టలు మనమే మడతపెట్టుకుంటే పోలా...
- మినీ రోలు ఉండగా మిక్సీ ఏల?

7లో



మెదడుకు పని పెడదాం

7లో

- ఆలోచన మనిషి అత్యుత్తమ మానసిక స్థితికి తార్కాణం
- సమస్యల పరిష్కారానికి పది చిట్కాలు

జీవితం సమస్యలతో కూడిన ఆలోచనల మయం. సమస్యలు ఉంటేనే పరిష్కారమార్గాల అన్వేషణకు మెదడు మరింత చురుగ్గా పనిచేస్తుందని నిపుణుల సూచన. వివేకంతో ఆలోచించే మనిషి సమస్యలకు ఆందోళన చెందడు. అసలు సమస్యకు మూలాలను వెతికేందుకు కృషి చేసి, ఆ సమస్యకు పరిష్కారాన్ని సూచిస్తాడు.



నెల్లూరులో 'ఇర్రి' కేంద్రం?

జిల్లాలో పర్యటించిన శాస్త్రవేత్తల బృందం

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం



విశాలాంధ్ర-నెల్లూరుబ్యూరో:
అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ (ఇర్రి) వినూత్న ఆవిష్కరణ కేంద్రాన్ని త్వరలో నెల్లూరు జిల్లాలో ఏర్పాటు చేయనున్నారు. ఫిలిప్పైన్స్ కేంద్రంగా ఇర్రి పనిచేస్తుంది. కొత్త వరి వంగడాలు, వినూత్న ఆవిష్కరణలు, పరిశోధనలు చేస్తుంటారు. ఇర్రి తన పరిశోధనా కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. అందుకు నెల్లూరు జిల్లాను అనువైన ప్రాంతంగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ డైరెక్టర్ జనరల్ మాథ్యూ మోరెల్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం శనివారం నెల్లూరు జిల్లాలో పర్యటించింది. ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి బృందం ఫిలిప్పైన్స్, వియత్నాం, థాయిలాండ్ దేశాల్లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఏపీలో రీజనల్ ఇన్నొవేటివ్ సెంటర్ (వినూత్న ఆవిష్కరణ కేంద్రం) ఏర్పాటు చేసేందుకు ఆ పర్యటనలో ఇర్రితో ఒప్పందం చేసుకున్నారు. అందులో భాగంగా శుక్రవారం ఈ బృందం అమరావతిలో సీఎం చంద్రబాబు నాయుడుతో సమావేశమైంది. ప్రస్తుతం ఇలాంటి కేంద్రం ఉత్తర భారతదేశంలోని వారణాసిలో ఉంది. దేశంలోనే రెండోదైన ఇన్నొవేటివ్ సెంటర్ ను నెల్లూరు జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ఉన్న అనుకూలమైన పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ఇర్రి శాస్త్రవేత్తల బృందం పర్యటించింది.

జిల్లా అధికారులతో సమావేశం:
మాథ్యూ మోరెల్ నేతృత్వంలోని బృందం నెల్లూరులో జిల్లా అధికారులతో సమావేశమైంది. ఏపీఐఐసీ చైర్మన్ పి.కృష్ణయ్య, కలెక్టర్ రేవు ముత్యాలరాజు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ వల్లభనేని దామోదర్ నాయుడు, ఆర్డీఓ పి.హరిత, ఏపీఐఐసీ జెడ్ఎం కె.వెంకటేశ్వరరావు, డీడీఏ శివనారాయణ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇర్రి కార్యకలాపాలను శాస్త్రవేత్తలు వివరించగా వరి సాగుతో పాటు నూతన ఆవిష్కరణలకు నెల్లూరులో ఉన్న విశిష్టతలను, వరితో నెల్లూరుకు ఉన్న అనుబంధాన్ని కృష్ణయ్య, కలెక్టర్ వివరించారు.

భూముల పరిశీలన:
రీజనల్ ఇన్నోవేటివ్ సెంటర్ ఏర్పాటుకు అనుకూలమైన భూములను శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. కోవూరు మండలం పోతిరెడ్డిపాళెంలోని భూములను పరిశీలించారు. ఇక్కడ ఉన్న అనుకూలతలపై అధికారులతో చర్చించారు. అనంతరం శాస్త్రవేత్తల బృందం ముత్తుకూరు మండలం నారికేళపల్లి పంచాయతీ పరిధిలోని భూములను పరిశీలించింది. రైతులు సాగుచేసిన వేరుశనగ పంటను పరిశీలించి దిగుబడులపై చర్చించారు. రాష్ట్రంలో గుంటూరు, ప్రకాశం జిల్లాలు వారి దృష్టిలో ఉన్నప్పటికీ నెల్లూరు జిల్లా అనువైన ప్రాంతమని శాస్త్రవేత్తల బృందం నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. కోవూరు మండలంలో ఏర్పాటుచేస్తే దగ్గరలో జాతీయ రహదారి ఉండటంతో పాటు, పక్కనే పెన్నానది కూడా ఉంది. సాగునీటికి ఎటువంటి ఇబ్బందులు ఉండవు. త్వరలో సమీపంలో విమానాశ్రయం కూడా ఏర్పాటు కానుంది. జిల్లాలోని వసతులను శాస్త్రవేత్తలకు కలెక్టర్ వివరించారు. నెల్లూరు

- మిగతా 2 లో

త్రిపురలో బీజేపీ

నాగా, మేఘాల్లో హంగ్

త్రిపుర

బీజేపీ +	43
కాంగ్రెస్	0
సీపీఎం +	16

నాగాలాండ్

ఎన్‌డీపీపీ + బీజేపీ	29
కాంగ్రెస్	0
ఎన్‌పీఎఫ్ +	29
ఇతరులు	2

మేఘాలయ

బీజేపీ	2
కాంగ్రెస్	21
ఎన్‌పీపీ	19
ఇతరులు	17

ఈశాన్య భారతంలో త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ మూడు రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ ముగిసింది. త్రిపురలో బీజేపీ దాని మిత్రపక్షాలు స్పష్టమైన ఆధిక్యం సాధించగా, నాగాలాండ్, మేఘాలయలలో హంగ్ దిశగా ఫలితాలు ఉన్నాయి. ఇక్కడ కాషాయ పార్టీ కుట్రలకు తెర లేపింది. త్రిపురలో 60 స్థానాలకుగాను 59 స్థానాలకు ఎన్నికలు జరగగా బీజేపీ, దాని మిత్రపక్షం ఎన్‌డీపీపీ 43 స్థానాలను కైవసం చేసుకుని స్పష్టమైన ఆధిక్యత సాధించింది. అధికార వామపక్ష కూటమికి 16 స్థానాలు మాత్రమే దక్కాయి. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ ఖాతా తెరవకపోవడం గమనార్హం. నాగాలాండ్‌లో ఫలితాలు హంగ్ దిశగా ఉన్నాయి. 60 స్థానాలకుగాను బీజేపీ దాని మిత్రపక్షం నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(ఎన్‌డీపీపీ)లు 29 స్థానాలు దక్కించుకున్నాయి. అధికార పీపుల్స్ ఫ్రంట్(ఎన్‌పీఎఫ్), దాని మిత్రపక్షాలకు 29 స్థానాలు వచ్చాయి. ఇక్కడ కూడా కాంగ్రెస్‌కు

- మిగతా 2 లో

ఈశాన్య ప్రజల కలలు నెరవేరుస్తాం

- ప్రధాని మోడీ



నాపై నమ్మకం ఉంచినందుకు ప్రజలకు ధన్యవాదాలు. ఈశాన్య ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు బీజేపీ కట్టుబడి ఉంది. ఈశాన్య రాష్ట్రాల ప్రజలంతా ఎన్డీఏ అభివృద్ధి ఎజెండాకు మొగ్గుచూపారు. ప్రతికూల, అర్థరహిత రాజకీయాల కోసం వారి వద్ద సమయం లేదు' .

'ధనమదం'తోనే బీజేపీ విజయం

- సీపీఎం నేత సీతారాం ఏచూరి



బీజేపీ ఎన్నికలను ప్రభావితం చేయడానికి డబ్బు, ఇతర అంశాలను ఉపయోగించుకుంది. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్, వామపక్ష వ్యతిరేక ఓట్లన్నింటినీ బీజేపీ ఏకీకృతం చేయగలిగింది. ఫలితాల ఆధారంగా విశ్లేషణ చేస్తాం. అక్కడున్న లోపాలు ఏమిటో తెలుసుకుని, చర్యలు తీసుకుంటాం.

ఏపీ భవన్‌లో ధర్నా



11లో

ఆ జడ్జిపై కేంద్రం అక్కసు..

9లో

కోరెగాడ్ కుట్రదారుడికి పద్మశ్రీ?

9లో

ప్రత్యేక హోదాతోనే న్యాయం



- చంద్రబాబు ప్రశ్నించే హక్కు కోల్పోయారు
- జేఎఫ్‌సీకి రాజకీయ లబ్ధి లేదు - 11 అంశాలపై చర్చ
- కష్టదాటుతో సమస్య పరిష్కారం కాదు : పవన్‌కళ్యాణ్

12లో

త్వరలో తృతీయఫ్రంట్ !

- బీజేపీ, కాంగ్రెస్ విఫలం
- తుదిరూపు దిద్దుకుంటున్న వేదిక
- అందరితో చర్చలు జరుపుతున్నా
- అవసరమైతే నేనే నాయకత్వం వహిస్తా
- తెలంగాణవాడి సత్తా నిరూపిస్తా
- హక్కుల కోసం పార్లమెంటులో నిలదీస్తాం
- రాజకీయ పరివర్తనకు నాంది పలుకుతా
- విభజన చట్టంలో అంశాలు అమలు చేయాలి
- తెలంగాణ సీఎం కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ :
తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్ రెండూ పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. అందుకే దేశానికి ప్రత్యేక రాజకీయ వేదిక అవసరం చాలా ఉందన్నారు. ఈ రాజకీయ వేదిక కోసం చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే అది తుదిరూపు దిద్దుకుంటుందని కేసీఆర్ చెప్పారు. అవసరమైతే ఆ వేదికకు తానే నాయకత్వం వహిస్తానని ప్రకటించారు. తెలంగాణవాడి సత్తాను ఢిల్లీ వేదికగా నిరూపిస్తానని సీఎం ధైర్యంగా చెప్పారు. తాను చెప్పే ప్రత్యామ్నాయ వేదికకు ఏ పేరైనా పెట్టవచ్చని, అది తృతీయ ఫ్రంట్ కావచ్చు లేదా మరేదైనా కావచ్చని కేసీఆర్ అన్నారు. శనివారం

- మిగతా 2 లో



ఇదీ లోకం!




అసెంబ్లీలో హోరు తప్పదా?

రేపటి నుంచి
బడ్జెట్ సమావేశాలు

- సమావేశాలకు రాబోమని తేల్చిచెప్పిన వైసీపీ
- సభలో కేంద్రంపై వ్యతిరేకంగా టీడీపీ
- అనుకూలంగా బీజేపీ వాదనలు
- పవన్‌కళ్యాణ్ ఫ్యాక్ట్ ఫైండింగ్ నివేదికపై సభలో చర్చ

విశాలాంధ్ర-అమరావతి :
ఏపీ రాజకీయాలు రోజురోజుకూ వేడెక్కుతున్నాయి. రాష్ట్ర ప్రత్యేకహోదాపై టీజేపీ మినహా రాజకీయ పార్టీలన్నీ ఉద్యమాలను ఢిల్లీస్థాయిలో ఉధృతం చేసేందుకు ఓ వైపు సమాయత్తమవుతున్న నేపథ్యంలో ఈ నెల 5 నుంచి పార్లమెంటు సమావేశాలు పునఃప్రారంభం అవుతున్నందున ప్రత్యేకహోదా ఉద్యమ సెగలను పార్లమెంటుకు తాకేలా చేసేందుకు అధికార, ప్రతిపక్ష, వామపక్ష, కాంగ్రెస్ పార్టీల ఎంపీలు, నేతలు ఎవరికి వారు వ్యూహాలను రచించి పోరాటం చేసేందుకు ఢిల్లీకి చేరుకున్నారు. ఇదే సమయంలో రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కూడా సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలకు హాజరు



- మిగతా 2 లో

మంచినీళ్ల ట్యాంకర్లపై నిఘా

మారుమూల ప్రాంతాలకు సమృద్ధిగా మంచినీరు సరఫరా లక్ష్యం

జీపీఎస్ అనుసంధానం

ఈ ఏడాది నుంచే అమలు

విశాలాంధ్ర-అమరావతి :
వేసవి వస్తోంది... మంచినీటి వనరులు లేని మారుమూల గ్రామీణ ప్రాంతాలకు, గిరిజన తండాలకు మంచినీటిని ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తోంది. ఇందుకు ఏడాదికి వందల కోట్లలో ఖర్చు చేస్తోంది. అయితే ఇప్పటివరకు ట్యాంకర్ల ద్వారా జరిగే మంచినీటి సరఫరా పథకంలో అక్రమాలు చోటు చేసుకునేవి. 50 ట్యాంకర్లు తోలాల్సి ఉండగా 10 ట్యాంకర్లు మాత్రమే తోలి సంబంధిత అధికారుల సహకారంతో భారీ ఎత్తున ట్యాంకర్ల కాంట్రాక్టర్లు సొమ్ము చేసుకొనేవారు. దీనివల్ల మారుమూల ప్రాంతాల ప్రజలు మంచినీటి కోసం అల్లాడిపోవాల్సి వచ్చేది. అయితే ఇక నుంచి ఈ సమస్యలు ఉండవు. నీటివనరులు పుష్కలంగా లేని ప్రాంతాలకు ప్రభుత్వం మంచినీటి ట్యాంకర్లకు



ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించింది. ఈ విధానం రాష్ట్రంలోని 664 మండలాల్లో ఈ ఏడాది నుంచి అమలు కానుంది. ఇందుకోసం గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో గ్రామీణ నీటి పథకంలో భాగంగా మంచినీటి ట్యాంకర్లకు జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్)ను అమర్చి ట్యాంకర్లను ఆయా ప్రాంతాలకు పంపనున్నారు. ఈ జీపీఎస్ విధానం వల్ల ట్యాంకరు నీటిని నింపుకొనే సమయం నుంచి గమ్యస్థానంలో నీటిని చేర్చేవరకు ట్యాంకర్ లైవ్ ట్రాకింగ్ తెలిసిపోతుంది. ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేసేందుకు జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ప్రాంతాల వారీగా

- మిగతా 2 లో

బర్కినలో ఫ్రాన్స్ ఎంబసీపై బాంబుదాడి

8 మంది మృతి, 80 మందికి గాయాలు



జగడౌగౌ : బర్కినఫసో రాజధానిలోగల ఫ్రాన్స్ రాయబార కార్యాలయంపై ఆత్మాహుతి బాంబుదాడి జరగడంతో 8 మంది చనిపోగా, 80 మంది గాయపడ్డారు. రాయబార కార్యాలయంపై రెండుసార్లు బాంబుదాడులు జరిగాయని భద్రతా దళాలు తెలియజేశారు. చనిపోయిన వారంతా భద్రతాసిబ్బంది అని రక్షణశాఖమంత్రి క్లిమెంట్‌సవడౌగౌ విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. గాయపడిన వారందరికీ స్థానిక సైనిక ఇతర సివిల్ ఆసుపత్రులలో చికిత్స చేయించినట్లు ఆయన తెలిపారు. గాయపడిన వారిలో డజన్లమంది పరిస్థితి తీవ్రంగావుందని, ముగ్గురి పరిస్థితి విషమంగావుందని మంత్రి తెలిపారు. పేలుడు వస్తువులతో నిండిన వాహనంద్వారా వచ్చి బాంబులు పేల్చినట్లుగా ఆయన తెలిపారు. దాడులు జరిపిన ఆరుగురు దుండగులను పట్టుకున్నట్లుగా కమ్యూనికేషన్ల మంత్రి రెమిడండజినౌ తెలియజేశారు. అయితే దాడికి ఎవరు కారకులైందీ ఇంకా తెలియరాలేదు. టెర్రరిజానికి వ్యతిరేకంగా తమతోపాటు పోరాడుతున్నందునే బర్కినలో తమ ఎంబసీపైన దాడి జరిపారని ఫ్రాన్స్ విదేశాంగమంత్రి జెనైవెల్‌డ్రయిన్ తెలిపారు. ఈ దాడులను ఐక్యరాజ్యసమితి భద్రతామండలి ఖండించింది.

పిల్లల రక్షణకు సూడాన్ హామీ



ఖర్టూం : ఘర్షణ జరుగుతున్న ప్రాంతాలలో పిల్లలను రక్షించేందుకు ఐక్యరాజ్యసమితి ప్రణాళికను అమలు చేస్తామని సూడాన్ ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా ఐక్యరాజ్యసమితి అధికారి తెలిపారు. సాయుధ సంఘర్షణలు జరిగే ప్రాంతాలలో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ప్రతినిధిగా వర్జీనియాగాంబ సూడాన్‌లో ఉంటున్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐరాస ప్రణాళికను సూడాన్ అమలుచేస్తూ గత మూడేళ్లకాలంలో 2500 మంది పిల్లలను పోరాటాలు జరుగుతున్న ప్రాంతంనుంచి విముక్తులను చేసిందని చెప్పారు. తమ కార్యాలయానికి సూడాన్ ప్రభుత్వానికి మధ్యగల సంబంధాలమ ఇరువురూ కలిసి అమలు చేస్తున్న కార్యాచరణ ప్రణాళికను ఆయన వివరించారు. ఈ ప్రణాళిక అమలు చేయడంలో మంచి విజయాలు సాధించామని గాంబ వెల్లడించారు. సూడాన్‌లో సాయుధ ఘర్షణలు జరుగుతున్న ప్రాంతాల్లో వివిధ సాయుధ గ్రూపులు పిల్లలను రిక్రూట్ చేసుకోవడం ఆ తరువాత వారు పోరాటాల్లో చనిపోవడం బాలికలపై లైంగిక దాడులకు పాల్పడటం ద్వారా మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నారని ఆయన అన్నారు. సాయుధ గ్రూపులు చిన్నపిల్లలను తమ గ్రూపులలో చేర్చుకోవడం ఇంకా కొనసాగుతున్నదని అన్నారు. సాయుధ గ్రూపులలో పిల్లలను చేర్చుకోకుండా నిరోధించేందుకుగాను 2016 మార్చిలో సూడాన్, ఐక్యరాజ్యసమితి మధ్య ఒక ఒప్పందం కుదిరింది. 2011 నుంచి సూడాన్‌లో వివిధ ప్రాంతాల్లో సాయుధ ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి.


వాణిజ్యయుద్ధం ప్రకటించిన ట్రంప్

దిగుమతులపై టారిఫ్ ప్రకటనతో కుదేలైన స్టాక్ మార్కెట్



వాషింగ్టన్ : చైనా, యూరోపియన్ యూనియన్ దేశాలనుంచి దిగుమతి అయ్యే వస్తువులపై టారిఫ్ విధించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం ద్వారా వాణిజ్య యుద్ధానికి తెరతీశారు. 2016లో ఎన్నికల ప్రచార సమయంలోనే చైనాతో జరిపే వాణిజ్యంలో తమకు చాలా లోటు ఉంటున్నదని దీన్ని సరిచేసేందుకు చైనా దిగుమతులపై సుంకాలు విధిస్తానని ప్రకటించారు. అనుకున్నట్లుగానే రెండు రోజుల క్రితం స్టీలు, అల్యూమినియం ఉత్పత్తులపై సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించటంతో అనేక స్టాక్ మార్కెట్లు తల్లకిందులయ్యాయి. దీని ఫలితం అమెరికా ఉత్పత్తులపైన కూడా ఉంటుందని భావిస్తున్నారు. ట్రంప్ ప్రకటనకు అనేక మిత్ర దేశాలే ఆగ్రహం ప్రకటించాయి. ఆయన సొంత రిపబ్లికన్ పార్టీ సభ్యులు కూడా విమర్శించారు. దీనిపై చైనా స్పందిస్తూ అమెరికా బహుళ వాణిజ్య నియమనిబంధనలకు కట్టుబడి ఉండాలని, అంతర్జాతీయ వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థలకు తమవంతు దోహదం చేయాలని పేర్కొన్నది. అయితే చైనా కూడా అమెరికా దిగుమతులపైన సుంకాలు విధించే అవకాశం లేకపోలేదు. అలాగే పలు ఈయూ దేశాలు స్పందించవచ్చు. అప్పుడు అమెరికా కంపెనీల ఉత్పత్తుల రేటు పెరిగే అవకాశం ఉంటుంది. గతంలో ట్రంప్ ఇలాంటి ప్రకటన చేసినప్పుడే తమ హక్కులను పరిరక్షించుకుంటామని చైనా అధికారులు తెలిపారు. ప్రధానంగా చైనాను లక్ష్యం చేసుకునే ఈ ప్రకటన చేశారు. ట్రంప్ వాణిజ్యపరమైన ఉద్రిక్తతలను మరింత పెంచినట్లయితే చైనా అమెరికా భౌగోళిక రాజకీయ ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంటుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఉత్తరకొరియాపైన ఆంక్షలను అమలుచేయడంలోను చైనా వెనకాడవచ్చు. ట్రంప్ ఇప్పటికే దేశంలో 1.5 ట్రిలియన్ డాలర్ల మేరకు పన్నులలో కోత విధించారు. తాజా ప్రకటనతో తమ ఉత్పత్తుల వ్యయం బాగా పెరిగే అవకాశంవుందని అమెరికా కంపెనీలు భావిస్తున్నాయి. రిపబ్లికన్ పార్టీ సెనేటర్ బెన్‌సస్సి మాట్లాడుతూ అధ్యక్షుడు ఈ విధంగానే పనిచేస్తుంటే అమెరికన్ల ఉద్యోగాలకు తీవ్ర ముప్పు కలుగుతుంది. అంతిమంగా వాణిజ్యయుద్ధంవల్ల కలిగే ఫలితం ఇదని వ్యాఖ్యానించారు. ట్రంప్ మాత్రం తన చర్యను చాలా మంచిదని గెలవడం తేలికవుతుందని వాణిజ్య యుద్ధాలన్నీ మేలైనవని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటనపై ఇతర దేశాలు గట్టిగా స్పందిస్తే అనేక విధాలుగా అమెరికా ప్రయోజనాలు దెబ్బతింటాయని విశ్లేషకులు భావిస్తున్నారు. స్టీలుపైన 25 శాతం, అల్యూమినియంపైన 10 శాతం సుంకాలను విధించాలని ట్రంప్ నిర్ణయించారు. సుంకాలు పెరిగితే స్టీలు, అల్యూమినియం ధరలు పెరుగుతాయి.

జర్నలిస్టు హత్యకు వేలాదిమంది నిరసన



బ్రటిస్లావా : స్లొవేకియా రాజధాని బ్రటిస్లావాలో జర్నలిస్టు జాన్‌కుసియక్ హత్యకు నిరసనగా వేలాదిమంది ప్రదర్శన జరిపారు. ప్రభుత్వం ఉన్నతస్థాయిలో జరిపిన అవినీతిని బయటపెడుతూ రాసిన ఒక నివేదికను ప్రచురించనున్నాడని భావించిన రాజకీయనేతలు జర్నలిస్టును హత్య చేశారు. బ్రటిస్లావాలోనేకాక దేశవ్యాప్తంగా అనేక పట్టణాలు, నగరాలలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. బ్రటిస్లావాలో ప్రదర్శనకు 25వేలమందికిపైగా హాజరయ్యారు. గడ్డకట్టుకుపోయే చలి వాతావరణంలో వేలాదిమంది క్యాండిల్స్ పట్టుకొని మౌనంగా ప్రదర్శన జరిపారు. ప్రదర్శననుద్దేశించి అధ్యక్షుడు ఆంద్రెజ్‌కిస్కా మాట్లాడుతూ జాన్, మార్టినా అనే ఇద్దరు యువ జర్నలిస్టులకు నివాళి అర్పించేందుకే తాను ఇక్కడకు వచ్చానని అన్నారు. మార్టినా కుసియక్ ప్రియురాలు ఆమెను కూడా కాల్చివేశారు. బ్రటిస్లావాలో వారు నివసిస్తున్న ఇంటికి సమీపంలోనే ఇరువురి మృతదేహాలు కనిపించాయని పోలీసులు తెలిపారు.

ఇటలీకి చెందిన వాణిజ్యవేత్తలు స్లొవేకియా, కలబ్రియాలలో వివిధ అక్రమాలకు పాల్పడుతూ తమ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే ఈ హత్యలు చేసి ఉంటారని కొందరు భావిస్తున్నారు. మాఫియాలు ఏలుతున్న దేశంలో మనం ఉన్నాం అని ఒక విద్యార్థి ఏఎఫ్‌పి వార్తాసంస్థకు తెలిపారు. స్లొవేకియా పోలీసులు పలువురు ఇటలీ వాణిజ్యవేత్తలను అరెస్టు చేశారు. జర్నలిస్టు హత్యకు నిరసనగా ప్రదర్శన జరిపినవారంతా కన్నీళ్లు పెట్టుకుంటూ హంతకులపై ఆగ్రహం ప్రకటించారు. ఈ విషాదంపై దర్యాప్తు జరిపి దోషులను శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

సైన్యం, ప్రజల మధ్య బలమైన బంధం

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపు



బీజింగ్ : సైన్యం, ప్రజల మధ్య బలమైన బంధం ఏర్పడాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. సమ్మిళిత సైనిక సౌర అభివృద్ధి సెంట్రల్ కమిషన్ ప్లీనరీ సమావేశానికి అధ్యక్షత వహించిన జిన్‌పింగ్ మాట్లాడుతూ సైన్యం, పౌరుల మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడేందుకు రూపొందించిన ప్రణాళికను అమలుచేయాలని దృఢంగా కమ్యూనిస్టు పార్టీ 19వ జాతీయ మహాసభలు తీర్మానించాయని చెప్పారు. ఈ సమావేశంలో సైన్యం, పౌరుల మధ్య బలమైన సంబంధం ఏర్పడేందుకు తీసుకోవలసిన చర్యలను మార్గదర్శకాలను చర్చించారు. ఇందుకు కార్యాచరణ ప్రణాళికను సెంట్రల్ కమిషన్ రూపొందిస్తుంది. ఈ నిర్ణయాన్ని అమలు చేసేందుకు నూతన జోన్లను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సమావేశం అనంతరం విడుదలైన ప్రకటనలో సైనిక, పౌర అభివృద్ధి కమిషన్ ఈ విషయంలో పురోగతి సాధించిందని పేర్కొన్నారు. చైనా లక్షణాలతో సోషలిస్టు సమాజ నిర్మాణానికి జిన్‌పింగ్ ప్రతిపాదించిన మార్గదర్శకాలను అమలు చేసేందుకు ప్రాధాన్యత ఇస్తామని ఆ ప్రకటన తెలిపింది. సైనిక, పౌర సమ్మిళిత వ్యూహాన్ని అమలుచేసేందుకు సైన్యాన్ని మరింత పటిష్టం చేయాలని జిన్‌పింగ్ యోచిస్తున్నారు. మౌలిక సదుపాయాలు, వనరుల పంపిణీ, జాతీయ భద్రతకు సంబంధించిన సాంకేతిక పరిశ్రమ, ఆయుధాలు, నూతన శాస్త్ర ఆవిష్కరణలు, నైపుణ్యం పెంపుదల, సామాజిక సేవలో సమన్వయం, సైనిక లాజిస్టిక్స్ తదితర రంగాలపైన శ్రద్ధ వహించాలని జిన్‌పింగ్ కోరినట్టుగా ప్రకటన తెలిపింది. కీలకరంగాలకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు.

త్వరలో తృతీయఫ్రంట్ !

(మొదటిపేజీ తరువాయి)

ప్రగతి భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఎంపీలు జితేందర్‌రెడ్డి, కవిత, కె.కేశవరావు, వినోద్, నాగేష్, దయాకర్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు. పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అనంతరం కేసీఆర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి అన్ని రంగాల్లో న్యాయం చేయాలని పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని కె.చంద్రశేఖరరావు వెల్లడించారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను, పేర్కొన్న అంశాలను అమలు చేయాలని కోరారు. రాజ్యాంగాన్ని సవరించి ఎస్టీ, మైనారిటీ, ఎస్సీ రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. ఉత్తరాఖండ్, ఛత్తీస్‌ఘడ్‌లకు ఇచ్చిన ప్యాకేజీలను తమ రాష్ట్రానికి ఇవ్వాలని కోరారు. రాష్ట్రాలపై పెత్తనాన్ని వదులుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాల్లో కేంద్రప్రభుత్వ చర్యలను ఎండగడతామని చెప్పారు. నరేంద్రమోడీని తాను కించపర్చడంగానీ, తులనాడే వ్యాఖ్యలు గానీ చేయలేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అద్భుత పాలన అందిస్తున్నామని స్వయంగా ప్రధానే ప్రశంసించారని గుర్తు చేశారు. తనకు సంపద అక్కరలేదని, అక్రమంగా సంపాదించే వారే భయపడతారని, కేసీఆర్ ఎవరికీ భయపడడని తెలిపారు. ప్రస్తుత రాజకీయ వ్యవస్థ దారుణంగా విఫలమైందని, దేశ రాజకీయాల్లో ప్రబలమైన మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని వివిధ రాజకీయపక్షాల నాయకులతో తాను స్వయంగా మాట్లాడానని, కొందరు సానుకూలత వ్యక్తం చేశారని కేసీఆర్ వెల్లడించారు. రాజకీయాల్లో గుణాత్మక మార్పు కోసం ఎవరితో మాట్లాడాలో వారితో మాట్లాడుతున్నానని, అది థర్డ్ ఫ్రంట్ కావొచ్చు లేదా మరో ఫ్రంట్ కావొచ్చు...కేంద్రంలో గుణాత్మకమైన మార్పు మాత్రం రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంశాల వారీగా బీజేపీకి మద్దతిచ్చామేగానీ ఆ పార్టీ భాగస్వాములం కాదని స్పష్టం చేశారు.

చట్టంలోని అంశాల అమలు కోసం కేంద్రానికి చాలా సందర్భాల్లో దరఖాస్తులు ఇచ్చామన్నారు. ఎంపీలు, రాష్ట్ర మంత్రులు కేంద్రం దృష్టికి తీసుకొచ్చారని, కానీ ఆశించిన స్థాయిలో కేంద్రం నుంచి స్పందన రాలేదన్నారు. రిజర్వేషన్లపై ప్రధానికి తాను స్వయంగా చెప్పానని, 70 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత కూడా ఈ రిజర్వేషన్లు కేంద్రం దగ్గర పెట్టుకోవడం సరైంది కాదని కేసీఆర్ తెలిపారు. శాసనసభలో తీర్మానం చేసినప్పుడు ఈ మాట బలంగా చెప్పి పంపించామన్నారు. రిజర్వేషన్లకు అనుగుణంగా రాష్ట్ర పరిధిలోనే ఉద్యోగాలు, విద్యా అవకాశాలు కల్పిస్తామని, వాటిని కేంద్రం నుంచి అడగడం లేదని కేసీఆర్ అన్నారు. అందువల్ల రిజర్వేషన్లు కేంద్రం వద్ద పెట్టుకోవద్దని ప్రధానికి చెప్పానన్నారు. దానిపై ఎలాంటి స్పందన రాకపోగా, అదే పాత పద్ధతిని కొనసాగిస్తామని కేంద్రం చెబుతుందన్నారు. దీనిపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని, రిజర్వేషన్ల గురించి సుప్రీంకోర్టు చెప్పినట్లుగా రాజ్యాంగ సవరణ చేయొచ్చునని, ఇది పెద్ద కష్టమేమీ కాదన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న డిమాండేనని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అనుకుంటే ఆర్టికల్ 16ను సవరణ చేయొచ్చునని, బిల్లు ఆమోదం పొందుతుందన్నారు. కాకపోతే కేంద్రం తన పెత్తనాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేదని, తన గుప్పిట్లో పవర్ పెట్టుకోవాలని కోరుకుంటున్నదని సీఎం తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుబంధంగా చేయాలని కోరామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఖాజీపేటలో రైల్వే కోచ్, హైదరాబాద్‌లో ఐఐఎం, ఖమ్మంలో బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తుందని ఆశిస్తే బడ్జెట్‌లో ఆ ఊసేలేదని ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారు. దీనిపై టీఆర్ఎస్ ఎంపీలు పోరాటం చేస్తారన్నారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలు రెండు రాష్ట్రాలకు ఇవ్వాలని బిల్లులో పేర్కొన్నారని, కానీ ఏమీ ఇవ్వలేదన్నారు. నిజానికి హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ తరహాలో ప్రోత్సాహకాలు ఇస్తే కొత్తగా ఏర్పడిన రాష్ట్రాలు కాబట్టి బాగా పెట్టుబడులు వచ్చే ఆస్కారం ఉంటుందని, ఉభయ రాష్ట్రాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. ఆ ఉద్దేశంతోనే అందరం డిమాండు చేస్తే అప్పటి కేంద్ర ప్రభుత్వం విభజన బిల్లులో పెట్టిందని, దానిని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం తీసివేసిందన్నారు. విభజన బిల్లులో ఉన్నదాన్ని పొడిగించాలని డిమాండు చేస్తూ పోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే ప్రతి పథకాన్ని డిజైన్ చేసే అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధిలో అగ్రగామిగా ఉన్నామని గుర్తు చేశారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పది సీట్లు కూడా రావని, బీజేపీ అడ్రస్ గల్లంతవుతుందని చెప్పారు. అన్ని రాజకీయ పక్షాల తరహాలోనే టీఆర్ఎస్ పనిచేస్తోందని వివరించారు. రెండుసార్లు సర్వే నిర్వహించామని, ఒక సర్వేలో 103, మరో సర్వేలో 106 స్థానాలను టీఆర్ఎస్ కైవసం చేసుకుంటున్నట్టు స్పష్టమైందని కేసీఆర్ గుర్తు చేశారు. తెలంగాణలో బీజేపీ లేదని, అసలు అది ఓ రాజకీయ పార్టీనేనా అని ప్రశ్నించారు. ఇటీవల ఆదిలాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో తాను ప్రధానిని అగౌరవంగా సంబోధించానని వస్తున్న వార్తలను కేసీఆర్ ఖండించారు. తాను అలాంటి వ్యాఖ్యలు చేయలేదని, అసలు తనకు అలాంటి అవసరం లేదన్నారు. తన ప్రసంగం వీడియో క్లిప్ తెప్పించుకుని మళ్లీ చూశానని, అలాంటి సందర్భం అక్కడ లేదన్నారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. కొందరు నాయకులు కేసీఆర్ జైలుకెళతారని అంటున్నారని, ప్రధానిని విమర్శించవద్దని రాజ్యాంగంలో ఉందా అని కేసీఆర్ నిలదీశారు.

'ఇర్రి' కేంద్రం?

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా ప్రధానంగా వ్యవసాయాధారిత జిల్లా. ఎక్కువభాగం వరి పంటను పండిస్తారు. ఇక్కడ పరిశోధనా సంస్థ ఏర్పాటుచేస్తే రైతులకు కూడా అనుకూలంగా ఉంటుంది. వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి సొంత జిల్లా నెల్లూరు కావడం కలిసొచ్చే అంశంగా చెప్పవచ్చు.

ఏఆర్ఎస్ లో శాస్త్రవేత్తల బృందం

భూముల పరిశీలన అనంతరం శాస్త్రవేత్తల బృందం నెల్లూరులోని వ్యవసాయ పరిశోధన క్షేత్రం(ఏఆర్ఎస్)ను సందర్శించింది. రైస్ మ్యూజియంను సందర్శించడంతో పాటు ఏఆర్ఎస్ లో జరుగుతున్న అన్ని కార్యకలాపాలను స్థానిక శాస్త్రవేత్తల నుంచి తెలుసుకున్నారు. నూతన వంగడాల ఆవిష్కరణల ప్రదర్శన క్షేత్రాలను పరిశీలించారు. నెల్లూరు శాస్త్రవేత్తలు సృష్టిస్తున్న వంగడాల విశిష్టతను తెలుసుకున్నారు. అనంతరం ఇర్రి శాస్త్రవేత్తలను ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ వల్లభనేని దామోదర్ నాయుడును ఘనంగా సత్కరించారు.

రీజనల్ ఇన్నోవేటివ్ సెంటర్ ప్రయోజనాలు:

ప్రస్తుతం సంకరీకరణ ద్వారా కొత్త వంగడాలు సృష్టిస్తున్నారు. వాటిలో కొన్ని సత్ఫలితాలను ఇస్తున్నాయి. మరికొన్ని విఫలమవుతుండటంతో రైతులు నష్టపోతున్నారు. ఈ సెంటర్ ద్వారా దీర్ఘకాలం మనుగడలో ఉండే వరి వంగడాలను సృష్టిస్తారు. వాతావరణంలో చోటుచేసుకునే అనూహ్య మార్పులను తట్టుకోవడంతో పాటు స్థిరమైన దిగుబడులు దీర్ఘకాలంపాటు లభించే వంగడాలను సృష్టించడం ఇందులోని ప్రత్యేకత. పోషక విలువలు కలిగిన ధాన్యాన్ని ఉత్పత్తి చేయడంతో పాటు దిగుబడి కూడా 25 శాతానికిపైగా అధికం చేయడం ఇందులోని మరో ముఖ్యమైన విశేషం. వరి ఆధారిత ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు అభివృద్ధి చేయడం కూడా ఇన్నోవేటివ్ సెంటర్ లోని కార్యకలాపాల్లో ఓ భాగం.

శాస్త్రవేత్తలు డాక్టర్ నఫీస్ మెహ్, డాక్టర్ అరవింద్ కుమార్, డాక్టర్ ఇల్లాస్ జానయ్య, డాక్టర్ వికాస్ కుమార్ సింగ్, రూబినా నిషాత్, ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి దామోదర్ నాయుడు, పరిశోధన సంచాలకులు ఎన్.వీ నాయుడు ఉన్నారు.

హోరు తప్పదా?

(మొదటిపేజీ తరువాయి)

కావటంలేదని ప్రతిపక్ష నాయకుడు వైయస్.జగన్ ప్రకటించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వేటు వేసేవరకు సమావేశాలు బహిష్కరిస్తామన్నారు. అలాగే కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల్లో భాగస్వాములై మిత్రులుగా ఉన్న తెలుగుదేశం, బీజేపీల మధ్యకూడా ఏపీకి కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యత లేదన్న అంశంపై వైరం జరుగుతోంది. ఏ నిమిషంలో వీరి బంధం కొనసాగుతుందో, తెగుతుందోనని ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రంపై పోరాటం కొనసాగించాలని ఇప్పటికే తెలుగుదేశం పార్టీ అధినేత సీఎం చంద్రబాబునాయుడు తన పార్టీ ఎంపీలను ఆదేశించారు. ఇదిలా ఉండగా శాసనసభ సమావేశాల్లో నరేంద్రమోడీ ప్రభుత్వం ఇప్పటివరకు ఏమిచ్చింది, ఇక నుంచి కేంద్రం ఏమి చేయనుంది అనేది చెప్తామని బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రకటించారు. ఇలాంటి ప్రత్యేక పరిస్థితుల్లో జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు అందరిలో ఆసక్తిని కలిగిస్తున్నాయి. దీనికితోడు ఈ నెల 21న కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నట్లు శనివారం వైయస్.జగన్ ప్రకటించారు. కొద్దిరోజుల క్రితం జనసేనాధిపతి పవన్‌కళ్యాణ్ ప్రత్యేకహోదా సాధనకోసం జగన్ కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని, అందుకు అవసరమైన ఎంపీల బలాన్ని కూడగడతానని చెప్పారు. పవన్ సలహామేరకు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నానని, అవసరమైన ఎంపీల బలాన్ని తెలుగుదేశం ఎంపీలతో సహా పవన్ కళ్యాణ్ కూడగట్టాలని జగన్ ప్రకటించారు. ఇదే సమయంలో ఏపీకి కేంద్రం చేస్తున్న అన్యాయంపై టీడీపీ పోరు సాగిస్తుండగా, బీజేపీ నేతలు ఏపీకి ఎంతో చేశామని గత నెలరోజులుగా ప్రగల్భాలు పలుకుతుండగా, టీడీపీ శ్రేణులు బీజేపీ నాయకుల ప్రగల్భాలను తోసిపుచ్చుతున్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం చెప్తున్న దాంట్లో నిజమేంటో ప్రజలకు వివరించాలన్న ఆలోచనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో కీలక బాధ్యతలు నిర్వహించిన ముగ్గురు మాజీ అధికారులతో ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని పవన్‌కళ్యాణ్ ఏర్పాటు చేశారు. ఆ కమిటీ నివేదిక ప్రకారం కేంద్రం అన్ని విధాల ఏపీకి అన్యాయం చేసిందని తేల్చి చెప్పినట్లయింది. దాదాపు అందుబాటులో ఉన్న సమాచారం మేరకు కేవలం 11 అంశాలలో కమిటీ అధ్యయనం చేసిందని, ఇప్పటివరకు రెవెన్యూ లోటు, విద్యాసంస్థల ఏర్పాటు, విదేశీ రుణసహాయం, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సింది 75,542కోట్లుగా ప్రకటించింది. ఇవికాక పోలవరం, రాజధాని నిర్మాణం కూడా కేంద్రం ఇవ్వాలని, దీనికితోడు దుగరాజపట్నం పోర్టును వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని, అయితే నాలుగేళ్ళయినా పరిశీలన చేస్తున్నామంటూ కేంద్రం, ఇప్పటివరకు మీనమేషాలు లెక్కించటం రాష్ట్ర ప్రభుత్వానికి సరికాదని, అనుభవజ్ఞులని 2014 ఎన్నికల్లో మద్దతు ఇచ్చాను. ఇలా అన్యాయం జరిగిన ఏపీలో ప్రజలు తీవ్ర అసహనానికి గురవుతున్నారని పవన్‌కళ్యాణ్ ప్రకటించారు. ఆయన కేంద్రంతో పాటు ఇప్పటివరకు చంద్రబాబునాయుడు మెతకవైఖరి అవలంభించటాన్ని తప్పుబట్టారు. ప్రత్యేకహోదాకు ఏదీ సాటిరాదని, ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వాల్సిందేనని పునరుద్ఘాటించారు. ఇలా ప్రత్యేకహోదా పేరుతో కేంద్రంపై అన్ని పార్టీలు దండెత్తుతూనే ఉన్నాయి.

అయితే ఇందులో ఎవరి రాజకీయ ప్రయోజనాల మేరకు వారు వ్యూహాత్మకంగా ఎత్తుగడలు వేస్తున్నారు. ప్రత్యేకహోదాపై పార్లమెంట్‌లో పోరు సాగించటంతో పాటు అసెంబ్లీలో టీడీపీ, బీజేపీల మధ్య కొట్లాట తప్పేలా కన్పించటం లేదు. అయితే అధికారంలో ఉంటూనే ఢిల్లీలోని పార్లమెంట్‌లో, ఇక్కడ అసెంబ్లీలో మిత్రపక్షాల నేతలు పోరు సాగించటంలో ఆంతర్యం ఎవరికీ అంతుబట్టకుండా ఉంది. అయితే పవన్‌కళ్యాణ్ నివేదిక ప్రకారం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎలాంటి మేలు చేయటం లేదని తేలిపోయింది. బీజేపీ నేతలు ఈ నివేదిక ఆధారంగా రాష్ట్రంలో గళం విప్పే పరిస్థితులు కన్పించటం లేదు. అయితే వైసీపీ అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించినా, కేంద్రంపై పెట్టనున్న అవిశ్వాస తీర్మానానికి టీడీపీ మద్దతు పలుకుతుందా లేదా అనేది చూడాల్సి ఉంది. రాష్ట్ర ప్రత్యేక హోదా సాధన గురించి అసెంబ్లీలో కూడా హోరెత్తించి కేంద్రం వైఖరిని ఎండగట్టే పరిస్థితులు కన్పిస్తున్నాయి. సంఖ్యాబలం నామమాత్రంగా ఉన్న బీజేపీ సభ్యులు టీడీపీ దాడిని ఎలా ఎదుర్కొంటారోనని రాజకీయవర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.

ట్యాంకర్లపై నిఘా

(మొదటిపేజీ తరువాయి)

రోజుకు ఎన్ని ట్యాంకర్లు ఎక్కడి నుంచి ఎక్కడికి అనేది నిర్ణయిస్తారు. నీటి సరఫరా కోసం ఎంపిక చేసిన ట్యాంకర్ల డ్రైవర్లకు జీపీఎస్ లైవ్ ట్రాకింగ్ మానిటరింగ్ సిస్టమ్ ఉన్న సెల్‌ఫోన్లను అందిస్తారు. ఆ ఫోన్ వాడకంపై డ్రైవర్లకు ముందుగానే శిక్షణనిస్తారు.

మంచినీటి ట్యాంకరు ఖాళీగా బయలుదేరినప్పటి నుంచి మంచినీరు నింపుకోవటం, నిర్దేశించిన ప్రాంతానికి వెళ్ళి నీటిని ప్రజలకు అందించటం వరకు ఫోటోలతో సహా వాహనం ప్రయాణించిన సమయం, ట్యాంకర్‌లో ఎంత నీరు నింపిందీ ఇతర వివరాలతో సహా నమోదు చేసి సంబంధిత కార్యాలయానికి సమాచారం ఇస్తుంది. ఇందులో ఏమాత్రం తేడా ఉన్నా ఆయా ప్రాంతాలకు చేరాల్సిన మంచినీటి ట్యాంకర్లు చేరకపోయినా అధికారులు పర్యవేక్షిస్తూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తారు. ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానం వల్ల ప్రజలకు చేరాల్సిన మంచినీరు అందుతుంది.

ఈ పద్ధతిలో ఏమాత్రం తేడా వచ్చినా ట్యాంకర్ కాంట్రాక్టర్లకు బిల్లులు కట్. ఈ విధానాన్ని ప్రకాశం జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా నిర్వహించారు. సత్ఫలితాలు రావటంతో ఈ ఏడాది నుంచి రాష్ట్రమంతా అమలు చేసేందుకు నిర్ణయించారు.


త్రిపురలో బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)

ఒక్క సీటు కూడా దక్కలేదు. ఇక్కడ గెలిచిన స్వతంత్ర అభ్యర్థులు ఇద్దరూ ప్రభుత్వం ఏర్పాటులో కీలకం కానున్నారు. మేఘాలయలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మొత్తం 60 స్థానాలకుగాను కాంగ్రెస్‌కు 21, నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) 19 స్థానాలు,ఇతరులు 17 స్థానాలు గెలుచుకోగా, బీజేపీకి 2 స్థానాలు మాత్రమే దక్కాయి. ఇక్కడ కూడా స్వతంత్ర అభ్యర్థులే భవిష్యత్ నిర్దేశకులుగా మారారు.

మావోయిస్టు మృతదేహాల గుర్తింపులో గందరగోళం

ఆలస్యంగా పూర్తైన పోస్టుమార్టం
గంటలకొద్దీ బంధువుల నిరీక్షణ
ఆసుపత్రి వద్ద గట్టి బందోబస్తు




విశాలాంధ్ర- భద్రాచలం : ఆంధ్ర, చత్తీస్‌గఢ్ సరిహద్దులో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టులతో పాటు గ్రేహౌండ్ కమాండర్ సునీల్ కుమార్ మృతదేహాలను ప్రత్యేక హెలికాప్టర్‌లో భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాలతో సునీల్ కుమార్ అంత్యక్రియలు జరిగాయి. ఆయనకు పోలీసు ఉన్నతాధికారులు నివాళు లర్పించారు.

హైకోర్టు ఆదేశాల మేరకు వ్యవహరించడం, ఫోరెన్సిక్ అధికారుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించేందుకు కొంత సమయమే పట్టినట్టు పోలీసు వర్గాలు వెల్లడించాయి. అయితే మృతదేహాల గుర్తింపులో కొంత గందరగోళం నెలకొంది. మృతుల కుటుంబాలు ఆసుపత్రి ప్రాంగణంలో గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. ఎట్టకేలకు మృతులను దాడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్, ఇత్రు (తిప్పాపురం), బుద్రి (చత్తీస్‌గఢ్) రామే (సుకుమా), చత్తీస్‌గఢ్ సెక్షన్ కమాండర్ మల్లేష్, కమల (వెస్ట్ బస్తర్), కోసి (రంగయ్‌గూడెం), సుఖి (గంగులోర్), రత్న (బీజాపూర్), సోంబిలుగా గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం ప్రక్రియ ముగిసిన తర్వాత మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు. రెండ్రోజుల నుంచి ఆసుపత్రి ప్రాంగణంలో పోలీస్ పహారా ఉంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మళ్లీ కాల్పులు...

భద్రాచలం ఏజెన్సీలోని చర్ల, వెంకటాపురం సరిహద్దులోగల కోడిపుంజుల గుట్ట వద్ద శనివారం ఉదయం పోలీసులకు, మావోయిస్టులకు మధ్య మళ్లీ కాల్పులు జరిగాయి. శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్ సమయంలో కొందరు మావోయిస్టు అగ్రనేతలు తప్పించుకొన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసు బలగాలు అక్కడున్న గుట్టలను చుట్టుముట్టడంతో అటవీప్రాంతం మరోసారి కాల్పు మోతతో మార్మోగింది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక మన్యం ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.


విశాఖలో పెళ్ళిళ్ల సందడి



- దాదాపుగా 7 వేల వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం
- కిటకిటలాడుతున్న కళ్యాణమండపాలు, హోటళ్లు
- కళా కుమార్తె వివాహానికి హాజరైన చంద్రబాబు, మంత్రులు

విశాలాంధ్ర-విశాఖపట్నం : విశాఖ నగరంలో పెళ్లిళ్ల సందడి నెలకొంది.ఈ నేపథ్యంలోఓ కళ్యాణమండపాలు, హోటళ్లు కిటకిటలాడుతున్నాయి. నగరంలో దాదాపుగా 7 వేల మంది జంటలకు 3, 4 తేదీల్లో వివాహాలు జరుగుతున్నట్లు పురోహితులు చెబుతున్నారు. దీంతో ఒక్కసారిగా కళ్యాణమండపాలకు, పురోహితులకు, హోటళ్లకు గిరాకీ పెరిగిపోయింది. నగరంలో మున్సిపాల్టీకి చెందిన 36 కళ్యాణమండపాలు, ప్రైవేటువి దాదాపుగా 50,200 వరకు హోటళ్లు ఉన్నాయి. ఇవన్నీ సరిపోక వివాహాలు చేసుకుంటున్న కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారు.జనవరి, ఫిబ్రవరి నెలలో మౌఢ్యం కారణంగా వివాహాలకు ముహూర్తాలు లేవు. దీంతో మార్చిలోనే ఎక్కువ మంది వివాహాలకు ముహూర్తాలు కుదిరాయి. 3, 4 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల మందికి పెళ్లిళ్లు జరుగుతున్నాయంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దీంతో ఆర్టీసి బస్సులు కిటకిటలాడుతున్నాయి. దీంతో ఆటోలు, కార్లకు గిరాకీ పెరిగింది. ఇదే అదనుగా ప్రైవేటు వాహనాలు అదనంగా డిమాండ్ చేస్తుండటంతో ప్రయాణికులు చేతిచమురు వదిలించుకోవాల్సి వస్తోంది. శనివారం సాయంత్రం నగరంలోని ఎయు గ్రౌండ్స్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, విద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళా వెంకట్రావు కుమార్తె వివాహం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నగరానికి తరలి వచ్చారు. దీంతో హోటళ్లలోని గదులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది.

కాంట్రాక్ట్ కార్మికుడు సజీవ దహనం



విశాలాంధ్ర-గోపాలపట్నం: విశాఖపట్నం గోపాలపట్నం పరిసరప్రాంతంలో ఉన్న ఎల్జీ పాలిమర్స్ కంపెనీలోని తోటలో శనివారం మంటలు చెలరేగి ఓ కాంట్రాక్ట్ కార్మికుడు సజీవ దహనమైన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం... కంపెనీలోని టేకు తోటలో ఉదయం 8గంటల సమయంలో కుమార్‌రాజ్ అనే కాంట్రాక్ట్ కార్మికుడు ఎండుటాకులను తగలబెడుతుండగా ఒక్కసారిగా మంటలు గాలిలోకి ఎగసిపడటంతో ఒక్కసారిగా మంటలు అతడ్ని చుట్టుముట్టడంతో మంటల్లో కుమార్‌రాజ్ సజీవదహన మయ్యాడు. కుమార్‌రాజ్ ఇక్కడ గత పదేళ్లుగా కాంట్రాక్ట్ కార్మికునిగా పనిచేస్తున్నారు. ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న పెందుర్తి సీఐ సూర్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. పెందుర్తి సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కుమార్‌రాజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా ఎల్జీ పాలిమర్స్‌లో కనీస నిబంధనలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతుని కుటుంబీకులు, బంధువులు కంపెనీ గేటు ఎదుట ధర్నాకు దిగారు. ఈ నేపథ్యంలో పాలిమర్స్ యాజమాన్యం బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం వారు వెనుదిరిగారు.

ఈ-హాజరుతో టీచర్లపై చర్యలు తగవు: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఈ-హాజరు విధానంతో ఉపాధ్యాయులపై చర్యలు తగదని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు తెలిపారు. ప్రత్యేక యాప్‌లోని లోపాలను సవరించకుండా విద్యాశాఖ నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. ఈ మేరకు శనివారం వారు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. ఏపీ టెట్ యాప్‌లో సెలవుల నమోదులో ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. సెలవు మంజూరు అధికారంలో నిబంధనలు యాప్ ద్వారా మార్పు చేయడం సరికాదన్నారు. ఒక్కోసారి సెల్‌టవర్ పనిచేయకపోవడంతో మారుమూల గ్రామాల్లో యాప్ ద్వారా సెలవు నమోదు చేయడం కుదరడం లేదన్నారు. దీంతో పాఠశాలకు గైర్హాజరైనట్లు అధికారులు మెమోలు జారీ చేస్తూ టీచర్లను వేధింపులకు గురిచేస్తున్నారని వారు ఆరోపించారు. ఉన్నతాధికారులు యాప్ ద్వారా సెలవు నమోదు చేయాలని వారు సూచించారు. అయితే సెలవు చీటీల ద్వారా క్రిందిస్థాయిలో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు తమ అనుమతి కూడా రాతపూర్వకంగా తీసుకోవాలని వేధిస్తున్నారన్నారు. సెలవుల నమోదుకు కచ్చితమైన కటీఫ్ తేదీని నిర్ణయించాలని నేతలు డిమాండు చేశారు.

ప్రతీకారం తప్పదు

- టీఆర్ఎస్ నేతలపై దాడులు చేస్తాం
- ఓ ద్రోహి సమాచారం వల్లే ఆ దారుణం
- ఇది ఎన్‌కౌంటర్ కాదు...ఏకపక్ష కాల్పులు
- కార్పొరేట్ శక్తులకు భూమి, నీరు దోచిపెట్టేందుకే.
- మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : తెలంగాణ-ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల సరిహద్దులో శుక్రవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో అగ్రనేతలెవరూ చనిపోలేదని మావోయిస్టు పార్టీ ప్రకటించింది. ఇకపై తాము టీఆర్ఎస్ నాయకులపై దాడులను ముమ్మరం చేస్తామని హెచ్చరించింది. హిందుత్వ నాయకుడు రమణ్‌సింగ్, నియంత కేసీఆర్‌లు కలిసికట్టుగా ఆదివాసీలపై, ప్రశ్నించే వారిని నిర్మూలించేందుకు దుర్మార్గమైన దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించింది. తాము ఇక ప్రతిఘటన పోరాటాలు సాగిస్తామని స్పష్టం చేసింది. విప్లవ ఉద్యమాలపై, విప్లవకారులపై రాజ్యహింస సాగిస్తే తాము ఉపేక్షించబోమని మావోయిస్టు పార్టీ హెచ్చరించింది. ఎన్‌కౌంటర్‌పై పోలీసులు ప్రజల్లో అయోమయం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొంది. తెలంగాణ రాష్ట్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం సరిహద్దు తడపల గుట్ట, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర సరిహద్దు పూజారి కాంకేడ్ వద్ద జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 10 మంది మావోయిస్టులు చనిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో గ్రేహౌండ్స్ కమెండో సుశీల్ కుమార్ కూడా ప్రాణాలు వదిలారు. ఈ ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన పేరుతో శనివారం మీడియాకు ఓ ప్రకటన అందింది. కార్పొరేట్లకు వనరులు దోచిపెట్టడం కోసం తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వాలతో పాటు కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీ నిర్మూలనే లక్ష్యంగా దాడులు చేస్తున్నాయని, ప్రజల సహకారంతో ఈ దాడులన్నింటినీ తిప్పికొడతామని ఆయన హెచ్చరించారు. నీళ్లు, భూమిని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసేందుకే కేసీఆర్ బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నారని ఆయన విరుచుకుపడ్డారు. ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేతలు చనిపోయారని ప్రచారం చేసి ప్రజల మనోధైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని జగన్ పేర్కొన్నారు. హరిభూషణ్, బడే చొక్కారావు, కంకణాల రాజిరెడ్డి చనిపోలేదని, క్షేమంగానే ఉన్నారని తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన వారిలో కాజీపేట మండలం రాంపేట్‌కు చెందిన దూడబోయిన స్వామి అలియాస్ సుధాకర్, బీజాపూర్‌కు చెందిన రత్న ఉన్నారన్నారు. మిగతా వారంతా దంతెవాడకు చెందిన వారని తెలిపారు. ఓ ద్రోహి ఇచ్చిన సమాచారంతో ముందురోజు రాత్రే పోలీసు బలగాలు చుట్టుముట్టాయని, కాలకృత్యాలు తీర్చుకుంటుండగా పోలీసులు ఏకపక్షంగా కాల్పులు జరిపారని జగన్ తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ అగ్రనేత యాపా నారాయణ అలియాస్ హరిభూషణ్ మరణించారనే ప్రచారం జరిగింది. అంతేకాదు ఆయన భార్య జజ్జర్ల సమ్మక్క అలియాస్ శారద కూడా ప్రాణాలు కోల్పోయారని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే వీరిద్దరూ తప్పించుకున్నారు. సరిహద్దుల్లో ఎప్పటికప్పుడు ఎత్తులు వేస్తూ ముందుకు సాగుతోన్న హరిభూషణ్‌ను మట్టుబెట్టాలనే పక్కా వ్యూహంతో పోలీసులు దాడి చేశారు. అయినా ఆయన తప్పించుకున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక హరిభూషణ్‌కు పార్టీ పగ్గాలు అప్పగించిన కేంద్ర కమిటీ...ఆయననే అధికార ప్రతినిధి హోదాలో ఉంచింది. ఆయనకు ఛత్తీస్‌ఘడ్‌లో లక్ష దాదాగా గుర్తింపు ఉంది. జగన్ పేరిట అధికార ప్రతినిధి బాధ్యతలను ఈయనే నిర్వహిస్తున్నారు.

10న గ్రంథాలయాల అభివృద్ధిపై రాష్ట్ర సదస్సు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయాల అభివృద్ధిపై ఈనెల 10వ తేదీ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కళ్ళేపల్లి మధుసూధనరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసదస్సుకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు, విద్యాశాఖ కమిషనర్ కె.సంధ్యారాణి, ఆదిత్యనాథ్‌దాస్, ఏపీ పౌర గ్రంథాలయాల శాఖ డైరెక్టర్ పి.పార్వతి, గ్రంథాలయాల 13 జిల్లాల చైర్మన్లు, కార్యదర్శులు హాజరవుతారు. కావున ఈసదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు భారీగా తరలిరావాలని కళ్ళేపల్లి పిలుపునిచ్చారు. ఈ సదస్సు గ్రంథాలయాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలతోపాటు, ఉద్యోగుల సమస్యలను చర్చించనున్నట్లు తెలిపారు.

ఏఐటీయూసీ రాష్ట్ర సమావేశం 15కి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఈనెల 6వ తేదీ జరగాల్సిన ఎఐటీయూసీ రాష్ట్ర సమితి సమావేశం 15వ తేదీకి వాయిదా పడినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక హోదా సాధన కోసం మార్చి 6వ తేదీ ఢిల్లీలో ఆందోళన కార్యక్రమం జరుగుతున్నందున ఎఐటీయూసీ కార్యకర్తలంతా పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. దీనికోసమే ఈనెల 5,6 తేదీల్లో జరగాల్సిన యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్, కౌన్సిల్ సమావేశాలను వాయిదా వేసినట్లు తెలిపారు. గొల్లపూడిలోని జోశ్యభట్ల సత్యనారాయణ భవన్‌లో 15వ తేదీ ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, దీనినే నోటీస్ భావించి సభ్యులంతా సకాలంలో హాజరు కావాలని ఓబులేసు కోరారు.

మాజీ ఎమ్మెల్యే తటవర్తి సత్యవతి కన్నుమూత



విశాలాంధ్ర-రాజమహేంద్రవరం : రాజమండ్రి మాజీ ఎమ్మెల్యే తటవర్తి సత్యవతి శనివారం తెల్లవారుజామున 3 గంటలకు కన్నుమూశారు. ఆమె వయస్సు 74సంవత్సరాలు. ఆమెకు భర్త హనుమంతరావు,ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. 1978లో ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి అనూహ్య విజయం అందుకున్న ఆమె పార్లమెంటరీ సెక్రటరీగా సమర్థమంతంగా బాధ్యతలు నిర్వహించారు. రాజమండ్రి తొలి మహిళా ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఆ తర్వాత రాజకీయాల్లో కొనసాగినా, గత కొన్నేళ్లుగా పూర్తిగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. పిఠాపురం ఉమర్ అలీషా పీఠం భక్తురాలిగా చురుగ్గా పాలుపంచుకుంటున్నారు. సత్యవతి మృతిపై సీపీఐ నగర కార్యదర్శి నల్లా రామారావు, కాంగ్రెస్ నగర అధ్యక్షులు ఎన్‌వి శ్రీనివాసరావు, వివిధ పార్టీల నాయకులు, నగర ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.



హోదాపై రచ్చ వద్దు

విశాలాంధ్ర-విజయనగరం మున్సిపాలిటీ : ప్రత్యేక హోదా చాలా సున్నితమైన అంశమని, దాన్ని జటిలం చేయాలనుకోవడం సరికాదని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి పి.అశోక్‌గజపతిరాజు అన్నారు. శనివారం విజయనగరం పట్టణంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ నిర్మించతలపెట్టిన నూతన భవనాలకు శంకుస్థాపన చేసిన మంత్రి అశోక్ అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆనాడు రాష్ట్ర విభజనచేసి, రాష్ట్రానికి అన్యాయం చేసిన వారే నేడు మొసలి కన్నీరు కారుస్తూ ఆందోళన చేస్తున్నారన్నారు. హోదాకు తగినట్లు ప్యాకేజీ ఇస్తామని హామీ ఇవ్వడంతోనే ప్యాకేజీకి అంగీకరించాల్సి వచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా చూసుకుంటే ఏపీలో ఇటీవల కార్యకలాపాలు ఎక్కువయ్యాయని, జాతీయస్థాయితో పోల్చుకుంటే ఏపీలో రాకపోకలు పెరిగాయన్నారు. దేశంలో విమానాశ్రయాలను ప్రయాణికుల కోసం మాత్రమే కాకుండా సరకు రవాణా, విమానాల మరమ్మతులు తదితర అన్ని అవసరాలకు గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాల్సి వుందన్నారు. దేశ వ్యాప్తంగా 12 నుండి 17శాతం పెట్టుబడులు వస్తే, ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే 30 శాతం పెట్టుబడులను తేగలిగిన ఘనత తమదేనని అశోక్ వెల్లడించారు. ఇక పోతే అసెంబ్లీ సీట్ల పెంపు విషయంలో ఏపీకి అన్యాయం జరిగిందని కేంద్ర మంత్రి అశోక్ అసహనం వ్యక్తంచేశారు. దేశ చరిత్రలో ఏనాడూ ఏ జిల్లాలకు నేరుగా నిధులు కేటాయించిన చరిత్ర లేదని, అలాంటి సమయంలో విజయ నగరం జిల్లాకు నిధులు తెప్పించుకోగలగడం తమ పనితనానికి నిదర్శనమని అశోక్ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మీసాల గీత, జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బొద్దుల నర్శింగరావు, మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ, టీడిపి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ఇళ్లు, అక్రిడిటేషన్లకై 6న ధర్నాలు : ఏపీయూడబ్ల్యూజే

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఇళ్లు, అక్రిడిటేషన్ల కోసం ఈనెల 6వ తేదీన అన్ని జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) నిర్ణయించింది. ఇటీవల శ్రీకాకుళంలో రాష్ట్ర అధ్యక్షుడు నల్లి ధర్మారావు అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈమేరకు నిర్ణయించినట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని జర్నలిస్టులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన విధంగా మూడు పడకల గృహ నిర్మాణ పథకం సాధించే వరకూ దశలవారీగా ఆందోళనలు చేయడంతోపాటు జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు జరిపి అధికారులకు వినతి పత్రాలను ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గృహ నిర్మాణ పథకానికి సంబంధించి ఇంతవరకూ స్పష్టమైన ప్రభుత్వ ఉత్తర్వులు వెల్లడి కాకపోవడంతో జర్నలిస్టుల్లో అయోమయం నెలకొని ఉందన్నారు. చంద్రబాబుతోపాటు సమాచారశాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు సానుకూలంగా స్పందిస్తున్నారే తప్ప ఆచరణలో ఫలితం కన్పించడంలేదన్నారు. గృహ నిర్మాణానికయ్యే వ్యయంలో 70 శాతం సబ్సిడీతో ఈ పథకాన్ని ప్రకటిస్తూ బడ్జెట్‌లో రూ. 200 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆయన డిమాండు చేశారు. అలాగే కొత్త అక్రిడిటేషన్లు ఏప్రిల్ 1వ తేదీలోపు జారీ చేయాలన్నారు. జర్నలిస్టుల పిల్లలకు అన్ని రకాల విద్యా సంస్థల్లో ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వాలని, సంక్షేమ నిధికి రూ. 50 కోట్లు కేటాయించాలని, వేజ్ బోర్డు నిర్ణయాలకు అనుగుణంగా యాజమాన్యాలు చెల్లించడం.. వంటి డిమాండ్ల సాధన కోసం ఉద్యమం చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు సుబ్బారావు తెలిపారు.

ఇంజనీర్లకు శ్రీరామకృష్ణయ్య స్ఫూర్తిదాయకం

16వ నీటిపారుదల దినోత్సవంలో మంత్రి దేవినేని



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ప్రముఖ ఇంజనీర్ డాక్టర్ కె శ్రీరామకృష్ణయ్య నేటి తరాల ఇంజనీర్లకు స్ఫూర్తిదాయకం కావాలని రాష్ట్ర జలవనరులశాఖమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆకాంక్షించారు. శ్రీరామకృష్ణయ్య 92వ జయంతి సందర్భంగా రాష్ట్ర జలవన రులశాఖ కార్యాలయ ఆవరణలో 16వ నీటిపారుదల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయలసీమ జలసీమగా మారటానికి మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కారకులైతే దానిని సాకారం చేయటంలో శ్రీరామకృష్ణయ్య విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు-నగరి తదితర ముఖ్యమైన ప్రాజెక్టుల నిర్మాణాలను చేపట్టినట్లు ఆయన వివరించారు. పట్టిసీమ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపుతో నిర్మించడం వల్లే కృష్ణా డెల్టాలో వేలాది రూపాయల విలువ చేసే పంటను కాపాడగలిగామన్నారు. కుప్పం కంటే ముందే పులివెందుల నియోజకవర్గానికి నీళ్లిచ్చామన్నారు. సకాలంలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు మేలు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి రూ. 2,950 కోట్ల రూపాయలు కేంద్రం నుంచి రావాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలలో నీటి వసతి కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాజెక్టులలో సమర్ధవంతంగా పనిచేసిన ఇంజనీర్లు, రిటైర్డ్ ఇంజనీర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు ఉప్పునీటిని మంచినీటిగా మార్చే మొబైల్ వాటర్ ట్రీట్‌మెంట్ వాహనం (వాటర్ ప్యూరిఫికేషన్ వెహికల్), వాటర్ స్ట్రక్చరింగ్ యూనిట్, మేగ్నెట్ సేఫ్టీ యంత్రాలను వీడియోల ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం వెంకటేశ్వరరావు, జలవనరుల శాఖ రాష్ట్ర ఎపెక్స్ కమిటీ సభ్యులు ఆళ్ళ గోపాలకృష్ణ, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుత్తా శివరామకృష్ణ, జలవనరుల శాఖ ఈఎన్‌సి (అడ్మిన్) కె శ్రీనివాస్, కేడీఎస్సీఈ సతీష్‌కుమార్, ప్రాజెక్టు కమిటీ చైర్మన్లు జీపీ భుజంగరాయులు, మైనేని మురళీకృష్ణ, డీసీ చైర్మన్లు, నీటి సంఘాల అధ్యక్షులు, జలవనరుల శాఖ ఎక్స్‌పర్ట్ కమిటీ సభ్యులు, పలువురు రిటైర్డ్ ఇంజనీర్లతోపాటు 13 జిల్లాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే లొల్లి

టీడీపీ, బీజేపీపై కేవీపీ విమర్శ



విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్ : కాంట్రాక్టులు, కమీషన్ల కోసమే టీడీపీ, బీజేపీ కొట్టుకుంటున్నాయని, ఆ రెండు పార్టీల మధ్య విధానపరమైన భేదాభిప్రాయాలు ఏమీ లేవని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు ఆరోపించారు. పోలవరం, ఇతర ప్రాజెక్టుల కాంట్రాక్టుల కేటాయింపుపై ఇరు పార్టీల మధ్య పొరపొచ్చలు వచ్చాయని స్పష్టంచేశారు. అనేక ఆశలతో కాంగ్రెస్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును ప్రారంభించిందని తెలిపారు. ఏపీకి లాభం జరగాలనే ఉద్దేశంతో రాష్ట్ర విభజన సమయంలో పోలవరానికి జాతీయ హోదా కల్పించినట్లు రామచంద్రరావు చెప్పారు. శనివారం ఇందిరాభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీపై ఆర్థిక భారం పడకుండా పోలవరం నిర్మాణానికి వందశాతం నిధులు కేంద్ర ప్రభుత్వమే భరించేలా బిల్లులో పొందుపర్చామని వివరించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత ఆ ప్రాజెక్టును కేంద్రం నుండి తన చేతుల్లోకి తీసుకోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం కొంత భారం భరించాల్సి వచ్చిందని ఆరోపించారు. మొత్తం ఖర్చు కేంద్రమే భరించే అవకాశం ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు తీసుకున్నదని రామచంద్రరావు సూటిగా ప్రశ్నించారు. కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు దండుకొని సామాన్య ప్రజలపై రూ. 6వేల కోట్ల అదనపు భారం మోపారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ పనులు చేపట్టడానికి ఉద్దేశపూర్వకంగానే చంద్రబాబు ప్రభుత్వం సహకరించలేదని నిందించారు. ఇప్పుడు కాంట్రాక్టర్ల మార్పిడి, పంపకాలలో తేడా వల్ల టీడీపీ, బీజేపీ మధ్య చిచ్చురేగిందని, అందుకే నిందారోపణలు చేసుకుంటున్నాయని అన్నారు. చంద్రబాబు దురాశ కారణంగానే పోలవరం ప్రాజెక్టు రెండేళ్లు ఆలస్యమైందని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజాగ్రహాన్ని గ్రహించి చంద్రబాబు ప్రత్యేక హోదా పాట అందుకున్నారన్నారు. ప్రత్యేక హోదా కంటే ప్రత్యేక ప్యాకేజీ వల్లే లాభం ఉందని చెప్పిన చంద్రబాబు...ఇప్పుడు మాటెలందుకు మారుస్తున్నారని ప్రశ్నించారు. పోలవరంపై చంద్రబాబుకు ఆయన 8 ప్రశ్నలు సంధించారు.

ఎయిర్‌పోర్టు నిర్వాసితులకు న్యాయం చేయాలి...

అక్కినేని వనజ



గన్నవరం : విమానాశ్రయ విస్తరణలో బంజారు భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారం వెంటనే చెల్లించాలని సిపిఐ జిల్లా సమితి కార్యదర్శిని అక్కినేని వనజ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని బుద్ధవరం గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న రాజీవ్ కాలనీలో రోడ్డు రాస్తారోకో నిర్వహించారు. బ్రిటీష్ వారి కాలం నుండి బుద్ధవరం గ్రామ 14 కుటుంబాలకు చెందిన పేదలు 40 సెంట్లు బంజారు భూములు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. విమానాశ్రయ విస్తరణతో ఆ కుటుంబాల వారు రోడ్డున పడుతున్నారన్నారు. వీరికి నష్టపరిహారం తక్షణమే చెల్లించాలని కోరారు. సిపిఐ ఏరియా కార్యదర్శి కొండా వీరస్వామి మాట్లాడుతూ పేదలకు నష్టపరిహారం చెల్లించ కుండా అభివృద్ధి పేరుతో పేదలకు అన్యాయం చేయడం సరికాదన్నారు. బుద్ధవరం గ్రామం నుండి తూర్పు వైపుగా విమానాశ్రయం దావాజీగూడెం వరకు రోడ్డు విస్తరణ నిర్మాణం జరగాలన్నారు. వై.ఎస్.ఆర్.సిపి. వై. జనవరావు మాట్లాడుతూ అమరావతి ల్యాండ్ పూలింగ్ విధానాన్నే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఐ. నాయకులు పెద్ది వెంకటరత్నం, తిరుమీధి సుబ్బారావు, పర్సా వెంకటరత్నం, కట్టేవరపు విజయరావు, వడమట నరేష్, ముద్రబోయిన వెంకటేశ్వరరావు, సి.పి.ఎం నాయకులు పిల్లి మహేష్, దాను, గండికోట నాగరాజు, బుడుగు ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

సినీ పరిశ్రమకు గడ్డుకాలం

రెండోరోజూ సినిమాహాళ్ల మూత



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రాంతీయ భాషా చిత్ర పరిశ్రమకు గడ్డుకాలం నడుస్తోంది. వీపీఎఫ్ చార్జీలు తగ్గించేందుకు డిజిటల్ సంస్థలు ససేమిరా అనడంతో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు సినిమా ప్రదర్శనలను నిలిపివేశారు. సినిమా హాళ్లు బంద్ చేయడంతో ఆన్‌లైన్ బుకింగ్స్, అడ్వాన్స్ బుకింగ్స్ నిలిచిపోయాయి. దక్షిణాది రాష్ట్రాల్లో తెలుగు చిత్రపరిశ్రమ ఎన్నడూ లేనంత గడ్డుకాలాన్ని ఎదుర్కొంటోంది. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల తీరుకు నిరసనగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో తెలుగు, తమిళం, మలయాళ, కన్నడ చిత్రాల ప్రదర్శన నిలిచిపోయింది. వర్చువల్ ప్రింట్ ఫీజును తగ్గించాలని డిమాండు చేస్తున్న నిర్మాతలు క్యూబ్, యూఎఫ్ఓ వంటి డిజిటల్ సేవా సంస్థలు దిగిరాకపోవడంతో సినిమాలనే నిలిపివేయాలన్న సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇక బుక్ మై షో, ఈజీ మూవీస్, టికెట్ అడ్డా వంటి వెబ్ సైట్లు అడ్వాన్స్ బుకింగ్స్‌ను నిలిపివేశాయి. దీంతో ఇటీవల విడుదలైన స్కెచ్, అ, తొలిప్రేమ, ఛలో వంటి చిత్రాల కలెక్షన్లపై తీవ్ర ప్రభావం పడింది. ఇక తొలుత హిందీ, ఇంగ్లీష్ చిత్రాలను ప్రదర్శించేందుకు ఓకే చెప్పిన నిర్మాతల మండలి...ఇప్పుడు వారితోనూ మాట్లాడగా, ఆ సినిమాలనూ ప్రదర్శించరాదని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. డిజిటల్ సర్వీసు ప్రొవైడర్లు దిగి వచ్చే వరకు థియేటర్ల బంద్ నిర్వహించనున్నట్లు దక్షిణ భారత నిర్మాతల మండలి స్పష్టం చేసింది. ఇప్పటికే చాలామంది వీకెండ్ సరదాగా గడిపేందుకు ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకున్నారు. బంద్ దృష్ట్యా వారికి డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని మేనేజర్లు చెబుతున్నారు. శుక్రవారం అయితే చాలు...కొత్త కొత్త సినిమాలు రిలీజ్ అవుతుండటంతో థియేటర్ల వద్ద సందడి ఉండేది. వారాంతం కావడంతో కాలక్షేపం, వినోదం కోసం సినిమాకు వెళదామనుకొని థియేటర్‌కి వచ్చిన సినీ ప్రేక్షకులు...హాల్ ముందు ప్రదర్శనలు లేవు అనే బోర్డు చూసి నిరుత్సాహంగా వెనుదిరిగారు. ఈనెల చివర్లో పెద్ద పెద్ద సినిమాలు రిలీజ్ కానున్నాయి. ఆలోగా ఈ సమస్య జటిలం కాకుండా చర్యలు తీసుకోవాలని చిత్ర పరిశ్రమ కోరుకుంటోంది. ఇప్పటికే సినిమా థియేటర్లు బంద్ కారణంగా ఈ సినిమాలు రిలీజ్‌ని వాయిదా వేసుకున్నాయి. ఇంకోసారి సినిమాలు రిలీజ్ చేద్దామని అనుకున్నా మళ్లీ ఈ స్థాయిలో సినిమా హాల్‌లు దొరుకుతాయో లేదోనని చిన్న సినిమా నిర్మాతలు ఆందోళన చెందుతున్నారు.

నారి సారించాలి..

యుద్ధ విరమణకు, విరామానికి మధ్య తేడా ఉంది. క్షమించడానికి, సహించడానికి నడుమ భేదం ఉంది. సమాన హక్కుల కోసం స్త్రీలు సాగిస్తున్న మహోద్యమ ఉధృతి ఎప్పుడైనా మందగించినట్లు కనిపించి ఉంటే.. అది విరామమే తప్ప, విరమణ కాదు. పెచ్చరిల్లుతున్న అమానుష హింసాకాండపై పోరులో ఎక్కడైనా పట్టుసడలినట్లు అనిపిస్తే అది సహనమే తప్ప, క్షమించి వదిలేయటం కాదు. మహిళా సాధికారత దిశగా సాగుతున్న మహాప్రస్థానంలో రాజీలేని సుదీర్ఘ పోరాటాన్నే కొనసాగిస్తున్నారు. ఆ పోరాటస్ఫూర్తికి సంకేతమే మహిళా దినోత్సవం. అయితే సమాజాన్ని ప్రపంచాన్ని మార్చే మహాశక్తిగా ఎదిగే క్రమంలో నేటి భారత మహిళ మరింత స్ఫూర్తిని, సమరశీలతను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉంది. ఉత్సవాలు, పతాకావిష్కరణలతో తమ అజెండా అమల్లోకి రాదు.. జోలపాటలతో పనిజరగదు.. జ్వాలాశిఖలు కావాల్సిన తరుణం ఇది.

మహిళల జీవనప్రమాణాలను దేశాభ్యున్నతికి ప్రామాణికాలుగా తీర్మానించాలన్న పండిట్ నెహ్రూ ప్రవచిత స్ఫూర్తికి పాలకవర్గాలు సమాధికట్టి మహిళా సాధికారతను ఇంకా అందని ద్రాక్షగానే మిగిల్చాయి. 'మహిళను అబల అంటున్నాం. ఆమే సబల అయితే, నేడు నిస్సహాయంగా దిక్కులు చూస్తున్నవారంతా శక్తిమంతులవుతారు.' అని ఎనభై ఏళ్ల కిందటే మహాత్మాగాంధీ పేర్కొన్నారు. స్త్రీలు ఎన్నో రంగాల్లో పురుషులతో సమానమే కాదు, ఒక అడుగు ముందే ఉన్నా.. పలువిధాల వివక్షతకు, దోపిడీకి గురవుతూనే ఉన్నారు.స్త్రీలను చిన్నచూపుచూడడం, అవమానకర వ్యాఖ్యలుచేయడం మనకు అనాదిగాఉన్న జబ్బే. స్త్రీ బతుకు తన వయసు, వలపు, సొగసులతో పురుషులను సుఖపెట్టడానికి, సంతోషపెట్టడానికి తప్ప మరెందుకు పనికిరాదన్న నీతిసూత్రాలను రూపొందించిన సమాజం మనది. ...ఆ పని ఆడదానికి తగునా అని ఆడవారితోనే ప్రశ్నింపజేసిన ధర్మకోవిదుల చాతుర్యం వర్ధిల్లిన సంప్రదాయం మనది. స్త్రీ జీవిత పరమార్థం ఏమిటన్నది ఓ సినీకవిగారు చెప్పిన చిలకపలుకులు వింటే స్పష్టమవుతుంది. 'వయసు వలపు సొగసు పలికే యువతి బతుకే మధురం' అని ఆయన సెలవిచ్చారు. అంతేకాదు, 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అని మనుస్మృతి చెబుతోంది. భాస్కర శతకకర్త 'అంగన నమ్మరాదు తన యంకెకు రాని మహాబలాఢ్యులే భంగుల మాయలొడ్డి చెరుపందుల పెట్టు' అన్నారు. స్త్రీలంటే తక్కువ చూపు ప్రదర్శించడమే కాదు, వారి శక్తిసామర్థ్యాలపై ఏ మాత్రం నమ్మకం ఉంచేవారు కాదు. 'మగువలెరుక గలరే' అని ఆదికవి నన్నయ్య సందేహిస్తే 'తథ్యామిథ్యా లిలిక్తి ముగ్ధలకు కలదే' అని శ్రీనాథుడన్నారు. ఓ పూర్వకవి ఏకంగా 'వనితలకు పరి జ్ఞానంబు లేదు' అని సెలవిస్తే తెనాలి రామకృష్ణుడు 'ఉవిదలకు బుద్ధి పెడతలనుండుగాదె' అని మరింత దూకుడు ప్రదర్శించారు. ఇదంతా ఎందుకు చెప్పుకోవడమంటే... ఇంతటి ఘనచరిత్ర, వారసత్వం గల ఈ సమాజంలో నేడు స్త్రీలకు అంతకు మించిన ఆదరణ, గౌరవం, స్థానం ఎలా ఇవ్వగలుగుతారని చెప్పడానికే. బాగా అభివృద్ధి చెందిన పశ్చిమదేశాల్లోనూ మహిళల్ని వేధించడానికి ఆధునిక పద్ధతుల్ని అమల్లోకి తెచ్చాయి. కాబట్టి ప్రపంచమంతా స్త్రీల పరిస్థితి కొద్ది తేడాలతో ఒకేలా ఉంది.

భారత్‌లో ఆమె పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉంది. స్త్రీని ఒకవైపు ఆదిశక్తిగా ఆరాధిస్తూనే, మరోవైపు అణచివేతకు పాల్పడు తున్నారు. అంతేకాదు, తెలివిగా 'ఆకాశంలో సగం' వంటి నినాదాలతో దగా చేస్తున్నారు. పురుష ప్రపంచ మెరమెచ్చుల ఉచ్చుల్లో చిక్కిన స్త్రీ నిరంతరం పీడితురాలిగానే ఉండిపోతోంది. మమతానురాగాల ప్రమేయంలేని కఠిన నిర్బంధ గర్భాలు, మరణపురి సరిహద్దులకు చేరుస్తున్న ఆటవిక ప్రసవాలు, పాలు తాగి రొమ్ము దీలుస్తున్న దౌర్భాగ్య వైనాలు, హత్యలు, అత్యాచారాలు, అపచారాలు... ఒక్కటేమిటి స్త్రీది జన్మజన్మల దు:ఖం, యుగయుగాల మానని గాయం, మతాచారాలు మహిళల ముందరికాళ్లకూ బంధనాలవుతున్నాయి. ఈ రోజుకూ కొన్ని ప్రార్థనా మందిరాల్లోకి మహిళలకు ప్రవేశం కల్పించని ఆటవిక పరిస్థితులు నెలకొన్నాయి. స్త్రీ, పురుష సమానత్వ భావనకు రాజ్యాంగ పీఠిక మొదలు ప్రాథమిక హక్కులు, విధులు, ఆదేశిక సూత్రాల దాకా అన్నీ ఎత్తుపీట వేసినా ఆచరణలోకి రాని దౌర్భాగ్యం. ఎంత ప్రతికూల పరిస్థితులున్నా.. అతనితో సమానంగా సృజనాత్మక భాగస్వామ్యం కోసం ఆమె పోరాడుతూనే ఉంది.

ఐదు దశాబ్దాల కిందటే 1974లో పుల్‌రేణు గుహా సారథ్యంలోని బృందం దేశంలోనే తొలిసారిగా మహిళల వాస్తవ స్థితిగతులపై ప్రభుత్వానికి అధ్యయన నివేదిక సమర్పించింది. అంటే స్వాతంత్ర్యం వచ్చిన 24ఏళ్ల తర్వాత ఏలినవారికి ఈ అభాగ్య స్త్రీజనం గుర్తుకొచ్చారు. 1971లో ఏర్పాటుచేసిన ఈ కమిటీ మూడేళ్లు క్షేత్రస్థాయిలో స్త్రీల స్థితిగతులపై అధ్యయనం చేసి నివేదిక తయారుచేసింది. శిశుమరణాలు, స్త్రీ-పురుష నిష్పత్తి, నిరక్షరాస్యత వంటి విషయాల్లో స్త్రీ దయనీయస్థితిపై ఆ నివేదిక ఆందోళన వ్యక్తంచేసింది. ఆ తర్వాత నాలుగు దశాబ్దాల సుదీర్ఘ విరామానంతరం మహిళల వాస్తవ స్థితిగతులను అంచనా వేసేందుకు పామ్ రాజ్‌పుత్ నేతృత్వంలో యూపీఏ సర్కారు ఏర్పాటుచేసిన అత్యున్నత కమిటీ.. దేశవ్యాప్తంగా మహిళలపై పెచ్చరిల్లుతున్న హింస, తగ్గుతున్న స్త్రీ-పురుష నిష్పత్తి, వారి ఆర్థిక అసమానతలపై తక్షణమే దృష్టి సారించాలని హెచ్చరించింది. అవేమీ తగ్గకపోగా మహిళలపై జరుగుతున్న నేరాలు వివిధ రూపాలు తీసుకొని విజృంభిస్తున్నాయి. మహిళల ఆరోగ్యం గాలిలో దీపంలా మారింది. భ్రూణ హత్యలకు అంతులేకుండా పోతోంది. మహిళా కార్మికశక్తి, వారి ఆదాయాలు, అక్షరాస్యత స్థాయి, జననాల నిష్పత్తి.. అంశాల్లో అధమస్థాయిలో ఉన్న 20 దేశాల్లో భారత్ ఒకటికావడం ఆందోళనకరమే. యునెస్కో వెలువరించిన ప్రపంచ విద్యా నివేదిక ప్రకారం, ఇండియాలోని వయోజన నిరక్షరాస్యుల్లో మహిళలు 68శాతం ఉన్నారు. జనాభా లెక్కల ప్రకారం 19ఏళ్లయినా నిండకముందే పెళ్లిపీటలు ఎక్కుతున్న బాలికల సంఖ్య 41శాతం. ప్రపంచ బాల్య వివాహాల్లో 40శాతానికి మన దేశం కేంద్రమవుతోంది.పోషకాహార లోపం కారణంగా రక్తహీనతతో బాధపడుతున్న బాలికల సంఖ్య దేశంలో దాదాపు 70శాతమన్న అంచనాలు తీవ్రంగా కలవరపెడుతున్నాయి. 2012 డిసెంబరు నాటి నిర్భయ దురంతం తర్వాత ప్రభుత్వం కఠిన చట్టం తీసుకువచ్చినా పరిస్థితిలో పెద్దగా మార్పు రాలేదు. అత్యాచారాలు, లైంగికవేధింపులు యథావిధిగా కొనసాగుతూనే ఉన్నాయి. మహిళలకు రాజకీయ సాధికారత ద్వారా ఈ స్థితిగతుల్ని మార్చే అవకాశం ఉన్నప్పటికీ, ఆ దిశలో ముందడుగు పడటంలేదు.

కడుపులో ఉన్నప్పుడే ఆడపిల్ల అని తెలిస్తే అంతం చేయాలనుకుంటున్నప్పుడు.. మట్టిమీద పడగానే అక్కమీద, చెల్లిమీద అన్నదమ్ములకు పెత్తనం రాసిస్తున్న తల్లులున్నప్పుడు స్త్రీకి స్వాతంత్ర్యం ఎక్కడి నుంచి వస్తుంది. ఈ పునాదులపై పెరిగి ఆ భావ జాలాన్ని రక్తగతం చేసుకున్నవారే గదా మన రచయితలు, కవులు, మేధావులు, చట్టసభల ప్రతినిధులు. అటువంటి వారు స్త్రీలపై వేధింపులకు పాల్పడని, ప్రోత్సహించరని, వెకిలి రాతలు, కూతలకు పాల్పడరని, వాటిని నిరోధిస్తారని, స్త్రీల రక్షణ కోసం కోరలున్న చట్టాలు చేస్తారని, చేసినవాటిని కచ్చితంగా అమలు చేస్తారని ఎలా భావిస్తారు.. ఎలా నమ్ముతారు?

స్త్రీలు ఇలా మృగాళ్ల రక్కసత్వానికి బలైపోవాల్సిందేనా.. దీనికి పరిష్కారం లేదా? మేం ఏం తక్కువ 'చదువుల్ సాములు శాస్త్ర చర్చ ధరణీ రాజ్యతంత్ర శిల్పంబులు' వగైరాతోపాటు నేడు అంతరిక్ష, అణుయుద్ధ రంగాల్లో అతివలు అందెవేసినచేయి అని నిరూపించు కున్నామంటారా? అయితే మగోన్మాదుల దురహంకారంపై మీ పోరాటం ఇంకా ప్రారంభించనే లేదుగదా! అలా చేసి ఉన్నట్లయితే స్త్రీలను అంగడి బొమ్మలు, తమ కామవాంఛలు తీర్చే వస్తువులుగా ఎంచే భావాలకు ఏనాడో కాలం చెల్లేది. కాబట్టి స్త్రీజాతి సొంత మేనిఫెస్టోతో కదిలితే గానీ.. సమస్యలకు అందమైన ముసుగు కప్పి పబ్బం గడుపుకుందామనే పాలకుల ఆటలకు అడ్డుకట్టపడదు. స్త్రీని మనువు కాలానికి తీసుకుపోవాలని కుట్రతో సాగుతున్న బీజేపీ పాలకులపై ఉద్యమ పతాక పట్టుకు నడిస్తే తప్ప, రెప్పరెప్పనీ తుడుపుతున్న కన్నీటి చుక్కలను, దశాబ్దాల నిస్పృహనూ తరిమికొట్టడం సాధ్యం కాదన్న అవగాహన పెంచుకోవాలి. ఇకనైనా మీ రణ కౌశలాన్ని ప్రదర్శిస్తే(మాటలు కట్టిబెట్టి, పదవుల పరుగు వదలిపెట్టి) సిగ్గునిప్పుడు మీ ముందర మగువా సాగిరావు మా మగతనంబుల్ అంటూ ఈ పురుషజాతి సాగిలపడే రోజు వచ్చితీరుతుంది. అప్పుడు బంధనాలు బదాబదలవుతాయి. మహిళా సాధికారిత చేతుల్లోకి వచ్చిచేరుతుంది. నూతనాధ్యాయం ఆవిష్కృతమవుతుంది.

భవిష్యత్తు సౌరశక్తిదే

భాగం 5

పవన శక్తి



మర్ల విజయ కుమార్





భూతలంపైన సూర్యరశ్మి అన్ని చోట్లా ఒకే స్థాయిలో ప్రసరించదు. పైగా సూర్యరశ్మిలో అధిక భాగం వేడిమిగా ఉండిన కారణాన, భూతలంపైన వివిధ ప్రాంతాలలో ఉపరితల ఉష్ణోగ్రతలు వేరువేరుగా ఉంటాయి. ఈకారణాన, వివిధ ప్రాంతాల మధ్యన గాలులు వీస్తూ, ఉష్ణోగ్రతలు ఒకేస్థాయికి చేరటం జరుగుతుంటుంది. భూ ఉపరితలం పై వివిధ ప్రాంతాలలో వీచే గాలుల వేగ తీవ్రత వేరువేరుగా ఉంటుంది. అంటే సూర్యునిలోని శక్తి మనకు వాయుశక్తిగా అందుబాటులోనికి వస్తుందన్నమాట. గత వేయి ఏళ్ళుగా గాలిమరల సహాయంతో పిండి మిల్లులు నడపటం చైనాలో ప్రారంభమయి, యూరప్ లో ప్రాచుర్యం పొందింది. అంతకు వేల ఏళ్ళ ముందుగానే, తెరచాప నావల సహాయంతో మానవుడు సముద్రయానాన్ని అలవర్చుకున్నాడు. ఈ విధంగా, మానవుని అందుబాటులోకి వచ్చిన ఉష్ణ శక్తి తరువాత, ప్రాముఖ్యమైనది వాయు శక్తే. ఈ పవన శక్తిని ఉపయోగించి, నీటిని తోడటం కూడా కొన్ని శతాబ్దాలుగా వాడుకలో ఉన్నది. అయితే, ఈ పవన శక్తిని విద్యుత్తుగా మార్చే ప్రక్రియ గత 40, 50 ఏళ్ళలో విస్తృత ప్రాచుర్యంలోకి వచ్చింది. దీవుల పైన, మారుమూల ప్రాంతాలలోనూ, ఈ పవన శక్తి ద్వారా విద్యుత్తు ఉత్పాదన అత్యంత సులభతరమైనది. విలువైన డీజల్ ను ఇంజన్లలో కాల్చి జనరేటర్లు నడపటం కంటే, పవన విద్యుత్తు అత్యంత చవకైనది, పర్యావరణ అనుకూలమైనది. మారుమూల గ్రామాల విద్యుదీకరణకు ఇది చక్కటి అనువైన మార్గం. పర్యావరణ రక్షణకు, కాలుష్య ప్రమాదాన్ని నివారించటానికి, పునరుపయోగ వనరులన్నిటిలో పవన విద్యుత్తు చవకైనది. ఈనాడు మన దేశంలో పవన విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం దాదాపు 33,000 మెగావాట్లు. అంటే, మన దేశంలో ఉత్పత్తి అయే మొత్తం విద్యుత్తు సామర్థ్యంలో ఇది దాదాపుగా 10% అయినా, మొత్తం ఉత్పత్తి అయిన విద్యుత్తు శక్తిలో ఇది 3% మాత్రమే. ఇందుకు అనేక సాంకేతిక పరమైన, ఆర్థిక పరమైన కారణాలు ఉన్నాయి. వాటిని మనం పరిశీలిద్దాం.

ఈ పవన విద్యుత్తు ఉత్పాదనలో అనేక సమస్యలు ఉన్నాయి. మొదటగా, భూ తలంపై అన్ని ప్రాంతాలలో గాలి వేగం ఒకేలాగ ఉండదు. ఏడాదిలో అన్ని నెలలూ ఒకే స్థాయిలో ఉండదు. కనీసం రోజులో 24 గంటలలో కూడా, గాలివేగం మారుతూ ఉంటుంది. సాధారణంగా రాత్రివేళల్లో తక్కువగానూ, ఉదయం, సాయంత్రం పూట హెచ్చుస్థాయిలో గాలులు వీచటం జరుగుతూ ఉంటుంది. ఇక క్షణక్షణానికీ గాలితీవ్రత మారిపోతూ ఉంటుంది. మన దేశంలో వీచే రుతుపవనాల కారణంగా కూడా, సంవత్సరంలో కొన్ని నెలలపాటు ఈ గాలి వేగం తీవ్రంగా ఉంటుంది. భూ ఉపరితలానికి 100 అడుగుల ఎత్తులో వీచే గాలి వేగాన్ని బట్టి గాలి మరలనుండి లభించే శక్తి అంచనా వేయబడుతుంది. అటువంటి అనువైన ప్రదేశాలు మనదేశంలో తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ లలో ఎక్కువగా ఉన్నాయి. ప్రధానంగా కొండవాలు ప్రాంతాలలోనూ, సముద్ర తీర ప్రాంతాలలోనూ గాలితీవ్రత ఎక్కువగా ఉంటుంది. గత కొన్ని ఏళ్ళుగా ఆ ప్రాంతంలో గాలి వేగాన్ని బట్టి, అక్కడ గాని గాలిమరలను ఏర్పాటుచేస్తే, ఎంత శక్తి అందుబాటులోకి వస్తుందో ముందుగా ఖచ్చితంగా అంచనా కట్టిన తరువాతనే అక్కడ గాలిమరలు ఏర్పాటుచేయటం జరుగుతుంది. సామాన్యంగా మూడు రెక్కలు గలిగిన ఈ గాలిమరలనుండి లభించిన వాయుశక్తిని జనరేటర్లలో విద్యుత్తుగా మార్చటం జరుగుతుంది. అయితే గాలి తీవ్రతను బట్టి ఉత్పత్తి అయే విద్యుత్తు మారిపోతుంటుంది కనుక, ఈ విధంగా అందుబాటులోకి వచ్చిన డి.సి. విద్యుత్తును, బ్యాటరీలలో నిల్వ ఉంచి, దానిని ఇన్వర్టర్ల సహాయంతో 440 వోల్టుల ఎ.సి విద్యుత్తుగా మార్చి, గ్రిడ్ కు సరఫరాచేస్తారు. ఉదాహరణకు 300 కిలోవాట్ల సామర్థ్యం గలిగిన గాలిమర ఏర్పాటు చేస్తే, దానినుండి లభించే ఎ.సి విద్యుత్తు కొన్ని వాట్ల నుండి, 300 కిలోవాట్లవరకూ అనుక్షణం మారిపోతూనే ఉంటుంది. ఆకారణంచేత, ఉత్పత్తి అయిన డి.సి విద్యుత్తును బ్యాటరీలో నిల్వ ఉంచి, ఒక నిర్దిత స్థాయిలో ఎ.సి విద్యుత్తును గ్రిడ్ కు సరఫరా చేయవచ్చును. ఈకారణంచేత, గాలిమర ఏర్పాటు ఖర్చులో అధికభాగం ఈ బ్యాటరీలకే ఖర్చు అవుతుంది. పైగా, బ్యాటరీలను ప్రతీ 3, 4 ఏళ్ళకు మార్చవలసి రావటంతో గాలిమరల నిర్వహణ ఖర్చు పెరిగిపోతుంది. ప్రస్తుతానికి లెడ్ ఏసిడ్ బ్యాటరీలనే వాడుతున్నారు. లిథియమ్ అయాన్ బ్యాటరీలు అంతకంటే మెరుగైనవయినా, వాటి ఖరీదు చాలా ఎక్కువ కావటంతో హెచ్చు స్థాయిలో విద్యుత్తును నిల్వ ఉంచటానికి అవి లాభదాయకం కాదు. భవిష్యత్తులో మరింత మెరుగైన, ఎక్కువ శక్తిగలిగిన బ్యాటరీలు అందుబాటులోకి వస్తే, ఈ పవన, సౌర విద్యుత్తు వాడకం ప్రధానం కావచ్చును.

పవన విద్యుత్తు ఉత్పాదనకు అనువైన స్థలాలలో కొన్ని వందల గాలిమరలను ఏర్పాటు చేయటం ద్వారా, ఒక్కోప్రాంతంలో 3, 4 మెగావాట్ల సామర్థ్యం గలిగిన విద్యుత్తు ఉత్పాదన కేంద్రాలను ఏర్పాటు చేయవచ్చును. గాలి వేగ తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో 30, 40 మెగావాట్లవరకూ కూడా సామర్థ్యాన్ని ఏర్పాటు చేయవచ్చును. సముద్ర తీరానికి 2, 3 వందల కిలోమీటర్ల వరకూ సముద్ర తలంపైన హెచ్చు స్థాయిలో గాలిమరలను ఏర్పాటుచేయటం ఈమధ్యన బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఒక్కో గాలిమర ఉత్పత్తి సామర్థ్యం 10 మెగావాట్లవరకూ ఉండవచ్చును. సముద్రంలో 3 కిలోమీటర్ల నీటి లోతువరకూ ఈ గాలిమరలను ఏర్పాటు చేయవచ్చును. యూరప్ లోని కొన్ని దేశాలలో సౌర, పవన విద్యుత్తులు కలిసి మొత్తం ఉత్పత్తి అయే విద్యుత్తులో సగం స్థాయికి చేరుకున్నాయి. అంతకు ముందు వివరించినట్లుగా, మొత్తం విద్యుత్తును సౌర, పవన శక్తిద్వారా ఉత్పత్తి చేయటం సాధ్యం కాదు. ఎందుకంటే, సౌర శక్తి రోజులో 8, 10 గంటలే అందుబాటులోకి వస్తుంది. ఇక పవన విద్యుత్తు క్షణక్షణానికీ మారిపోతుంటుంది. ఇక బ్యాటరీల సామర్థ్యం విషయంలోకూడా అనేక సాంకేతిక పరిమితులు ఉన్న కారణాన, మనం బొగ్గు, పెట్రోలియమ్ తైలాలపై ఆధారపడక తప్పదు. వీటి వాడకాన్ని పూర్తిగా నిర్మూలించటానికి తీవ్రమైన స్థాయిలో పరిశోధనలు జరుగుతున్నాయి. వీటిగురించి ముందుముందు చర్చిద్దాం. చాలా ప్రదేశాలలో గాలిమరలను, సౌర శక్తిని అనుసంధానం చేయటంద్వారా, నిలకడ అయిన స్థాయిలో విద్యుత్తు ఉత్పాదనకు అవకాశాలు ఉన్నాయి. ఉదాహరణకు ఆకాశం మేఘావృతమైన సమయంలో సౌర ఉత్పత్తి తగ్గుతుంది. కాని, అదే సమయంలో గాలి తీవ్రత పెరిగి, పవన విద్యుత్తు ఉత్పాదన ఎక్కువగా ఉంటుంది. ఇక చిన్న స్థాయిలో కూడా ఈ గాలిమరల ద్వారా విద్యుత్తును ఉత్పాదనచేసి ఆప్రాంతంలోని విద్యుత్తు అవసరాలను తీర్చే అవకాశాన్ని మనం వినియోగించుకోవచ్చును. ఉదాహరణకు బహుళ అంతస్థుల భవనాల మధ్యన, కొన్ని చోట్ల గాలి తీవ్రత హెచ్చుగా ఉంటుంది. అక్కడ గాని గాలిమరలను ఏర్పాటుచేస్తే మనకు చవకగా విద్యుత్తు లభిస్తుంది. అట్లానే, బహుళ అంతస్థుల భవనాల పైనకూడా, కొన్ని వందల అడుగుల ఎత్తున గాలి తీవ్రత హెచ్చుగా ఉంటుంది కనుక, అక్కడ కూడా గాలిమరలను ఏర్పాటు చేయవచ్చును. గాలివేగం నిలకడగా లేని భవనాలపై విద్యుత్తు ఉత్పాదన బదులుగా, నీటిని పైకి ఓవర్ హెడ్ ట్యాంకులలోకి తోడటానికి వినియోగిస్తే, విద్యుత్తును ఆదా చేయవచ్చును. ఈవిధంగా, ఆ భవన సముదాయ విద్యుత్తు అవసరాలలో కొంతభాగాన్నైనా పవన, సౌర విద్యుత్తుల సహాయంతో తీర్చగలిగితే, పుణ్యం, పురుషార్థం కలిసి వస్తాయి. పర్యావరణ రక్షణకు సహాయం చేసిన వాళ్ళమవుతాము. పైగా, ఈ గాలిమరలను కళాత్మకంగా ఏర్పాటుచేయగలిగితే, చూడచక్కగా కూడా ఉండి, భవన సముదాయ అందాన్ని ఇనుమడింపజేస్తుంది. ఈ మధ్యకాలంలో, భవన రూపకల్పన స్థాయిలోనే, ఈగాలిమరల ఏర్పాటుపై దృష్టిసారించి, పవన శక్తి అవసరాలలో 20, 30 శాతాన్ని స్వంతగా ఆ భవన సముదాయమే ఉత్పత్తిచేసుకునేటట్లుగా ప్రాజెక్టులు అమలులోకి వస్తున్నాయి. అదేవిధంగా, సౌర నీటి పంపుసెట్లను ఏర్పాటు చేయటానికి ప్రయత్నాలు జరిగినా, అవి అంత ప్రాచుర్యంలోకి రాలేదు. విలువైన పంట భూమిని ఆక్రమించటమే కాకుండా, ఖర్చు కూడా ఎక్కువ కావటం మూలంగా, రైతులు వీటిపై ఆసక్తి కనబరచలేదు. పొలాలలో, తోటలలో నీటిని తోడటానికి గాలిమరలను ఉపయోగిస్తే, విద్యుత్తును ఆదాచేయవచ్చును. ఖర్చుకూడా తక్కువే.

ఈ పవన విద్యుత్తును మన అవసరాలకు అనుగుణంగా వినియోగించుకుందుకు ముఖ్యంగా బ్యాటరీలలో ఉన్న పరిమితులు అడ్డంకిగా ఉన్నాయి. దీనిని అధిగమించటానికి, గాలిమరలను సోలార్ తోనూ, మరి ఇతర పునరుద్పాదక వనరుల వాడకంతోనూ అనుసంధానించటం ద్వారా మనకు లభించే శక్తిని ఎక్కువ సమర్థవంతంగా వినియోగించుకోవచ్చును. హెచ్చుస్థాయిలో భవనాలు కలిగిన ప్రాంతాలలో, ఈ విధంగా భవనముదాయ రూపకల్పన దశలోనే, ఏఏ వనరులను ఏవిధంగా ఉపయోగించుకోవాలో నిర్ణయించి, ఆ ప్రకారంగానే గాలి మరలను, సౌర ప్యానెళ్ళను ఏర్పాటుచేసుకోవలసి ఉంటుంది. పైగా, ఆ ప్రాంతంలోని వ్యర్థజలాలలోని మీథేన్ వాయువును పర్యావరణంలోకి వదిలి, కాలుష్యాన్ని పెంచకుండా, ఆ వాయువును గాని ఫ్యూయల్ సెల్స్ లో వినియోగిస్తే, మనకు మరింత విద్యుత్తు ఉత్పాదన జరుగుతుంది. తద్వారా జలకాలుష్యాన్ని కూడా నివారించవచ్చును. వ్యర్థజలాలలోని మిగులు పదార్థాన్ని ఎరువుగా మార్చి, బిల్డింగ్ పైననే కూరగాయలు, పూలమొక్కలు పెంచవచ్చును. ఈవిధంగా భవన సముదాయాల రూపకల్పన చేసే విధానాన్ని 'గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్' గా వ్యవహరిస్తారు. భవిష్యత్తులో భవన సముదాయాల నిర్మాణంలో ఈ పద్ధతి బహుళ ప్రాచుర్యంలో వస్తుందనటంలో ఏమాత్రం సందేహం ఉండనవసరంలేదు. ఫ్యాను రెక్కలవలెనే కాకుండా, అనేక రకాలైన గాలిమరలు ఈనాడు అందుబాటులో ఉన్నాయి. వివిధ రకాల డిజైన్లలో, రంగురంగులతో, చూడటానికి ఇంపుగా ఉండి, కనువిందు చేసే ఈ గాలిమరలను భవనాల డిజైన్లలో కలిసిపోయేటట్లుగా గాని ఏర్పాటుచేస్తే, భవనాల శోభకూడా ఇనుమడిస్తుంది.

ఈ పవన విద్యుత్తు వలన కొన్ని ఇబ్బందులు కూడా తలెత్తుతూన్న విషయాన్ని కూడా మనం పరిగణలోకి తీసుకోవలసి ఉంటుంది. ఉదాహరణకు ఈ గాలిమరల బ్లేడులను ఢీకొని ఒక్కొక్క గాలిమర కారణంగా వందలాది పక్షులు మృతిచెందుతున్నాయి. ఇటువంటి కొన్ని వందల గాలిమరలు ఉండే ప్రదేశంలో పక్షులు ఎగరకుండా మనం అదుపు చేయలేము. అదే విధంగా ఈ గాలిమరలు ఉన్నప్రాంతాలలో కొన్ని కిలోమీటర్ల విస్తీర్ణంలో గాలిమర రెక్కల చప్పుడు భరించరాని స్థాయిలో ఉండిన సందర్భాలు కూడా ఉన్నాయి. అంటే, మానవ నివాసాలకు దూరంగా ఈ గాలిమరలను ఏర్పాటు చేయవలసి ఉన్నది. పైగా విలువైన వ్యవసాయ భూములలో ఈ గాలిమరలను ఏర్పాటుచేస్తే, వ్యవసాయ కార్యకలాపాలకు ఇవి అడ్డంకి కావచ్చును. ఈగాలి మరల కారణంగా సుందరమైన ప్రకృతి దృశ్యాలు కనుమరుగు అవుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ గాలిమరల నిర్వహణ ప్రైవేటు కంపెనీలకు అప్పజెప్పిన కారణంగా, వారు లాభాపేక్షే తప్ప, ప్రకృతికి కలిగే నష్టాన్ని పరిగణలోకి తీసుకోరు. యూరప్ లోని గాలిమరలు ఏర్పాటయిన కొన్ని ప్రాంతాలలో, వాటి నుండి వెలువడే చప్పుడు కారణంగా ఆ ప్రాంతంలో తేనెటీగలు ఉండటంలేదని, ఈ గాలిమరలనుండి వెలువడే ధ్వని ఫ్రీక్వెన్సీ వాటికి ప్రమాదకారి అని కనుగొన్నారు. కాని మొత్తంగా పర్యావరణానికి దీర్ఘకాలంలో జరిగే నష్టాన్ని పరిగణలోకి తీసుకుని మాత్రమే ప్రభుత్వం ఈగాలిమరల స్థాపనకు అనుమతులు ఇవ్వవలసి ఉన్నది. ఇప్పటివరకూ ఏర్పాటు చేయబడిన గాలిమరల వలన పర్యావరణానికి కలిగే నష్టాన్ని కొంతవరకైనా సరిదిద్దటానికి, ఆకంపెనీల ఆదాయంపై టాక్స్ ను విధించవలసి ఉన్నది. అంటే జనవాసాలకు దూరంగా, పక్షులకు నష్టం కలుగకుండా మనం ఈ గాలిమరలను ఏర్పాటుచేయాలంటే, అటువంటి పరిమితులకు అనువైన స్థలాలు చాలా తక్కువగా లభిస్తాయి. కాని సముద్రంలో తీరానికి కొన్ని వందల కిలోమీటర్ల దూరాన ఆఫ్ షోర్ గాలిమరలను హెచ్చుస్థాయిలో ఏర్పాటుచేసినట్లయితే, పక్షులకు ప్రమాదం ఉండదు. శబ్దకాలుష్యం ప్రమాదం లేదు. విలువైన వ్యవసాయ భూములను కోల్పోనవసరంలేదు. భూతలంపై సముద్ర తీరాలలో కొన్ని లక్షల కిలోమీటర్ల పొడవునా మనం ఎక్కువ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ ఆఫ్ షోర్ గాలి మరలను ఏర్పాటుచేస్తే, పర్యావరణానికి తక్కువ నష్టం కలుగుతుందని నిపుణులు ప్రతిపాదిస్తున్నారు. బహుశా భవిష్యత్తులో పెద్దగాలిమరలు ఈ విధంగానే స్థాపించబడవచ్చును. ఇటు వంటి హెచ్చు ఉత్పత్తి స్థాయి కలిగిన ఆఫ్ షోర్ గాలిమరల ఏర్పాటుతోబాటు, అధిక స్థాయిలో విద్యుత్తును నిల్వచేయ గలిగిన సరికొత్త బ్యాటరీ టెక్నాలజీకూడా అందుబాటులోకి తేవలసిన అవసరం ఉన్నది. ఇందుకు మరొక పదేళ్ళైనా పట్టవచ్చును. ఏది ఏమయినా సమీప భవిష్యత్తులో మన విద్యుత్తు అవసరాలలో కొంత భాగం పవన విద్యుత్తుద్వారా లభించవచ్చును. భవిష్యత్తులో పునరుద్పాదక వనరుల ప్రాముఖ్యత పెరిగి, బొగ్గు, పెట్రోలియమ్ ల వాడకం తగ్గిస్తేనే, పర్యావరణ వినాశనాన్ని నివారించగలుగుతాము. ఈ కృషిలో పవన, సౌర విద్యుత్తులు ప్రధాన పాత్ర పోషించవలసి ఉన్నది.

(6వ భాగం వచ్చేఆదివారం)

- వ్యాస రచయిత : అఖిల భారత అభ్యుదయ వేదిక జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు. సెల్ : 09848933545

బ్యాంకుల ప్రైవేటీకరణ మేలు చేస్తుందా?

ఇటీవల పంజాబ్ నేషనల్ బ్యాంకులో (పిఎన్‌బి) పదకొండువేల కోట్లకుపైగా వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడి కుంభకోణానికి పాల్పడిన ఘటన వెలుగుచూసిన తర్వాత బ్యాంకులను ప్రైవేటీకరణ చేయాలని పలువురు వాణిజ్య, పారిశ్రామికవేత్తలు కోరుతున్నారు. ఇందిరాగాంధీ పాలనా కాలంలో మొదట 14, ఆ తర్వాత 6 బ్యాంకులను జాతీయం చేశారు. గ్రామీణ ప్రాంతాలలో రైతులకు, చేతివృత్తులవారికి, చిన్న పరిశ్రమలకు సైతం రుణపరపతి సౌకర్యం అందించాలన్న లక్ష్యంతో జాతీయకరణ చేశారు. ఈ లక్ష్యం కొంతమేరకే నెరవేరింది. బ్యాంకులు ప్రైవేటురంగంలో వుంటే మోసాలు జరగవని చాలామంది వాదిస్తున్నారు. ఇది వాస్తవంకాదని ప్రస్తుతం మోసాలు జరిగిన బ్యాంకులలో ప్రైవేటువి కూడా ఉండటం నిరూపణ అవుతున్నది వాస్తవం. అంతేకాదు ప్రైవేటురంగ బ్యాంకులలోనూ నిరర్థక ఆస్తులున్నాయి. ప్రైవేటు రంగంలోవున్న గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు దివాలాతీస్తే వెంటనే ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌లో విలీనం చేసి ఆ బ్యాంకు భారమంతా ప్రభుత్వరంగ బ్యాంకులపై మోపారు. దివాలాతీసిన బ్యాంకు యాజమాన్యం అన్ని విధాలుగా మంచిస్థితిలోవున్న దని ఆనాడు వార్తలు వచ్చాయి. యాక్సిస్‌బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంకు తదితర బ్యాంకుల్లోనూ నిరర్థక ఆస్తులు ఎక్కువే ఉన్నాయి.

అసలు ప్రభుత్వరంగ బ్యాంకులలో మోసాలకు, నష్టాలకు కారకులెవరు? ఈ విషయాన్ని ప్రైవేటు బ్యాంకులే మంచివని చెప్తున్న వారు మాట్లాడకుండా వదిలేస్తున్నారు. గత పదేళ్లకాలంలో దాదాపు 20 లక్షలకోట్ల రుణ బకాయిలను ఎగవేసిన వారు, మోసాలకు పాల్పడిన వారు ఎవరు? ఈ ఏడాది మార్చికి 10 లక్షలకోట్లకు పైగా మొండి బకాయిలుంటాయని అంచనా వేశారు. ఇప్పటికే 6 లక్షల కోట్లు వివిధ సమయాల్లో రద్దు చేశారు. ఇదంతా అధికారికంగా అందిన సమాచారం. వెల్లడించని సమాచారం మరింత ఆందోళన కలిగించవచ్చు. బ్యాంకుల నుంచి రుణం తీసుకొని ఎగవేయడం, పేరుకుపోయిన మొండిబకాయిలలో కొన్ని లక్షలకోట్లను పారు బకాయిల కింద పరిగణించి పార్లమెంటులో తీర్మానంచేసి రద్దు చేస్తున్న తతంగం జరుగుతూనే ఉంది. లేదా రిజర్వు బ్యాంకే ఆ పని ఈ మూడేళ్లకాలంలోనే చేసింది. లక్షన్నరకోట్ల మేర బకాయిలను రిజర్వు బ్యాంకు రద్దు చేసినట్టు అధికారిక వార్తలు వచ్చాయి. బ్యాంకుల జాతీయకరణ నాటినుంచే లక్ష్యం పక్కతోవపట్టింది. బడా బాబులకే రుణాలు ఎక్కువగా ఇచ్చారు. 1990లలో బ్యాంకులను, స్టాక్ మార్కెట్లను మోసం చేసి సంచలనం సృష్టించిన హర్షద్‌మెహతా ఆ తర్వాత కేతన్‌దలాల్, జతిన్ మెహతా, కేతన్ మెహతా, తాజాగా ఈ జాబితాలో చేరిన నీరవ్ మోడీ గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారే. రొటోమ్యాక్ యజమాని విక్రమ కొఠారి, వస్త్ర వ్యాపారి, ఎంపి అగర్వాల్, అంతక్రితం లలిత్‌మోడీ, విజయమాల్యా ఈ జాబితాలో ఉన్నారు. ఇవన్నీ మోడీ హయాంలో జరిగాయి. ఈ అంటువ్యాధి ఒక రాష్ట్రానికి, ప్రాంతానికి పరిమితం కాదు. బడా వాణిజ్యవేత్తలు, కార్పోరేట్ కంపెనీల యజమానులు, బడా కాంట్రాక్టర్లు మిక్కుటంగా గత 30 ఏళ్లకాలంలో చట్టసభల్లో తిష్టవేశారు. లేదా పాలకులకు ఆశ్రితులుగా మారి వారికి కావలసిన ముడుపులు అందిస్తూ వస్తున్నారు. తాజాగా ఎన్నికల విరాళాల బాండ్ల పథకాన్ని నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రకటించి ఈనెలలో అమలుచేస్తుంది. ఇది అధికారిక బహిరంగ అవినీతికి మచ్చుతునక. ఇది మంచిదికాదన్న విమర్శకుల సూచనలపై మోడీ స్పందనలేదు. అయినా ప్రజాస్పందన లేదు. ఒకవైపు బ్యాంకులు వరుసగా దివాలాతీసే పరిస్థితులకు చేరుకుంటుండగా మరోవైపు సంపన్నుల ఆస్తులు అపారంగా పెరిగిపోతున్నాయి. బ్యాంకుల వద్ద రుణంగా తీసుకుని ఎగవేసిన వారంతా బడాబా బులనే సత్యాన్ని మీడియా ప్రజలకు చెప్పడంలేదు. నిజాలను వెల్లడించవలసిన మీడియా అంతా బడాబాబుల చేతుల్లో వుంది. లేదా పాలకుల కనుసన్నల్లో పనిచేయడమే కారణం. పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ఏదొఒక పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నాయి. ఈ విషయాలు తెలిసిన మధ్య తరగతి ప్రజలు పట్టించుకోకుండా, విశ్లేషించకుండా 'బ్యాంకుల ప్రైవేటీకరణ'ను సమర్థిస్తున్నారు. జబ్బు ఒకటయితే మందు మరొకటి వేయాలని మోడీ ప్రభుత్వం తహతహలాడుతోంది. ఒకరిద్దరు బ్యాంకు అధికారులను అరెస్టు చేసినంత మాత్రాన ఈ అంటువ్యాధి నిర్మూలన కాదు. మోసాలకు, కుంభకోణాలకు కారకులవుతున్న వారిని బోనులో ఎందుకు నిలబెట్టడంలేదు.. విదేశాల్లో డబ్బు దాచుకున్న 500 మంది నల్లధనుల జాబితా తమవద్ద వుందని, అది బయటపెడితే వ్యాపారాలు దెబ్బతింటాయని మోడీ ప్రభుత్వం వాదిస్తోంది. ఎన్నికల ప్రచారంలో నల్లధనం తెచ్చి కుటుంబానికి 15 లక్షల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో వేస్తానని చెప్పిన మోడీ కుంభకోణాలకు పాల్పడిన వారి జాబితాను ఎందుకు వెల్లడించడంలేదు? వారంతా బీజేపీకి, కాంగ్రెస్‌కు ఆశ్రితులే. ఎవరు అధికారంలో వుంటే వారికి ఎక్కువ ముడుపులు చెల్లిస్తూ తమ పనులు చేయించుకుంటున్నారు. ఈ మోసాలు జరగడానికి సరైన నిర్వహణ, నియంత్రణ లేకపోవడమే కారణం. ఆర్థికశాఖ, రిజర్వ్‌బ్యాంక్ ఆయా బ్యాంకుల ఉన్నతాధికార యంత్రాంగం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నాయి. తాను కాపలాదారుడినని మోడీగారు చెప్పిన మాటలకు విలువ ఎక్కడ? బ్యాంకులను మోసగిస్తున్న వారికి ఉన్నతస్థాయి అధికారులలో కొందరు, పాలకులతో కొందరు సహకరిస్తున్నా రన్నది బహిరంగ రహస్యం. బ్యాంకుల సమస్యలను పసిగట్టి వాటిని పరిష్కరించని ఇప్పటి, గతంలో పాలించిన నేతలు ఈ మోసాలను పట్టించుకోలేదు. కావాలని బకాయిలను ఎగ్గొడుతున్న వారి పేర్లు బయటపెట్టక పోవడం వల్ల వాళ్లు మళ్లీ, మళ్లీ రుణాలు తీసుకుని బ్యాంకులకు మరింత భారమవుతున్నారు. బ్యాంకులలోకి చేరుతున్నదంతా ప్రజలు కష్టపడి సంపాదించుకు న్నదని, దాన్ని దుర్వినియోగం చేయకూడదని అన్ని స్థాయిలలో పాలకులు ఏనాడూ ఆలోచించరని జరుగుతున్న ఘటనలు నిరూపిస్తున్నాయి. దివాలా ప్రకటించిన కంపెనీల యజమానుల బంధువులు వాటి ఆస్తులను అతి తక్కువకు వేలంపాట పాడి మళ్లీ వాటి యజమానులకు అప్పగిస్తున్నారు. ఇలాంటి వ్యవహారాల వల్ల ఎక్కువగా పాలకుల ఆశ్రితులు ప్రయోజనం పొందుతున్నారు. ఎల్‌ఓయులను (లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ – బ్యాంకు గ్యారంటీ) ఉపయోగించుకుని అదే బ్యాంకుకు చెందిన విదేశీ బ్రాంచిలో స్వల్పకాలిక రుణం తీసుకోవచ్చు. ఈ విధానం ఇతర దేశాలలో లేదు. మన ఆర్థిక ఆశ్రితుల సౌలభ్యం కోసం సృష్టించినట్లుంది. ఎల్‌ఓయులిచ్చిన బ్యాంకులు విదేశాల్లో తీసుకున్న రుణాలను నమోదు చేయదు. నీరవ్, చోక్సీలు కలిసి చేసిన మోసాల విలువ రూ. 20వేల కోట్లు ఉండవచ్చునని తాజా అంచనాలు. సీబీఐ దాడులు, వేలకోట్ల ఆస్తుల స్వాధీనంలాంటివి జనాన్ని మభ్యపెట్టి మళ్లీ ఓట్లు పొందడానికి ఆడే నాటకం తప్ప మరేమీ కాదని జరిగిన చరిత్ర స్పష్టం చేస్తున్నది. ఇవిగాక తమ అనుకూల కంపెనీలకు రాయితీలు, సబ్సిడీలు ప్రతి సంవత్సరం లక్షలకోట్ల లో ఉంటాయి. 'దోపిడీగాళ్ల' బండారాన్ని దర్యాప్తు సంస్థ లు పాలకులకు తెలియజేసినా 'మనవాళ్లే' అయితే మౌనంగా ఉంటారు. అలా కాదనుకుంటే దాడుల నాటకం ఆడిస్తారు. పాలకులు సైతం కోరుకుంటున్న ప్రైవేటీకరణ పరిస్థితిని మరింతగా దిగజారుస్తుంది. మేనేజ్ మెంట్, నియమ, నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయకపోవడమే అసలు సమస్య. ప్రైవేటుబ్యాంకులు రైతులకు, కౌలు రైతులకు, చిన్న పరిశ్రమలకు రుణాలు ఇవ్వవు. ప్రభుత్వరంగ బ్యాంకులు లేకపోతే వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింతగా దెబ్బతింటుంది. పరాన్నభుక్కులను నిరోధించడమే మంచి పరిష్కారం. ఈ పని ఈ పాలకులు చేసే అవకాశాలు లేవు.

-రచన : టి.వి. సుబ్బయ్య

విశాలాంధ్ర
బతుకు
The Life



ఆదివారం
04 మార్చి 2018



మానవతా దృక్పథం, మానవత్వ పరిమళాలతో తెలుగు కథకు కొత్త సొబగులద్ది, తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట స్థానాన్ని ఏర్పరచుకున్న కథా రచయిత మునిపల్లె రాజు. నిగర్వి, అత్యంత నిరాడంబరుడు. తనకంటూ దాచుకోవడం కూడా తెలీని నిస్వార్థజీవి! ఇన్ని లక్షల మందికి లేని ఇన్సూరెన్స్ పాలసీ నాకెందుకని ఎప్పుడూ దాని జోలికిపోలేదాయన. రెండు జతల దుస్తులకన్నా ఎక్కువ కుట్టించుకోవడం పాపం అని నిజాయితీగా ఆచరణలో పెట్టిన నిఖార్సయిన మనిషి! వారాల పిల్లలు (ఆ రోజుల్లో పేదరికంలో ఉన్నవారు రోజుకొక్కరి ఇంట్లో చొప్పున భోజనం చేస్తూ చదువుకునే వారు) అంటే రాజుగారికి చాలా ఇష్టం. ఎవరో కొట్టి, సైదు కాల్వలో పడేసిన ఒక యానాది పిల్లవాడికి తన వంటిమీదున్న చొక్కా దానం ఇచ్చేసి వచ్చిన కరుణారస హృదయుం ఆయనది. 'తను అనుభవించిన జీవితం, తన చుట్టూ ఉన్న పరిస్థితులను ఆకళింపు చేసుకుని, ఆ బాధల గాథల్ని, వ్యథల నేపథ్యాన్ని తన కథలకు ఇతివృత్తాలుగా స్వీకరించానని' నిర్మొహమాటంగా చెప్పకున్నారాయన. దాచుకోవడం చేతకాని రాజుగారు, తన రచనలు కొన్నింటిని పోగొట్టుకున్నారు. దొరికిన వాటితో ఇంత వరకు నాలుగు కథాసంపుటాలు వెలువరించారు. ఒక కవితా సంకలనమూ వెలువరించారు. తొంభై రెండేళ్ల మునిపల్లె రాజుగారు తుది శ్వాస విడవడానికి కొద్దిరోజుల ముందు 'బతుకు'తో తన జీవిత, సాహిత్య విషయాలను పంచుకున్నారు. బహుశా ఇదే ఆయన ఆఖరి ఇంటర్వ్యూ..

సంతృప్తిగానే ఉన్నాను.....

'ఇంతవరకూ జీవితంలో చేసిన దానితో నేను సంతృప్తిగానే ఉన్నాను. నవల రాయాలని ఉంది. కానీ ఓపిక లేదు. రాయలేకపోతున్నానే అన్న అసంతృప్తి తప్ప మరేం లేదు. నేను సర్వీసులో ఉండగానే అంటే 1950లో మా బంధువుల అమ్మాయి సులోచనా దేవితో నా వివాహం జరిగింది. నాకు ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలూ సంతానం. అంతా వాళ్ల వాళ్ల జీవితాల్లో స్థిరపడ్డారు. పెద్దబ్బాయి ఇంజనీరింగ్ చేసి ఒక స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీ నడుపుతున్నాడు. చిన్నబ్బాయి ఉద్యోగం చేస్తున్నాడు. చేతనైనంత మేరకు ఇతరులకు సహాయం చేయడం, ఇతరుల మేలుకోరడం నా నైజం. అదే పిల్లలకీ నా ఆస్తిలాగా ఇచ్చాను......'

నా అభిమాన రచయితలు/కవులు...

మన తెలుగు సాహిత్యానికి సంబంధించి దేవరకొండ బాలగంగాధర తిలక్ కథలు, కవితలు నాకు బాగా ఇష్టం. అలాగే తన కథల్లో ఆంధ్ర సంస్కృతిని బాగా ప్రతిబింబించిన శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, కృష్ణానదీ తీర భాషా సంస్కృతిని బాగా పుణికి పుచ్చుకున్న మల్లాది రామకృష్ణ శాస్త్రి, తదితరులు నాకు చాలా ఇష్టం. వారు ఒక స్థిరమైన శైలిని ఏర్పరచుకున్నారు. తెలుగు భాషకి ఒక విశిష్ట గౌరవాన్ని ఆపాదించి పెట్టారు. నా సమకాలీకులలో కూడా చాలా మంచి రచయితలున్నారు. గొప్ప సామాజిక అధ్యయనంతో వారు కథలు, నవలలు రాస్తున్నారు.

తాత్త్విక కథల మునిపల్లె రాజు

వామపక్ష భావజాలంలో....

నాకు ఊహ తెలిసినదగ్గరనుంచి, కొంచెం కొంచెంగా సమాజాన్ని అర్థం చేసుకుంటున్న నాటినుంచీ నా చుట్టూ వామపక్ష భావజాలం అలముకుంది. ఆ భావజాలంలోనే నా అధ్యయనం, పరిశీలనా దృక్పథం అన్నీ నడిచాయి. అందుకు కారణం మా కజిన్ మునిపల్లె రామారావు. వరసకు అన్నయ్యే అయినా నాకు సొంత అన్నయ్యలాగే ఉండేవాడు. అతడు బెనారస్ యూనివర్సిటీలో చదువుకుంటున్న రోజుల్లోనే, కమ్యూనిస్టు భావజాలంవైపు ఆకర్షితుడయ్యాడు. గుంటూరులో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంకోసం కృషి చేశాడు. పార్టీకోసం అతడు సంసారాన్ని కూడా వదులుకున్నాడు. అతడి ప్రభావం మాపై చాలా పడింది. తరువాత కాలంలో మా అన్నయ్య మునిపల్లె పిచ్చి రాజు కూడా కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు అయ్యాడు. ఈ ఇద్దరి ప్రభావం నాపై బాగా చూపింది. అలా నేను చదువుకునే రోజుల్లోనే విద్యార్థి ఉద్యమాల్లో కూడా పాల్గొన్నాను. మా అన్నయ్యల ప్రభావం వల్ల స్కూలు చదువుకన్నా, రాజకీయ సాహిత్యం బాగా చదివాను. బహుశా అదే నాకు బాగా ఒంటబట్టిందనుకుంటాను.....

'గుంటూరు జిల్లా, బాపట్ల తాలూకా, మునిపల్లె గ్రామం మా ఊరు. కానీ మా కుటుంబం తరువాత కాలంలో ఈ గ్రామానికి దగ్గర్లోని తెనాలి పట్టణంలో స్థిరపడింది. తెనాలి సాహిత్య, సాంస్కృతిక, నాటక రంగాలకు పుట్టినిల్లుగా ఉండేది. నా చిన్నతనం అంతా ఆ విలక్షణమైన వాతావరణం ఉన్న తెనాలి పట్టణంలోనే గడిచింది. అనంతర కాలంలో ఆ ప్రభావం కూడా నా జీవిత ప్రస్థానంపై బాగా చూపిందనే చెప్పాలి. మా నాన్న మునిపల్లె హనుమంతరావుగారు బర్మా షెల్ కంపెనీ ఏజంటుగా ఉండేవారు. మా అమ్మపేరు శారదాంబ పదహారణాల గృహిణి. నేను 16 మార్చి 1925లో గుంటూరు జిల్లా గరికిపాడులో మా అమ్మమ్మగారింట పుట్టాను. మా నాన్నగారికి మేం ముగ్గురు మగపిల్లలు, ఒక ఆడపిల్ల. నేను రెండోవాడిని. నా ప్రాథమిక చదువంతా మునిపల్లెలోనే జరిగింది. తరువాత అక్కడికి నాలుగు మైళ్ల దూరంలో ఉన్న పొన్నూరులో హైస్కూలు చదువు, 1942లో ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తి చేశాను. మరుసటి సంవత్సరం కాలేజీ చదువుకోసం గుంటూరు వెళ్లి ఇంటర్‌లో చేరాను. కానీ, కుటుంబ పరిస్థితుల వల్ల అది పూర్తి చేయలేక పోయాను. నలభయ్యేళ్ల వయస్సులోనే మా నాన్నగారు చనిపోవడంతో మా కుటుంబం ఒక్కసారిగా కుదేలయిపోయింది. ఆర్థిక ఇబ్బందుల్లో పడిపోయింది. నన్ను చదివించే పరిస్థితి లేదు.....

అధ్యయనమే నన్ను కథకుడిని చేసింది

'ప్రతి మనిషినీ ఏదో ఒక ప్రభావం ఎటో వైపు నడిపిస్తుంటుంది. నా చుట్టూ ఉన్న పరిస్థితులు, నా అధ్యయనం, నా పరిశీలన.....నన్ను సాహిత్యం వైపు నడిపించాయి. మా ఇంటి వాతావరణం....అంటే విస్తృతంగా చదవడం. ఏ సాహిత్యం అనేది పక్కన పెడితే ఎంత చదువుతున్నాం అనేది ఆలోచిస్తే దాని ప్రభావం మనపై చాలా ఉంటుంది. దానికి తోడు మన ఉపాధ్యాయుల బోధనా తీరు కూడా మనపై చాలా ప్రభావం చూపిస్తుంది. నేను హైస్కూల్లో చదివే రోజుల్లో జమ్మలమడుగు రామ్మూర్తిగారనే ఉపాధ్యాయులు బోధించే తీరు, కేవలం పాఠ్యాంశాలే కాకుండా ఆయన చెప్పే ఇతర తెలుగు సాహిత్య విషయాలు కూడా తెలుగు సాహిత్యం పట్ల నాకు అభిరుచిని, ఆకర్షణను కలిగించాయని విస్పష్టంగా చెప్పగలను. తెలుగు కావ్యాలు, ఇతర సాహిత్య అంశాలు ఆయన చెబుతూండేవారు. ఇంట్లో ఎలానూ సాహిత్య నేపథ్యం ఉండేది. మా అన్నయ్యలిద్దరూ చాలా పుస్తకాలు తెస్తూండేవారు. దాదాపు అవన్నీ అభ్యుదయ, విప్లవ సాహిత్యానికి సంబంధించినవే కావడం వల్ల కూడా నా ఆలోచనలు ఆ దిశగా మళ్లాయి. ఇలా విస్తృతంగా చదవడం వల్ల నాకు అధ్యయనం మీద ఆసక్తి, క్రమేణా ప్రీతి పెరిగాయి. అంతేకాదు కథ టెక్నిక్ కూడా బాగా ఆకళింపు అయ్యింది. అలా పదహారేళ్ల ప్రాయంలోనే తొలి కథ రాశాను. కథపేరు గుర్తుకు రావడం లేదు కానీ, అది రెండవ ప్రపంచ యుద్ధం మొదలైన రోజుల్లో రాజకీయ చైతన్యంతో రాసిన కథ. అప్పట్లో 'చిత్రగుప్త' అనే పక్షపత్రిక, 'పెంకిపిల్ల' అనే మాసపత్రిక వస్తూండేవి. నా తొలి కథ 'చిత్రగుప్త' పత్రికలోనే ప్రచురితమైంది. అలా అడపాతడపా వాటికి రాసి పంపుతుండేవాడిని. ఇవి కాక అప్పట్లో 'రూపవాణి' అనే సినిమా పత్రిక కూడా వస్తూండేది. దానికీ సినిమాలపై వ్యాసాలు రాస్తూండేవాడిని.

రచనల్లో గాఢత లోపిస్తోంది

'ఇప్పుడొస్తున్న రచనల గురించి మాట్లాడాలనుకుంటే....లోతైన సాహిత్యం రావడం లేదన్నది నా ఉద్దేశం. అస్సలు రావడం లేదని కాదు. అడపాతడపా కొన్ని మంచి కథలే వస్తున్నాయి. కానీ ఎక్కువ భాగం రచనల్లో గాఢత లోపిస్తోందన్నది నా అభిప్రాయం. వాటిల్లో జీవితానుభవాలు, మానసిక సంఘర్షణలు, వర్గ వైషమ్యాల అస్తిత్వ వాదం వగైరా లోపిస్తున్నాయని నాకనిపిస్తోంది. మారుతున్న సామాజిక పరిస్థితుల ప్రభావంతో బహుకోణాలు సంతరించుకుంటున్న వైరుధ్యాలను బాగా అధ్యయనం చేస్తేగానీ, బలమైన కథా వస్తువు తయారవదు. అది ప్రస్తుతం లోపిస్తున్నది. దీనికి పరిశీలనాత్మక అధ్యయనం చాలా అవసరం. తెలంగాణాలో కమ్యూనిస్టుల వల్ల మినహా పెద్దగా చెప్పకోదగ్గ చారిత్రక అంశాలు ఏమీ లేవనే చెప్పాలి. ఆ క్రమంలో మారిన సామాజిక పరిస్థితుల్లో, సంఘర్షణల్లో సామాజిక స్పృహతో కూడిన రచనలు ఎంతో అధ్యయనం చేస్తే తప్ప రావు. ఏ కొద్దిమందో తప్ప అలాంటి గాఢత కలిగిన రచనలు చెయ్యాలని ఇప్పుడు చాలా తక్కువ మంది మాత్రమే తాపత్రయ పడుతున్నారు. నిజానికి మనకి అంతర్జాతీయ స్థాయికి ఏ మాత్రం తీసిపోని కథలున్నాయని చెప్పగలను. ఆ పరిస్థితిని మరింత పటిష్టం చేయాలంటే సామాజిక స్పృహతో రచన చేయాలి. ఇది రచయితకు చాలా అవసరం....

మధ్య తరగతి జీవులే నా ఇతివృత్తాలు

'నేను పుట్టి పెరిగిన వాతావరణం, తరువాత నాన్నగారు అకస్మికంగా చనిపోవడంతో ఛిన్నాభిన్నమైన మా కుటుంబం, నా చుట్టూ నేను ఎరిగిన సమాజం, పరిశీలించిన సంఘటనలు, మానవతా దృక్పథం, విలువలు, పేదరికం, మనోవేదన, సంఘర్షణలు.....ఇలా అనేక కోణాలనుంచి ఆకళింపు చేసుకున్న జీవన పరిస్థితులు.......ఇవే నా కథా వస్తువులయ్యాయి. ఈ ఒరవడిలో ఉన్నత వర్గాలకు చెందిన కథలూ రాశాను. ఏ వర్గంలో అయినా, సంఘర్షణలు, ఆయా సందర్భాలకు తగిన వేదనలూ ఉంటాయి కదా! కథ అయినా, నవల అయినా ఎక్కడనుంచి వస్తాయి? మన జీవితాలనుంచే పుట్టుకొస్తాయి. అలా సామాజిక స్పృహతో రాసిన ఏ రచన అయినా పది కాలాలపాటు నిలబడుతుంది. కనుకనే ఒక కథకుడిగా నేను ఇలా నిలబడగలిగానన్నది నా ఆత్మ విశ్వాసం. కథా ప్రక్రియనే ఎందుకు ఎంచుకున్నానంటే కచ్చితంగా ఇదమిద్ధంగా చెప్పలేనుగానీ, కథా ప్రక్రియే నాకు బాగా పట్టుబడింది. ఇప్పటివరకూ దాదాపు వంద కథలు రాసి ఉంటాను. కొన్ని కవితలూ రాశాను. ఇవే కాక విమర్శక వ్యాసాలూ రాశాను. జాగ్రత్త చేతకాకపోవడం వల్ల నా రచనలు కొన్ని లభించలేదు. ఇంతవరకూ నాలుగు కథా సంకలనాలు-ప్రథమ సంపుటి 'మునిపల్లె రాజు కథలు' (విశాలాంధ్ర ప్రచురణ), ద్వితీయ సంపుటి 'పుష్పాలు-ప్రేమికులు-పశువులు'; తృతీయ సంపుటి 'దివోస్వప్నాలతో ముఖాముఖి' (అణ్వస గ్రంథమాల ప్రచురణ), నాల్గవ సంపుటి 'అస్తిత్వవాదం-ఆవలి తీరం'. ఒక కవితా సంకలనం వెలువడ్డాయి.....నాకు ప్రేమ్‌చంద్, టాల్‌స్టాయ్, దోస్తవిస్కీల రచనలంటే చాలా ఇష్టం. అందుకే నేను కథాప్రక్రియ వైపు మొగ్గడానికి వారి ప్రభావం చాలా ఉందని చెప్పగలను. నేను రాసింది ఒకే ఒక నవల 'పూజారి'. అది 'పూజాఫలం' అన్న పేరుతో బి.ఎన్. రెడ్డిగారి దర్శకత్వంలో సినిమాగా వచ్చింది. తరువాత మరే నవలా రాయలేదు. రాయాలన్న ఇతివృత్తాలు, ఆలోచనలూ మనసులో సుడులు తిరుగుతున్నా ఇప్పుడు ఓపికలేక రావడం లేదు, రాయలేను కూడా! ఇక్కడ ఒక విషయం చెప్పాలి. నా కథలు ఎవరికో ఇస్తే, అవి మరెవరో తీసుకుని చదివి కాపీ కొట్టి సినిమాలు తీసుకున్న సందర్భాలున్నాయి. వాటి పేర్లు చెప్పడం అనవసరం. అందుకు నేను బాధపడడం లేదు. వారి చోరకళకు జాలి పడుతున్నాను. అంతే!



నాకు లాటరీ తగిలితే......

'నాకెప్పుడైనా లాటరీలో కోటి రూపాయలు లభిస్తే భారతీయ పురాతన విజ్ఞాన గ్రంథాలయిన-ఖేట సర్వస్వం (జైమిని), మేఘోత్పత్తి (అంగీరస), ప్రపంచ లహరి (వాశిష్ఠ), లోహతంత్ర (శాక్యాయుడు), ధాతు సర్వస్వం (బోధాయనుడు), కారక ప్రకరణ (అంగీరస), ఆకాశతంత్ర (భరద్వాజ), శక్తి తంత్ర (అగస్త్య), బృహత్ సంహిత (వరాహమిహిర), వీటిమీద పెద్ద పరిశోధనా సంస్థ స్థాపిస్తానని, నా డైరీలో ఈ లిస్టు రాశాడు......అని రాజుగారి తృతీయ కథా సంపుటి 'దివోస్వప్నాలతో ముఖాముఖి' పుస్తకానికి ముందుమాట రాసిన ఆయన అన్నగారైన మునిపల్లె పిచ్చిరాజుగారు పేర్కొన్నారు. తెలంగాణా సాయుధపోరాటం మీద 'నవయుగ' పత్రికలో మంచి పెద్ద గేయం, మునీంద్ర అనే పేరుతో రాజుగారు రాశారని కూడా ఆ ముందుమాటలో ఆయన పేర్కొన్నారు. అయితే పిచ్చిరాజుగారు అకస్మికంగా మరణించడంతో ఆ ముందుమాట అసంపూర్తిగానే అచ్చయింది.

'చలం వస్తువుకన్నా ఎంతో భిన్నమైన వస్తువు తీసుకుని గొప్ప భావుకతతో అంత చిక్కగానూ కథ నడపగలవారు చలం తరువాత రాజుగారే కదా! అని చాలా సార్లు అనుకుంటాం-అంటూ ప్రసిద్ధ కథా రచయిత కాళీపట్నం రామారావుగారు పేర్కొన్నారంటే రాజుగారి కథల్లో ఉన్న గాఢత ఏపాటిదో అర్థమవుతుంది. 'నా కళ్లల్లో కన్నీటి కణాలను నిలిపినవీ, విద్యుత్తులాగా ఆత్మదీపాల్ని వెలిగించినవీ, మళ్లీమళ్లీ చదివినవీ...ఈ కథలు- అని మరో ప్రసిద్ధ కథకులు మధురాంతకం రాజారాంగారు అంటారు.

తను పుట్టిన మట్టినీ, తన చుట్టూ ఉన్న మనుషులనూ అమితంగా ప్రేమించినవాడు, భారతీయ సంస్కృతిని నిరంతరమూ ఆరాధించిన వాడు, ప్రతి కథకూ ఒక తాత్త్వికాకృతి కల్పించిన వాడు.....ఈ లోకపు తాపత్రయాలకు దూరంగా నిలిచినవాడు, నిఖార్సయిన నిగర్వి మునిపల్లె రాజుగారు.

ఇంగ్లీషు పదాలెందుకు?

'తెలుగులో చక్కని, ప్రజాబాహుళ్యంలో బాగా ప్రాచుర్యంలో పదాలు ఉండగా వాటిని వదిలి చాలామంది రచయితలు, రచయిత్రులు ఇంగ్లీషు పదాలు యథేచ్ఛగా వాడేస్తున్నారు. ఇది ఎంతమాత్రం సమంజసం కాదు. అతడు ఎంటరయ్యాడు, డోర్‌లో నిల్చున్నాడు.....వంటి పద ప్రయోగం తెలుగు భాషని ఖూనీ చెయ్యడమే! ఇది అవగాహనా రాహిత్యం. సరైన కోణంలో సాహిత్యానుభవం లేకపోవడమే ఇందుకు కారణం. దానికితోడు ప్రస్తుత సినిమాలలో కూడా ఇలాంటి భాష వస్తున్నది. ఒకప్పుడు సినిమాలు వ్యవహారిక భాషా వికాసానికి ఎంతో దోహదపడ్డాయి. ఇప్పుడు భాషని దిగజారుస్తున్నాయి.

విశాఖలో పరిచయాలు.... మిలట్రీ ఉద్యోగం

'కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తూ, ఉద్యమాలలో పాల్గొంటూన్న మా అన్నయ్య పిచ్చిరాజును 1943లో పోలీసులు నిర్బంధించి విశాఖ జైల్లో పెట్టారు. అతడిని బెయిల్‌పై విడిపించడానికని నేను విశాఖపట్నం వెళ్లాను. అప్పుడు నా వయస్సు ఇరవై ఏళ్ల లోపే. అక్కడ నాకు కమ్యూనిస్టు నాయకులైన జొన్నలగడ్డ రామలింగయ్య, యలవర్తి విజయ్‌కుమార్, తదితరులతో పరిచయం కలిగింది. మా అన్నయ్యను ఎలాగో బెయిల్‌పై విడిపించగలిగాం. ఈ సందర్భంలోనే నాకు అక్కడ మిలట్రీ అధికారితో పరిచయం కలిగింది. ఆ పరిచయమే నాకు మిలట్రీలో చేరే అవకాశమూ కల్పించింది. అలా నేను 1943లో విశాఖపట్నంలోని మిలట్రీ ఇంజనీరింగ్ సర్వీస్‌లో చేరాను. ఆ కారణంగా నేను దేశంలోని పూనా, అస్సాం, తదితర ప్రాంతాల్లో ఉద్యోగ రీత్యా బదిలీలపై తిరిగాను. చివరికి 1983లో హైదరాబాద్‌లో గ్రేడ్-1 ఆఫీసరుగా పదవీ విరమణ చేశాను. నలభయ్యేళ్లపాటు పనిచేసిన ఈ ఉద్యోగ జీవితంలో అనేక ప్రాంతాల వ్యక్తుల జీవన పరిస్థితులు, అక్కడి సామాజిక, ఆర్థిక నేపథ్యాలు చూసే అవకాశం లభించింది. అంతేకాదు బయట సమాజంలో వర్గాలు, మతాలు వంటి ఎన్ని వైరుధ్యాలున్నా, అక్కడ మనం భారతీయులం అనే భావన, భారత భూమిని రక్షిస్తున్నాం అనే ఉద్వేగం అందరిలో ఉండేవి. అది నేను మరిచిపోలేనిది. ఇక్కడ గమనించదగ్గదేమంటే, నేను సర్వీసులో ఉన్న కాలంలో అప్పుడప్పుడు మాత్రమే కథలు రాశాను. పెద్దగా రాసింది లేదు. సర్వీసు నుంచి రిటైరయ్యాకనే కథ/ఇతర రచనా వ్యాసంగం ఎక్కువయ్యింది.

'నా కథల్లో ఎంపిక చేసిన కొన్నింటిని కేంద్ర సాహిత్య అకాడమీ వారు ఇంగ్లీషు, తదితర భారతీయ భాషల్లోకి అనువాదం చేయించి ఒక సంకలనాలుగా ప్రచురించారు. నా నాలుగవ కథా సంపుటి 'అస్తిత్వ వాదం-ఆవలి తీరం' గ్రంథానికి కేంద్ర సాహిత్య పురస్కారం లభించింది. అలాగే నా మొదటి రెండు సంపుటాలకు 1993లో నూతలపాటి సాహితీ పురస్కారం, జ్యేష్ఠ లిటరరీ ట్రస్ట్ ప్రప్రథమ పురస్కారం, 1994లో రావిశాస్త్రి స్మారక సాహిత్య నిధి మొట్టమొదటి పురస్కారం, తదితర పురస్కారాలు లభించాయి.

- సర్వజిత్



జరిగిన కథ

"అవును. పుస్తకాల్లో చెప్పినట్లు యుద్ధవ్యూహాలని నడిపిస్తే – యీపాటికి మనం ఢిల్లీలో వుండవలసింది. హిట్లరు చూడండి! శాస్త్రం గీస్త్రం పాడికి నైజాంతా! వాడి 'మైన్‌కాంఫ్' వాడికి శాస్త్రం! కనిపించిన చోటల్లా దెబ్బ కొట్టడమే! వాడికి వాడే సమానం అండీ! మన వాళ్ళేమిటీ – చచ్చు!" అన్నాడు కెప్టెను రైటు ఇంత 'వార్ ఆఫీసు' వీరుడున్నూ.

"మా వాళ్లూ అదే అంటారు. శాస్త్ర ప్రకారం అవుతే కుక్క పిల్లలు పుడతాయని! యేదో సంసారపక్షంగా పోవాలి మరి!" అన్నాడు సేట్జీ. అందరూ ఫక్కుని నవ్వారు. సేట్జీ నాదగ్గరకొచ్చి "మనం హిందువులమని అడుగుతున్నాను. తమకెందరండీ మగసంతానం?" అన్నాడు కాస్త మెల్లిగా, నలుగురికి వినిపించేలాగే. ఈ భోగట్టా దేనికెందుకయ్యా – అనబోయి యేదో పెద్దముండావాడు. ఖద్దరు కట్టుకున్నాడు – మర్యాదగానే జవాబు చెబితే పోతుందని.

(నిన్నటి సంచిక తరువాయి)

"సంతానం అసలు లేదండీ" అన్నా.

"అయ్యో! మన ధర్మశాస్త్ర ప్రకారం ద్వితీయ కళత్రాన్ని చేసుకోలేకపోయారా?" అన్నాడు యెంతో విచారిస్తూ.

"నేను బ్రహ్మచారినండీ. వివాహం చేసుకోలేదు" అన్నా నవ్వుతూను.

"మీబోటి భీష్ములు సత్యాగ్రహోల్లో వుంటే ఈ పాటికి గాంధీ మహాత్ములు స్వరాజ్యం సంపాదించేవారు! యేదో సుభాషుబాబు ధర్మమా అని స్వరాజ్యం కనుచూపు మేరలో ఉంది. కోహిమా దాటిందంటే మన వాళ్ళే వచ్చట్టే! ఏమిటో యీ కాంగ్రెసు వైఖరి? ఘడియకొక మాట–నిమిషానికొక బేరం! ఇంగ్లీషువాళ్ళని నానా తిప్పలూ పెడుతున్నారు. పోనీలెండి. బ్రిటిషువాడుంటే భూ దహనం అంటున్నారు సోషలిస్టులు. ఎలాగేనాసరే – మాలాంటి వాళ్ళకి చేతినిండా పని దొరుకుతుంది" అన్నాడు మనస్ఫూర్తిగానే సేట్జీ."నాకు రాజకీయాలు తెలియవండి!" అన్నాను.

"అవును. నీతీ–జాతీ అంటూ ఇంకా పాకులాడుతున్న మన బోడిగాళ్ళం యీ రాజకీయాలతో వేగలేమండి! అయినా వంశ పారంపర్యంగా వస్తూన్న వృత్తి వదులుకోలేక మన సాంప్ర దాయం అనుసరించి–యీ జన్మగడుపుకుంటున్నా నండి! మావాడున్నాడన్నమాటేకాని ఎందుకూ..." అన్నాడు ఆయన. నా కేమిటనడమో తెలిసింది కాదు. పోనీ వాళ్ళబ్బాయి గురించి పరామర్శించుదాం అని –"మీకుమారుడు–ఏం చేస్తున్నాడండీ?"అనిఅడిగేను.

"వాడిని ఇంజనీరింగుకి సీమకు పంపించి బి.యస్‌సి. ఆనర్సు ప్యాసు చేయించానండి. గవర్న మెంటు నౌఖరి మాకు అచ్చిరాదని – పుస్తకాల చదువు యెలావున్నా – నా దగ్గిరే వుంచుకుని – అన్ని విషయాల్లోనూ క్షుణ్ణంగా తర్ఫీదు చేయించానండి. వాడు బాగా చేతికి అందొచ్చేవేళకి – కాంగ్రెసులో చేరాడు. కాంగ్రెసు సభలు, సమావేశాలు, బొంబాయి కరాచీ, చెన్నపట్నం, అలహాబాదు, కాన్పూరు ఎక్కడ జరిగినా భోజనాలకీ, పందిళ్ళకీ, పాకలకీ, గుడా రాలకీ, దీపాలకీ, పంఖాలకీ ఒకటేమిటి శానిటరీ వగైరా సమస్త సప్లయిలకీ మావాడిదేనండీ కంట్రాక్టు. అటు దేశసేవా యిటు నాలుగు డబ్బులూ చేసుకుం టున్నాడండీ! రేపు పొద్దున్న స్వరాజ్యం వచ్చిందంటే మనం ముందుకొచ్చి నలుగురిలోనూ తలెత్తుకుని తిరగా లంటే యెన్నో ఖరీపనులు చేయించాల్సుంటుంది. ఆ పనులన్నీ డిపార్టుమెంటు చేయించగలదాఅండీ – కంట్రాక్ట ర్లంటూ వుంటేగాని! మీరు చిన్నవారైనా బుద్ధిలో భీష్ములు. బహు యోగ్యులు! మీతో సాంగత్యం లభించడంచేత యేదో నా సంసారంగోడు మీ ముందు వెళ్ళబోసుకుంటున్నాను! మీరు మరోలాగ భావించకండి అని నాప్రార్థన! ఈ దొర్లతో చెప్పుకో గలనా– చెప్తూతే వాళ్ళకి బోధపడి యేడుస్తుందా? నన్ను మన్నిం చాలి – మీ కాలం చాలా వృధా చేశాను! వాళ్ళేదో జల్సాకబుర్లు చెప్పుకుంటు న్నారులెండి" అన్నాడు సేట్జీ. వాళ్ళవేపుచూసి చిరునవ్వునవ్వుతూ. దొర్లు విస్కీ సోడాలు పూర్తిచేసుకున్నారు.

"కెప్టెను రావు! మనం డెకింగు తడపడం గురించి చర్చించాము. మట్టివేసి తడపాలని మనం అంటున్నాం. వాళ్లు – డికెన్సు! మీరేమంటారు? అన్నాడు కెప్టెను వీలరు.

"సిమెంటు సంచులు పరిచి తడుపుతాంలెండి" అన్నాడు ఎడిసన్ను. "సంచులు మీవి కావు. అవి డిపార్టుమెంటువి.



సిమెంటు మీకు సరఫరా చెయ్యడమే మావంతు. మిక్సరుల్లో బస్తాలు వెలిపి – మూర్తికి మూర్తే – వెంటనే సంచులు లెక్కకట్టి. ఉత్తరక్షణం అప్పగించవలసిందే – డిపార్టుమెంటు అసిస్టెంటు ఇంజనీరుకి! ఆ విషయంలో నేను మీకేం సదుపాయం చేయలేను" అని ఖచ్చితంగా చెప్పేశా. సేట్జీ – దొరలు ఒకరి చెవిలో ఒకరు గుసగుసలు ఆడుకున్నారు.

"పాణీషుర్‌లోనూ, లఖింపూర్‌లోనూ, హాకహాట్లీలోనూ, మొన్న ఇక్కడ భోగాపురంలోనూ సంచులని కంట్రాక్టరుకే ఇచ్చేశాంకదూ–సేట్జీ! అక్కడో పద్ధతీ, అవలంబించించి, సంచులు వాళ్ళకే ఇచ్చేస్తే ఏ బెడదా వుండదు. అలా చేద్దాం –



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

కెప్టెన్ రావు!" అన్నాడు రైటు.

"అవునండి – వెనక అలాగే జరిగిందండి. ఆడిట్ యేమి అభ్యంతరం చెప్పలేదండి" అన్నాడు సేట్జీ..పిల్లికి ఎలుక సాక్ష్యం – కంచే చేనుని మేయడం. "నేను అంగీకరించనండి! టెండరులో రాసుకున్నట్టు జరగవలసిందే!" అన్నాను. కఠినంగా – లాలూచి సహించలేక.

...ఇంతట్లో – మెయిలుమాట జ్ఞాపకం వొచ్చింది. స్టేషను మేష్టరుకి ఖబురు పంపించి – మెయిలు యేవేళకి యిలా వెళు తుందో కనుక్కోమన్నా. స్టేషను మేష్టరే స్వయంగా రొజుకుంటూ వచ్చి "అప్పుడే రెక్కవాలింది, మరి రెండు నిమిషాల్లో వస్తుందండి. మెయిలుని ఆపించమని శలవా?" అని అడిగారు..నా మనసులో వున్నది అతను ఎలా గ్రహించాడో! ఒక్క నిమిషం ఆలోచించా...రైలుని ఆపిస్తినా సుఖని నేను పలుకరించడం వీళ్ళు చూస్తారు. ఇక వెంటనే పని కట్టేసి, వస్తు వాహనాలు నగలు నాణ్యాలు – బహుమతులు విందులు – ఆమెకివ్వడం మొదలెడతారు. నా మర్యాదా, ఆమె మర్యాద కూడా పోయి అపఖ్యాతి పాలవుతాం. వొద్దు అనుకుని, స్టేషనుమేష్టరుతో 'యేమీలేదు – వూరికే భోగట్టాకు అడిగే'నని సర్దేశాను – "చిత్తం!" అని కొత్తగా నేర్చుకున్న మిలటరీ సలాం కొట్టి వెళ్ళిపోయాడు...

...సరి, మధ్యాహ్నం మళ్ళీ కథ ప్రారంభం! 'డెకింగు' విషయం మళ్ళీ వాళ్ళెత్తారు. "ఆ విషయం ఉదయం తేల్చేశా నుగా – తిరిగి ఎందుకు లేవనెత్తడం?" అని నేను విసుగ్గా అన్నాను. "అనవసరపు పని, వృధా ప్రయాస. కొత్తపద్ధతీ – ఎందుకండీ లేనిపోయింది" అన్నారు ఎడిసన్ను కచ్చీవాళు ళ్ళున్ను. వాళ్ళు పాడిన పాటకి దొరలు తాళం వేయడం. గులాబ్ చందుసేటు అన్నాడు.

"కెప్టెన్ రావుగారూ! యీ మిలిటరీ వంతెనలు మఖలో పుట్టి – పుబ్బలో విరిగి – ఉత్తరలో వృతికాస్నానం చేస్తాయి. ఆచంద్ర తారార్కం వుండిపోయేటట్టు మీరు కట్టమంటారు. జపానువారు రేపు క్రిష్టమసుకి కలకత్తా, చిటగాంగు, చెన్నపట్నం విధిగా బాంబు చేయబోతున్నారని నాకు నిక్కచ్చిగా జపాను శిబిరం నుంచే – అక్కడ మా తమ్ముడు నేతి కంట్రాక్టరు లెండి. వాడి ద్వారా తాజా కబురు వచ్చింది. ఈ పరిస్థితుల్లో – మమ్మలిని నాలుగు డబ్బులు చేసుకోనీయకుండా, ఇలా చిత్రహింసచేయడం బ్రాహ్మణ ధర్మంకాదు. ఇవి చేతులు కావు – కాళ్ళనుకోండి. మిమ్మల్ని బతిమాలుకుంటాం! జపానువారి ధర్మమా అంటూ – యీ వంతెనలు కూలిపోయాక యీ సంచులమాట ఎవడి క్కావాలి? ఈ వైబ్రేటర్లవూసు ఎవడెత్తుతాడు? అంగుళం కడ్డీల విషయం ఎవడు పట్టించుకుంటాడు? మీరు మామీద కాస్త దయవుంచితేకాని దూరదేశాలనుంచి వచ్చాం – చితికిపోతాం సుమండీ! ఆ తరువాత మీ చిత్తం!" అన్నాడు ఒక్కధాటీని.

"జేను సుమండీ, కెప్టెను రావు! మొన్న కలకత్తానుంచి అమెరికను ఇంటెలిజన్సు ఆఫీసరొచ్చి మెస్సులో సరిగ్గా యీ సంగతే చెప్పాడు మా అందరితోనూ అతి రహస్యంగా! రేపటి క్రిస్టమస్‌లో జపాన్‌వాడి ప్లేనుల దాడితో యుద్ధం త్వరగా అటో ఇటో తేలిపోతుంది అని అందరం సంతోషించాం" అన్నాడు కెప్టెను వీలరు.

"జపానువాడి ఉద్దేశాలు నాకు తెలియవు. కాని ఇంజనీ రింగు శాస్త్రం ప్రకారమున్నూ, టెండరు షరతుల ప్రకారమున్నూ – పనులు చేయించడం – నాకు తెలుసు!" అని కాస్త గట్టిగానే అన్నాను, ఈ బేరసారాలు ఆపుచేద్దాం అని. ఏముంది – నేను అవునని, వాళ్లు కాదని! నేను కాదని, వాళ్ళు అవునని, యిలాగే వెళ్ళింది సాయంకాలం అంతా...చీకటి పడ్డాక నా సెలూనికి వెళ్ళిపోతూంటే ఎడిసన్ను, నన్ను సాగనంపడానికి వచ్చి: "రాత్రి పది గంటలకి అమెరికన్ ఆఫీసర్ల స్పెషల్ యిలా వెళుతూంది. స్పెషలుని యిక్కడ ఆపించి ప్లాటుఫారంమీద డిన్నరు యేర్పాటు చేయించారు డికిన్సుగారు. మీరు రావలసిందనీ మరీమరీ కోరుతూ నన్ను పంపించారు. మీకు తప్పకుండా దయ చెయ్యాలి!" అన్నాడు.

"నాకు ఆరోగ్యం సరిగాలేదు. డికిన్సుగారితో నన్ను క్షమిం చండని చెప్పండి. మీకు ధన్యవాదాలు!" అని చెప్పేసి, సెలూన్‌కి వెళ్ళిపోయాను. మరోగంట పోయాక సెలూన్‌లో వంట పూర్తిచేసి – అయ్యరు అరిటాకులో అన్నం వొడ్డించి భోజనానికి రమ్మన మని పిలిచాడు. బంగాళదుంప మసాలాకూర, మైసూరు కట్టు దారు, నక్క దోసకాయ ఆవకాయ – సొంఠి, అల్లం, కరివేపాకు వేసిన ఫ్రిజిడేరు మజ్జిగ – ఇక భూప్రపంచంమీద కావలసినదేం వుంది! అమ్మ యెప్పుడూ అనేది – భోజనం అయాక – రెండు తమలపాకులూ వక్కపొడి అరంగంతో తాంబూలం వేసుకుంటే నోటికి శుద్ధి, వొంటికి మంచిది అని. అలాగే తాంబూలం వేసుకుని సాయంకాలం చెన్నపట్నంనుంచి వచ్చిన పత్రిక చదువుదాం అని పడక దీపం వేశాను సెలూన్‌లో. ఇంతలో సేట్జీవచ్చి నమస్కారంచేసి, "అమెరికన్ ఆఫీసర్ల స్పెషలులో అసలైన 'స్టోర్సు'ని దిగుమతి చేయిస్తున్నాను. రాత్రికి పద్మినీ, హస్తినీ, చిత్తినీ. శంఖినీ – అన్ని రకాలు యేర్పాటు చేయించాను. తమ ఆజ్ఞ..." అని చేతులు నులుపుకుంటూ నిలబడ్డాడు. నాకు తలప్రాణం తోకకొచ్చింది. "ఫో. యిక్కడ నుంచి ఫో" అని అన బోయి మళ్ళీ నాలిక కరచుకొని – "మీరు దయచేసి వెళ్ళండి! మరెప్పుడూ నా సెలూను దగ్గరకు రాకండి. నమస్కారం!" అని అతని ముఖంమీద తలుపుమూసి లోపలి గడియవేశాను. "చిత్తం!" అంటూ సేట్జీ వెళ్ళిపోయాడు.

– ఇంకా వుంది.

ప్రముఖ నటి శ్రీదేవి కన్నుమూత



బహుభాషా నటి శ్రీదేవి గతనెల 24వ తేదీ రాత్రి దుబాయ్‌లో ప్రమాదవశాత్తు మరణించారు. ఆమె వయస్సు 54 సంవత్సరాలు. బాలనటిగా నాలుగో సంవత్సరం నుంచే ఆమె నట జీవితం ప్రారంభమైంది. దక్షిణాది భాషలతోపాటు హిందీ లోనూ ఆమె నటిగా ఉన్నత శిఖరాలను అధిరో హించారు. 2012లో ఆమె పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. గతనెల 20న బంధువు వివాహంలో పాల్గొనేందుకు భర్త బోనీ కపూర్, చిన్న కుమార్తె ఖుషితో కలిసి ఆమె దుబాయ్ వెళ్లారు. 24వ తేదీ రాత్రి ఆమెకు గుండెపోటు రావడంతో మరణించిందని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ ఘటనపై అక్కడ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. రకరకాల వార్తలు, ఊహాగానాలు వెలువడటంతో ఈ కేసు కొన్ని మలుపులు తిరిగింది. బోనీకపూర్‌ను ప్రాసి క్యూషన్ కొన్ని గంటలపాటు మూడు విడతలుగా విచారించింది. శ్రీదేవి మృతదేహాన్ని అప్పగించేందు కు తొలుత అధికారులు అంగీకరించకపోవడంతో బహుశా ఆమె మరణం వెనుక బలమైన కారణాలే ఉంటాయని ప్రచారం జరిగింది. చివరకు వాట న్నింటికీ ముగింపు పలు కుతూ శ్రీదేవి బాత్‌రూమ్ లో అపస్మారకస్థితికి వెళ్లి బాత్‌టబ్‌లో మునిగి ప్రమాదవశాత్తు మరణించిందని నిర్ధారించారు. ఈ మేరకు దుబాయ్ ప్రభుత్వం ఫోరెన్సిక్ నివేదికను విడుదల చేసింది. దీంతో కేసును మూసివేశారు. స్థానిక చట్టాల ప్రకారం లాంఛనాలన్నీ పూర్తిచేసుకు న్న తరువాత గతనెల 27వ తేదీన ఆమె భౌతిక కాయాన్ని భర్త బోనీకపూర్‌కు అప్పగించారు. అక్కడినుండి ప్రత్యేక విమానంలో ముంబయ్‌కి తరలించారు. 28న అంత్యక్రియలు నిర్వహించా రు. అంతకుముందు జరిగిన అంతిమయాత్రలో 25 వేల మందికి పైగా పాల్గొన్నారు.



సీపీఐ నేత ప్రబోధ్‌పాండా మృతి

భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి ప్రబోధ్‌పాండా (72) గతనెల 27న కన్నుమూశారు. కోల్‌కతాలోని పార్టీ కార్యాలయం భూపేష్ భవన్‌లోని రూమ్‌లో ఉన్న పాండా తీవ్ర గుండెపోటు రావడంతో మృతిచెందారని పార్టీ వర్గాలు తెలిపాయి. లోక్‌సభ మాజీ సభ్యుడు, అఖిలభారత కిసాన్ సభ మాజీ అధ్యక్షుడు అయిన పాండా 1946 ఫిబ్రవరి 7వ తేదీన పశ్చిమ బెంగాల్‌లోని పూర్వ మిద్నాపూర్‌లో రైతు కుటుంబంలో జన్మించారు.

చైనా అధ్యక్షుడి గడువు పరిమితి రద్దుకు ప్రతిపాదన



చైనా అధ్యక్ష పదవికి విధించిన రెండుసార్లు పరిమితిని రద్దు చేయాలని పాలక కమ్యూనిస్టుపార్టీ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన అమలు జరిగితే ప్రస్తుత అధ్యక్షుడు జిన్‌పింగ్ అధ్యక్షుడిగా రెండు సార్లు తన పదవీ కాలాన్ని పొడిగించేందుకు అవకాశం కలుగుతుంది. ప్రస్తుత నిబంధన ప్రకారం 2023తో ఆయన పదవీకాలం పూర్తవు తుంది. పార్టీ ప్రతిపాదన అమలు జరిగితే ఆ తరువాత కూడా ఆయనే అధ్యక్షునిగా కొనసాగవచ్చు.



మహిళల టీ20 సిరీస్ భారత్‌దే..

దక్షిణాఫ్రికా మహిళా క్రికెట్ జట్టుతో గతనెల 24న కేప్‌టౌన్‌లో జరిగిన చివరి టీ 20 మ్యాచ్‌లో భారత్ జట్టు 54 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో 3–1తో సిరీస్‌ను భారత్ జట్టు సొంతం చేసుకుంది. వన్డే సిరీస్‌ను కూడా భారత జట్టు 2–1తో గెలుచుకున్న విషయం తెలిసిందే.

సిరియాలో కొనసాగుతున్న మారణహోమం

అంతర్జాతీయ వార్తలు

సిరియాలో తిరుగుబాటుదారుల అధీనం లోని తూర్పు ఘౌటాలో గతనెల మూడోవారం నుంచి 23వ తేదీ వరకు కొనసాగిన వైమా నిక దాడులు, కాల్పుల్లో 500 మంది వరకు పౌరులు మరణించారని 'సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్' అనే పర్యవేక్షక సంస్థ వెల్లడించింది. మృతుల్లో 121 మంది చిన్నారులు ఉన్నారని తెలిపింది.

కాంగోలో 49 మంది హత్య

ప్రజాస్వామ్య గణతంత్ర కాంగోలో జాతుల మధ్య చెలరేగిన హింసలో 49 మంది పౌరులు హత్యకు గురయ్యారు. ఈశాన్య ప్రావిన్స్‌లో హెమా, లెండూ అనే రెండు తెగల మధ్య ఘర్షణ తలెత్తిందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

చివరి టీ20లో విజయం.. సిరీస్ భారత్‌కే

దక్షిణాఫ్రికా జట్టుతో గతనెల 24న కేప్‌టౌన్‌లో జరిగిన చివరి టీ 20 మ్యాచ్‌లోనూ భారత్ ఏడు పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో భారత్ టీ 20 సిరీస్‌ను 2–1తో కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో భారత్ ముందుగా 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. అనంతరం దక్షిణాఫ్రికా జట్టు 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 165 పరుగులు చేసింది. వన్డే సిరీస్‌ను కూడా భారత్ 5–1 తేడాతో దక్కించుకున్న విషయం తెలిసిందే. దీంతో భారత్‌జట్టు గతంలో ఎన్నడూ లేనివిధంగా దక్షిణాఫ్రికా గడ్డపై రెండు ఫార్మాట్‌లను గెలుచుకుని తన పర్యటనను ముగించుకుంది.

కొఠారికి 11 రోజుల రిమాండ్

జాతీయ వార్తలు వీక్లీ రౌండప్

రోటోమాక్ పెన్నుల తయారీ సంస్థ అధిపతి విక్రమ్ కొఠారి, కుమారుడు రాహుల్ కొఠారిలకు ప్రత్యేక కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) న్యాయస్థానం గతనెల 24న 11 రోజులపాటు రిమాండ్ విధించింది. వీరు ఏడు బ్యాంకులకు రూ.3.695 కోట్ల మేర టోకరా వేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. విక్రమ్ కొఠారి, అతనికి చెందిన సంస్థలపై మరో 12 అభియోగాలను ఆదాయపుపన్ను శాఖ మోపింది. వీటితోపాటు కంపెనీకి చెందిన మరో మూడు బ్యాంకు ఖాతాలను స్తంభింపజేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఇప్పటివరకు మోపిన అభియోగాల సంఖ్య 18కి, జప్తు చేసిన బ్యాంకు ఖాతాల సంఖ్య 17కు పెరిగింది.

కార్తి చిదంబరం అరెస్టు

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తి చిదంబరంను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) అరెస్టు చేసింది. టెలివిజన్ సంస్థ ఐఎన్‌ఎక్స్ మీడియాకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల మండలి (ఎఫ్‌ఐపీబీ) నుంచి నిధుల అనుమతులు ఇప్పించేందుకు కార్తి అవినీతికి పాల్పడ్డారనేది ప్రధాన ఆరోపణ. గతనెల 28న లండన్ నుంచి తిరిగివస్తున్న కార్తిని చెన్నై విమానాశ్రయంలో అదుపులోకి తీసుకుని ఢిల్లీలోని తమ ప్రధాన కార్యాలయానికి సీబీఐ తరలించింది. ఈనెల ఒకటో తేదీన కార్తీని సీబీఐ ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా, ఐదురోజులపాటు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

జయేంద్ర సరస్వతి అస్తమయం




ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, కంచి కామకోటి పీఠాధి పతి జగద్గురు జయేంద్ర సర స్వతి గతనెల 28న మర ణించారు. తమిళనాడు రాష్ట్రం కాంచీపురంలోని పీఠానికి అధిపతిగా వ్యవహరిస్తున్న జయేంద్ర సరస్వతి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గతనెల 27వ తేదీ అర్ధరాత్రి తరువాత తీవ్ర అస్వస్థతకు గురికావడంతో భక్తులు సమీపం లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గుండెపోటు వచ్చి ఉదయం 7 గంటల ప్రాంతంలో మృతిచెందారు. జయేం ద్ర సరస్వతి అస్తమయంతో కంచి కామకోటి 70వ పీఠాధిపతిగా శంకర విజయేంద్ర సరస్వతి ఈనెల ఒకటో తేదీన బాధ్యతలు స్వీకరించారు.

అజర్‌బైజాన్‌లో 30 మందికి పైగా సజీవ దహనం

అజర్‌బైజాన్ బాకులోని మాదకద్రవ్య వ్యసనపరుల పునరావాస కేంద్రంలో ఈనెల ఒకటోతేదీ మధ్యాహ్నం మంటలు రేగాయి. ఈ ఘటనలో 30 మందికి పైగా మరణించినట్లు స్థానిక వార్తాసంస్థలు తెలిపాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి 31 మందిని రక్షించారు. విద్యుత్ సరఫరా వ్యవస్థలో లోపం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

విశాఖలో భాగస్వామ్య సదస్సు



విశాఖపట్నంలో భాగస్వామ్య సదస్సు గతనెల 24న ప్రారంభమైంది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ)తో కలిసి రాష్ట్రప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. తొలిరోజు సదస్సులో రూ.41 వేల కోట్లు, ఈనెల 25న రెండోరోజు రూ.1,74,569 కోట్ల విలువగల 285 ఒప్పందాలు జరిగాయి. సదస్సు చివరిరోజైన గతనెల 26న రూ.2,20, 951 కోట్ల విలువైన 369 ఒప్పందాలు కుదిరాయి. దీంతో మొత్తం ఒప్పందాల విలువ రూ.4,39,765 కోట్లకు చేరుకుంది.

క్రీడా వార్తలు

రికార్డు సృష్టించిన జిమ్నాస్ట్ అరుణ

ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జరిగిన జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో వ్యక్తిగత పతకం సాధించిన తొలి భారతీయురాలిగా తెలుగ మ్మాయి బుద్దా అరుణ రెడ్డి రికార్డు సృష్టించింది. మహిళల వాల్ట్ ఈవెంట్‌లో ఆమె కాంస్యం సాధించింది. ఆమె 13.649 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. కొద్దిలో రజత పతకాన్ని కోల్పోయింది. ఈ జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో 16 దేశాలకు చెందిన అథ్లెట్లు పాల్గొన్నారు. అరుణ ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌లో నిరాశ పరచడంతో ఈ ఈవెంట్‌లో ఏడో స్థానంలో నిలిచింది.

ఓబీసీ కేసులో సీబీఐ లుకౌట్ ఉత్తర్వులు

ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ)ని రూ.389.85 కోట్ల రుణం విషయంలో మోస గించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 'ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ ప్రై.లి.' డైరెక్టర్లు నలు గురిపైన కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) 'లుక్ అవుట్' ఉత్తర్వులు జారీ చేసింది. వీరు ఒకచోట నుంచి మరొక చోటుకు వెళ్లిపోకుండా ఆంక్షలు విధించడానికి ఈ చర్య దోహదపడనుంది. ద్వార కాదాస్ ఇంటర్నేషనల్‌ను 2014లోనే ఎగవేతదా రుగా సీబీఐకి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించింది.

మోడీ, ఛోక్సీ పాస్‌పోర్టుల రద్దు

పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణం కేసులో సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)లు దర్యాప్తు ప్రక్రియను ముమ్మరం చేశాయి. ప్రధాన నిందితుడైన నీరవ్ మోడీ, మెహుల్ ఛోక్సీల పాస్‌పోర్టులను ప్రభుత్వం రద్దు చేసింది. నీరవ్ మోడీ, ఆయన గ్రూప్‌నకు చెందిన రూ.523 కోట్లకు పైగా విలువచేసే 21 స్థిరాస్తులను ఈడీ గతనెల 24న జప్తు చేసింది. ఈ జప్తుతో ఈడీ జప్తు చేసిన మొత్తం ఆస్తుల విలువ రూ.6.393 కోట్లకు చేరుకుంది. నీరవ్ మోడీ రూ.12,717 కోట్ల మోసానికి పాల్పడ్డాడని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలిపింది. బ్యాంక్ గతంలో పేర్కొన్న మొత్తం కంటే ఇది రూ.1,323 కోట్లు అధికం. నీరవ్‌కు చెందిన ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థ అమెరికాలోని న్యూయార్క్‌లో దివాలా పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ కేసులో విచారణకు హాజరు కావాలని సీబీఐ నీరవ్‌కు ఎస్.ఎం.ఎస్. పంపగా, వ్యాపారాల కారణంగా రావడం సాధ్యం కాదని అతడు బదులిచ్చాడు.

ఏపీ ఎంసెట్-2018 ప్రకటన విడుదల

రాష్ట్ర వార్తలు

ఆంధ్రప్రదేశ్ ఎంసెట్ – 2018 ప్రకటన గతనెల 26న విడుదలైంది. 28వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఏప్రిల్ 18 నుంచి హాల్ టిక్కెట్లు అందుబాటులో ఉంటాయి. ఏప్రిల్ 22 నుంచి 25 వరకు ఇంజినీరింగ్ పరీక్షను నిర్వహిస్తారు. వ్యవసాయ పరీక్ష 25, 26 తేదీల్లో ఉంటుంది. ఉర్దూ వారికి కర్నూలులోనే కేంద్రం ఏర్పాటు చేస్తారు.


ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు గతనెల 28 నుంచి ప్రారంభ మయ్యాయి. మొత్తం 5,25,998 మంది రాయాల్సి ఉండగా, 5,07,903 మంది హాజరయ్యారు. తెనాలిలోని నెహ్రూ నికేతన్ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. రెండో ఏడాది పరీక్షలు ఈనెల ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యాయి.

ఆసియా రెజ్లింగ్‌లో నవజోత్‌కు స్వర్ణం

కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరుగుతున్న ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన నవ్‌జోత్ కౌర్ స్వర్ణ పతకం సాధించిం ది. ఈ పతకం గెలిచిన తొలి మహిళగా చరిత్ర సృష్టించింది. ఈనెల 2వ తేదీన 65 కిలోల విభాగంలో నవ్‌జోత్ స్వర్ణపతకాన్ని గెలుచు కుంది. రియో ఒలింపిక్స్‌లో కాంస్య పతక విజేత సాక్షి మలిక్.. ఈ పోటీల్లో కాంస్యంతో సరిపెట్టుకుంది

ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మృతి



తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో ఈనెల 2వ తేదీ ఉదయం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 12మంది మావోయిస్టులు, గ్రేహౌండ్స్ కమాండో ఒకరు మరణించారు. తెలంగాణ రాష్ట్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా సరిహద్దు వెంకటాపురం మండలం తడపల గుట్టలు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పూజారి కాంకేడ్ మధ్య కొండపల్లి అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మావోయిస్టు తెలంగా ణ రాష్ట్ర కార్యదర్శి హరిభూషణ్, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి ఆజాద్ తదితర నాయకులు ఇక్కడి అటవీ ప్రాంతంలో సమావేశమైనట్లు అందిన సమాచారంతో తెలంగాణ గ్రేహౌండ్స్ దళాలు మాటువేసి కాల్పులు జరిపినట్లు సమాచారం.

నాగాలాండ్, మేఘాలయలో ముగిసిన పోలింగ్



నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు గతనెల 27న ముగిశాయి. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. నాగాలాండ్‌లో 75 శాతం, మేఘాలయలో 84.86 శాతం పోలింగ్ నమోదైంది. ఈ రెండు రాష్ట్రాలతోపాటు త్రిపురలో ఓట్ల లెక్కింపు ఈనెల 3వ తేదీన చేపట్టారు.

4 నుంచి తెలంగాణ ఎంసెట్ దరఖాస్తుల ప్రక్రియ


తెలంగాణ వార్తలు

తెలంగాణ ఎంసెట్‌కు దరఖాస్తు ప్రకటన గతనెల 27న వెలువడింది. ఎంసెట్ ప్రక్రియ ఈనెల 4వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది. తెలంగాణలో మొత్తం 14 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఎంసెట్ విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, కర్నూలులో జరుగుతుంది.

హల్లో... చెవుడొచ్చింది...



విశాలాంధ్ర జనరల్ డెస్క్ : ఇదివరకు బస్సులు లేదా రైళ్లలో ప్రయాణించేటప్పుడు కొంత దూరం ప్రయాణించాక ఎదురుగా లేదా పక్కనున్న వాళ్లతో పరిచయాలు ఏర్పడి మాటమాట కలిసేవి, సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ప్రయాణం సాగించేవారు. ప్రయాణం చేస్తున్న వారిలో పదిమందిలో ఇద్దరి చేతుల్లో వార్తాపత్రికలుండేవి. కుటుంబ విషయాలు ముగిసాక వార్తలపై చర్చలు జరిగేవి. ఎంతదూరం ప్రయాణించినా పెద్దగా బోర్ కొట్టేది కాదు.ఇది ఒకప్పటి మాట. కాని ఇప్పుడు పరిస్థితులు మారాయి. ముఖ్యంగా సెల్‌ఫోన్లు, స్మార్ట్‌ఫోన్లు రాజ్యమేలుతున్న పరిస్థితుల్లో బస్సులు లేదా రైళ్లలో వయస్సుతో సంబంధం లేకుండా ఎక్కగానే ఇయర్‌ఫోన్లు తీసి స్మార్ట్‌ఫోన్లకు తగిలించి చెవుల్లో పెట్టేసుకుంటున్నారు. ఇక వారికి ప్రపంచంతో ఎటువంటి సంబంధం ఉండదిక. ముఖ్యంగా యువతలో ఈ దురాచారం ఎక్కువైపోయింది. ఇళ్లలోనూ అదే పరిస్థితి అనుకోండి. అంతంతసేపు ఇయర్‌ఫోన్ల వాడకం మంచిది కాదని పెద్దలు చెప్పినా వినే వారే కరవయ్యారు. మాట వినని అలాంటి వారికి వినికిడి సమస్యలు చిన్న వయస్సులోనే వచ్చేస్తున్నాయి. పరిమితికి మించి అదే పనిగా ఇయర్‌ఫోన్లు వాడకంతో వినికిడి సమస్యలు మొదలవుతున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా ప్రపంచ జనాభాలో ఐదు శాతం మంది వినికిడి సమస్యతో బాధపడుతున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. ఈ మధ్య ఈ సమస్య బాగా పెరిగింది. దీనికి శబ్ద కాలుష్యం తోపాటు ఆధునికత సాంకేతికతే అంటే ఇయర్‌ఫోన్లే కారణాలని కూడా ఆ గణాంకాలు విశ్లేషిస్తున్నాయి. ప్రపంచ జనాభాలో 36 మిలియన్ల మంది వినికిడి దోషాలు ఉన్నవారే. వీరిలో 32 శాతం మంది బాలలు ఉన్నారని, ఇది ఆందోళన కలిగించే అంశమని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. 12 నుంచి 35 ఏళ్లలోపు వయస్సున్న వారిలో 11 శాతం మంది వినోదభరిత కార్యక్రమాల కోసం ఇయర్‌ఫోన్లు వాడుతున్నారట. ఇయర్ ఫోన్ల నుంచి వచ్చే శబ్ద తరంగాల తీవ్రత వల్ల వినికిడి సామర్థ్యం తగ్గిపోతున్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెలువరించిన ఒక నివేదికలో పేర్కొన్నది. బాధాకరమైన విషయమేమిటంటే ఇలా వస్తున్న వినికిడి సమస్యలలో 40 శాతం దాక చికిత్సకు లొంగని విగా ఉంటున్నాయి. ఇయర్‌ఫోన్ల వాడకంతో వచ్చే వినికిడి సమస్యలను గుర్తించడంలో కూడా నిర్లక్ష్యం జరుగుతున్నదని ఆ నివేదిక పేర్కొన్నది.



Sunday Special

అనర్థాలు ఇవి...

ఇయర్‌ఫోన్ల వాడకంలో ఎంత సౌలభ్యం, వెసులుబాటు ఉందో, అతిగా వినియోగిస్తే ఆరోగ్యపరంగా అదేస్థాయిలో ఇబ్బందులున్నట్లు వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇయర్‌ఫోన్ల వాడకం వల్ల శబ్ద తరంగాలు నేరుగా చెవిలోకి వెళతాయి. ఫలితంగా సాధారణ వ్యక్తులతో పోలిస్తే వీరికి వినికిడి దోషం ఏర్పడే ప్రమాదం అనేక రెట్లు పెరుగుతుం టుంది. చెవిలో బయటచెవి, మధ్య చెవి, లోపలి చెవి అనే మూడు భాగాలు ఉంటాయని, బయట చెవి వద్ద ఇయర్‌ఫోన్లు పెట్టుకోవడం వల్ల అక్కడ క్రమంగా రాపిడి పెరుగుతుందని,. కొన్నిసార్లు ఇన్‌ఫెక్షన్లకు దారి తీస్తుందని వైద్య నిపుణులు అంటున్నారు. ఇయర్‌ఫోన్ల ద్వారా అదేపనిగా సంగీతం, మాటలు వినడం వల్ల మధ్య చెవి వద్ద క్రమేపీ ఈగ దూరి రొద చేస్తున్నట్టు శబ్దం వస్తుందని, తద్వారా మనస్సు స్థిమితం కోల్పోయి చికాకుగా అనిపిస్తుందని వారంటున్నారు. నేరుగా ధ్వని చెవిలోకి వెళ్లడంతో చెవి క్రమంగా నొప్పిగా అన్పించడం, రానురాను తీవ్ర సమస్యలకు దారితీస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.


మెదడుకు పని పెడదాం

విశాలాంధ్ర జనరల్ డెస్క్ : జీవితం సమస్యలతో కూడిన ఆలోచనల మయం. సమస్యలు ఉంటేనే పరిష్కారమార్గాల అన్వేషణకు మెదడు మరింత చురుగ్గా పనిచేస్తుందని నిపుణుల సూచన. వివేకంతో ఆలోచించే మనిషి సమస్యలకు ఆందోళన చెందడు. అసలు సమస్యకు మూలాలను వెతికేందుకు కృషి చేసి, ఆ సమస్యకు పరిష్కారాన్ని సూచిస్తాడు. ఇది వివేకవంతుల లక్షణం. వీరిలో పిరికితనం, భయం, ద్వేషం, అనేవి కనిపించవు. ఇంట్లో ఉన్నా, ఆఫీసులో ఉన్నా అసలు సమస్య అంటూ తలెత్తితే అసలు దానికి కారణమేమిటా అని ఆలోచిస్తుంటారు. కారణం కనుక్కుంటే సమస్య లకు జవాబు దొరుకుతంది. జీవితంలో ఎదురయే సామాన్యబాధలు, ఆర్థికసమస్యలు, ఇతరులతో సఖ్యత లేకపోవడంవంటివి ఎదుర్కోవాల్సివస్తే వాటికి ఒకటే మందు మందు ఆత్మస్థైర్యం, వివేకం, ఆత్మవిశ్వాసం. ఇతరులను గౌరవించే అలవాటు ఉండాలి. సమస్యలను ఈ కోణంలో చూడడం అలవడితే సమస్యలకు సగం పరిష్కారం లభించినట్లే... ఆలోచన అనేది మనిషి అత్యుత్తమ మానసిక పరిస్థితి. మనం ఉపయోగించే సాధనాలు, సమాజ పురోగతి ఆలోచనల నుంచే వస్తాయి. నాగరికత, సంస్కారం, సాంకేతికత,సైన్స్‌కు ప్రారంభ రూపం ఆలోచనలే. ఆలోచన, అనుసరణను వేరు చేయలేం..ఆచరణకుముందే మెదడులో ఆలోచనలకు ప్రతిరూపంఉంటుంది.

మెదడులో ఏం జరుగుతుందంటే....

బ్రెయిన్ లోని న్యూరాన్లు ఆలోచనకు సంబంధించిన రసాయనాలను విడుదలచేస్తుంది. మెదడులో జరిగే ఈ రసాయనిక చర్య న్యూరాన్ల ద్వారా మెసేజెస్ పంపుతుంది. తద్వారా ఆలోచనలకు మార్గం ఏర్పడుతుంది. బ్రెయిన్‌లోనే న్యూరాన్ల మధ్య గ్లియా సెల్స్ ఆవిర్భవిస్తాయి. న్యూజిలాండ్‌కు చెందిన శాస్త్రవేత్త మార్క్ బ్రెడ్‌వెల్ అభిప్రాయం ప్రకారం, ఆలోచనలకు సంబంధించిన హార్మోన్స్ , రసాయినాలు సమ్మిళితం అవడం ద్వారా ఆలోచనలు కలుగుతాయి.

- మీరు సమస్యను ఎదుర్కొంటునప్పుడు దాన్ని దాటివేయదానికి ప్రయత్నిస్తున్నారా...పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నారా... అనే దానిపై మన విజయం ఆధారపడిఉంటుంది. సమస్యలకు పరిపూర్ణమైన పరిషారాన్ని కనుగొనేందుకు కృషి చేసేవారే అత్యుత్తమ స్థాయికి చేరుకోగలరు. సంక్లిష్టతనుండి బైటపడగలరు.
- సమస్యలపై ప్రతికూలత కనబరచకుండా, కలతచెందకుండా సానుకూల దృక్పథంతో ఆలోచించే ఆశావాహ దృక్పథం మనిషిని క్లిష్ట పరిస్థితుల నుండి రక్షిస్తుంది. అంటే సృజనాత్మకతో కూడిన ఆలోచన విజయానికి నాంది.
- సమస్యలకు కారణాలను మూలాలనుంచి అన్వేషించాలి. అసంతృప్తికి కారణాలను పేపరు మీద రాసుకోవాలి.
- విభిన్న దృక్కోణాలనుంచి ఎదురైన సమస్యలను విమర్శనాత్మకంగా విశ్లేషించాలి.
- ఉత్తమమైన నిర్ణయాన్ని కార్యరూపంలో పెట్టేందుకు ప్రయత్నించి, ప్రాబ్లమ్‌ను సవాలుగా తీసుకుంటే పరిష్కారం సులువవుతుంది... ఏ సవాలునైనా ఆనందంగా స్వీకరించడం ఆరోగ్య లక్షణం. ఒకవేళ తీసుకున్న నిర్ణయం సరైందికాకపోతే మరొకదాన్ని స్వీకరించాలి.
- తీసుకున్న నిర్ణయంలో పురోగతిని బేరీజు వేసుకుంటూ ముందుకు సాగాలి. ఒక సమస్యకు మరో సమస్యకు పోలిక వద్దు అలాగే నిర్ణయాల్లో కూడా పోలిక వద్దు. ప్రతి సమస్యా కొత్త ఛాలెంజే...
- మన నిర్ణయాలకు మనమే ఎట్టి పరిస్థితులు ఎదురైనా బద్ధులై ఉండాలన్నది ప్రాథమిక సూత్రం.
- గడువులేని నిర్ణయం అర్థరహితం అని చెప్పవచ్చు. నిర్ణయం తీసుకునేందుకు కొంత సమయం పట్టినప్పటికీ, స్వల్పకాలిక గడువులను విధించుకోవడం మంచిది.
- డెడ్‌లైన్లతో మన నిర్ణయాలు సరైనవా... కావా... అన్నదికూడా తేలిపోతుంది. ఈ సృజనాత్మకతోనే మరింత ముందుకువెళ్లేందుకు ప్రయత్నిద్దాం.
- సవాళ్లను పరిష్కరించుకుంటూ ముందుకు సాగిపోవడమే జీవితం. వీటితోనే మన లక్ష్యాలు చేరుకోగలం. ప్రతి సమస్య నుంచి ఎంతోకొంత నేర్చుకుంటూ ముందుకు సాగుతాం. విజయపథంలో నడవాలంటే సమస్యలను అధ్యయనం చేసి ఛేదించడమే మార్గం.



ఇంటి పనులతో... కొవ్వు కరుగు

ప్రొద్దున, సాయంత్రం, వీధి వాకిలి చిమ్మేరోజులు పోయి, స్లిమ్ముగా ఉండేందుకు జిమ్ములు, యోగాలు...తద్వారా సూర్యరశ్మి లోపించడంతో 'డి విటమిన్' టాబ్లెట్లు... బోలెడంత నెయ్యి వేసుకుని ముద్దపప్పు, సున్నిఉండలు తినే రోజులు పోయి... ఆవకాయ, గోంగూర వంటి పచ్చళ్లు వంటి ఊరగాయ పచ్చళ్లకు దూరంగా ఉండవలసి వస్తోంది కదా...ఇదంతా స్వయం కృతాపరాధమేననడంలో అతిశయోక్తిలేదు...శరీరానికి తగిన వ్యాయామం ఉండటంతో విటమిన్లు ఒంటబట్టేవి..తిన్న పదార్థాలో కొవ్వుకరిగి స్లిమ్ముగా ఉండే వారు...సరదాగా రోటి పచ్చళ్లు కచ్చా పచ్చాగా నూరడంతో కమ్మటి సువాసనతో పాటు చేతులు, భుజాలు గట్టిపడేవి. ఇంట్లోనే చిన్న చిట్కాలతో కొన్ని వ్యాధులకు దూరంగా ఉండవచ్చు...అదేదో చూద్దాం...

- బట్టలు వాషింగ్‌మెషీన్‌లో వేసినా పనిమనిషితో మడత పెట్టించకుండా మనమే చేసేస్తేపోలా...
- మిక్సీ మీద ఆధారపడకుండా చిన్న రోట్లో అందంగా దంచుతుంటే...బలం మన సొంతం అవదా...
- ఫోన్ మాట్లాడుతూనో, టీవీ చూస్తూనో ఆకుకూరలు వలిచి నిత్యం వినియోగిస్తే విటమిన్లు సొంతం కావా..
- ఎండిపోయిన కొత్తిమీర, కర్వేపాకు, పుదీనా పారేయకుండా పొడిచేసుకుంటే....
- బీరకాయ పొట్టు, నిమ్మ తొక్కల్లాంటివి కడిగిశుభ్రంగా ఎండబెట్టి పొడి చేసుకుంటే కూరల్లో అవసరాన్ని బట్టి వాడుకోవచ్చు
- బెల్లం, ఖర్జూరం లేదా నట్స్ అందుబాటులో పెట్టుకుని ఏది తినాలనిపిస్తే అది నోట్లో వేసుకుంటే...
- వంట చేసే సమయంలో నిలబడి ఉండకుండా జాగింగ్ చేస్తున్నట్లు ఉన్నచోటే నడిస్తే పోలా.. నడుము, తొడల్లోఉన్న కొవ్వుపేరుకోదు.
- దోస, చపాతీలు నాన్‌స్టిక్‌లో కాకుండా ఐరన్‌తవాలో చేస్తే కేన్సర్లు రావుసరికదా...ఐరన్ లోపించదు
- గంటకోసారి గ్లాసుడు నీళ్లు త్రాగండే....
- మధ్యలో మరవకుండా ఒకసారి నిమ్మనీళ్లో, పల్చటి మజ్జిగో ఏదైనా జ్యూసో తీసుకుంటే కావలసినంత 'విటమిన్ సి'
- సాయంత్రం శ్రమ అనుకోకుండా చాటింగ్ కాసేపు ఆపి ధ్యానం చేయండి. ప్రశాంతంగా ఉండొచ్చు..ఇవన్నీ పిల్లలుచూస్తూ అనుసరిస్తారు. వాళ్లకి రోల్ మోడల్‌గా నిలవండి
- చక్కటి సాంబ్రాణి, అగరొత్తులు వెలిగించండి...కర్పూర పరిమళాలతో ఆహ్లాదంగా హాయిగా ఉంటుంది. కస్సు, బుస్సు మనకుండా ఇంట్లోని సభ్యులతో హాయిగా గడపండి. అరోమా థెరపీ టెన్షన్లను దూరం చేస్తుంది. ఇంటి చుట్టు ప్రక్కలవారికి కూడా మన ఇల్లు ఆదర్శంగా ఉంటుందనే మరవకండే....
- అసలైన విషయం చెత్తని రోడ్డు మీద గిరాటు వేయకండే...వాటిలో ఉండే సూక్ష్మక్రిములు అందరి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి.



టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
కోల్ ఇండియా	312.80	1.05
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1,697.25	1.04
బీహెచ్‌ఇఎల్	90.70	0.78
హెచ్‌యుఎల్	1,331.85	0.71
కోటక్ మహీంద్ర	1,103.30	0.68

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఐసీఐసీఐబ్యాంక్	305.25	-2.63
ఎస్‌బీఐ	262.55	-2.31
ఇన్ఫోసిస్	1,160.25	-1.19
అదానీపోర్ట్స్	413.30	-0.67
యాక్సిస్ బ్యాంక్	534.80	-0.66

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ (క్రి.ముగింపు)	రూ.విలువ (ప్ర.ముగింపు)
డాలర్	65.18	65.17
యూరో	79.59	80.35
పౌండ్	89.99	90.02
ఆస్ట్రేలియా డాలర్	50.91	50.55
సింగపూర్ డాలర్	49.27	49.38

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,040	31,058
చెన్నై	29,040	31,058
బెంగళూరు	28,550	30,534
ముంబై	29,770	31,839
విజయవాడ	29,300	31,550
విశాఖపట్నం	29,040	31,680
ప్రొద్దుటూరు	28,980	30,430




- శీతల పానీయాలకు పెరగనున్న డిమాండ్
- ఏసీలు, ఫ్రిజ్‌ల అమ్మకాలకు అంతే ఉండదు

ముందు వేసవితోనూ.. కార్పొరేట్‌కు లాభమే

విశాలాంధ్ర బిజినెస్ డెస్క్ : మార్చి మొదటివారంలో మండుతున్న ఎండలు, పిల్లల పరీక్షలు ఓపక్క మూడురోజులు సెకనుకూడా ఖాళీ లేకుండా ప్రజల సెంటిమెంట్‌పై దెబ్బతీస్తున్న ఏకథాటి టీవీ ప్రసారాలు ఓ పక్క మావోయిస్టులపై భారీ ఎన్‌కౌంటర్‌లతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజానీకాన్ని కార్పొరేట్ కంపెనీలు దోచుకునేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ సంవత్సరం ముందస్తుగా ప్రారంభమైన ఎండల కారణంగా శీతలీకరణ పానీయాలు, సమ్మర్-సెంట్రిక్ ప్యాకేజ్‌డ్ ఆహార పదార్థాల వినిమయం పెరిగితే, దీని ప్రభావం ఆరోగ్యం, వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలుస్తోంది. కార్బొనేటెడ్ బెవరేజ్ అయిన కోకోకోలా, పెప్సికో వంటి పానీయాల అమ్మకాలు ఊపందుకుంటాయని భావిస్తున్నారు. కానీ వీటికి డిమాండ్ తగ్గిందని ఇండియన్ మెటీరియలాజికల్ శాఖ అంచనా వేసింది. సాధారణ ఉష్ణోగ్రత కన్నా ఈ ఏడాది సరాసరిన 1.3 డిగ్రీల సెల్సియస్ పెరగవచ్చునని తెలుస్తోంది. ముఖ్యంగా మార్చి-జూన్ మాసాల్లో ప్యాకేజ్‌డ్ గూడ్స్, పానీయాల వినిమయం సాధారణంగా అధికంగా ఉంటుంది. కార్బనేటెడ్ వాటర్, తీపిదనం, ఆర్టిఫిషియల్ ఫ్లేవర్స్ కలిగిన ఎరేటెడ్ డ్రింక్స్, జ్యూస్‌లు,బెవరేజెస్, గ్లుకోజు, ఐస్‌క్రీంలు, కూలింగ్ ఆయిల్స్, పౌడర్లు, డియోడరెంట్స్, సోపులు, ఎయిర్ కండిషనర్లు, ఇతర చల్లబరచే వస్తువులు తయారీ దార్లకు ఇకపై పండగే...వినియోగదారు ఉత్పత్తుల సంస్థలు మాత్రం ఈ ఏడాది వేసవిలో అత్యధిక లాభాలను గడించనున్నారు. ఏదేమైనా, ఇమామి లిమిటెడ్, హిందుస్తాన్ లీవర్ లిమిటెడ్, డాబర్ ఇండియా లిమిటెడ్, గోద్రెజ్ వంటి కార్పొరేట్ సంస్థలు తమ అడ్వర్‌టైజ్‌మెంట్లతో వినియోగదారులను ఆకర్షించి అధిక లాభాలను గడించనున్నట్లు ఈడెల్‌వెస్ సెక్యూరిటీస్ అనలిస్ట్ అబ్నీష్ రాయ్ తెలిపారు. ముఖ్యంగా ఈ సంవత్సరం దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఎయిర్ కండిషనర్లకు డిమాండ్ అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది.గత కొన్ని ఏళ్లుగా ఈ పరిశ్రమ ఒక సంఖ్యలోనే పెరిగింది. గత ఏడాది కన్నా ఈ సంవత్సరం ఎరేషన్, కూలింగ్‌సిస్టమ్స్‌లో సుమారు 10-15శాతం గణనీయమైన వృద్ధి నమోదు చేస్తుందని కన్సూమర్ ఎలక్ట్రానిక్స్ అండ్ అప్లయన్సెస్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మనీష్ శర్మ వెల్లడించారు. ఎయిర్ కండీషనర్ల తయారీదారులైన వోల్టాస్ లిమిటెడ్, సమ్మర్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని 4-5శాతం ధరలు కూడా పెంచనున్నట్లు తెలుస్తోంది. పానసోనిక్ ఇండియా బిజినెస్ హెడ్ గౌరవ్‌షా మాట్లాడుతూ, ఈ ఏడాది సమ్మర్‌లో ఏసీలకు ఏకంగా 15శాతం డిమాండ్ అధికంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కంపెనీలు భారతీయ శీతోష్ణస్థితికి తగ్గట్లుగా రూపొందిచనున్నట్లు తెలిపారు. కొరియన్ బ్రాండ్లయిన సామ్‌సంగ్, ఎల్‌జీ, డైకిన్, హిటాచీతో పోటు దేశీయ కంపెనీలైన గోద్రెజ్‌లు తయారీలో ముందంజలో ఉన్నాయి. అమెరికన్ కంపెనీలైన కోకోకోలా,పెప్సికోల డిమాండ్ తగ్గడంతో ఈ సంస్థలు జ్యూస్‌లు, బెవరేజెస్‌లో మారనున్నాయి.

బెంగుళూరులో ఉడ్ ఫర్నిచర్ ట్రేడ్ ఫెయిర్...!



గుంటూరు : ఉడ్ వర్కింగ్ ఫర్నిచర్ తయారీ రంగానికి సంబంధించిన ఆసియాలో అతిపెద్ద ట్రేడ్ ఫెయిర్ ఇండియా ఉడ్ వర్కింగ్ 2018 అత్యధిక ఆవిష్కరణలు బీఐఈసీ, బెంగుళూరు వద్ద ఆవిష్కరణలు జరిపినట్లు ఇండియా ఉడ్ 2018 ఎగ్జిబిషన్ గురించి పీడీపీ ట్రేడ్ ఫెయిర్స్ వైస్‌ప్రెసిడెంట్ వి.శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 40 దేశాలకు చెందిన 850 ఎగ్జిబిటర్లు మరియు భారతదేశంలోనే 900 నగరాలతో పాటు 60 దేశాలకు చెందిన 60,000 మంది వాణిజ్య సందర్శకులు రానున్నారని ఆయన తెలిపారు. ఈ ట్రేడ్ ఎగ్జిబిషన్‌లో 1000 ఉడ్ వర్కింగ్ మెషినరీలు, టెక్నాలజీలను ఇండియా 2018 ప్రదర్శించనుంది. ఈ ప్రదర్శన మార్చి 8 నుంచి 12 వరకు జరుగుతుంది. ఇండియా ఉడ్ వర్క్ అంతర్జాతీయంగా 40 దేశాలకు చెందిన ఎగ్జిబిటర్లతోపాటుగా భారతదేశంలోనే 22 రాష్ట్రాలకు చెందిన 850 మంది ఎగ్జిబిటర్లు ఆతిధ్యమిస్తున్నట్లు తెలిపారు. ఇండియా ఉడ్‌లో ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అత్యధిక సంఖ్యలో ఎగ్జిబిటర్లు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ ఫెయిర్‌లో విస్తృతశ్రేణి ఫర్నిచర్, ప్రొడక్షన్ టెక్నాలజీలు, ఉడ్‌వర్కింగ్ మెషినరీలు, టూల్స్, ఫిట్టింగ్స్, యాక్ససరీలు, రా మెటీరియల్స్, ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. ఉడ్ ఫర్నిచర్ పరిశ్రమను తీర్చిదిద్దే అత్యుత్తమ సాంకేతికత ధోరణులను ప్రదర్శించేందుకు అత్యుత్తమ వేదికగా ఇండియా ఉడ్ నిలుస్తుందని ఇండియా ఉడ్ వైస్ ప్రెసిడెంట్ శివకుమార్.వి. తెలిపారు.

బంగారం, వెండికి రెక్కలు

న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరలు దేశీయ మార్కెట్‌లో పుంజుకున్నాయి. 10గ్రాముల బంగారం ధర రూ.140లు పెరిగి రూ.31,500 వద్ద నిలిచింది. పెండిండ్ల సీజన్ కావడంతో స్థానిక ఆభరణాల వర్తకుల నగల కొనుగోళ్లు అధికం కావడం, అంతర్జాతీయంగా బంగారానికి డిమాండ్ పెరగడం ప్రధాన కారణంగాఉంది. గత రెండు సెషన్లలోనూ బంగారం ధర రూ.490లు తగ్గింది. అంతర్జాతీయంగా బంగారం ధర 0.43శాతం పెరిగి ఔన్స్ 1322.60 డాలర్లకు చేరింది. వెండి ధర 0.27శాతం పెరిగి ఔన్స్ 16.51 డాలర్లకు చేరింది. వెండి ధర కూడా రూ.320లు పెరిగి కేజీ వెండి రూ.39,530కు చేరింది.



క్రియేటర్స్‌పై యూట్యూబ్ దృష్టి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: దేశ, విదేశాల్లోని వీక్షకుల దృష్టిని ఆకర్షిస్తూ, శరవేగంగా వృద్ధి చెందుతున్న హైదరాబాద్‌కి చెందిన ఆన్‌లైన్ క్రియేటర్స్‌ను గుర్తించి, గౌరవించినట్లు యూట్యూబ్ ఎంటర్‌టెన్‌మెంట్ హెడ్ సత్యరాఘవన్ తెలిపారు. హైదరాబాద్‌లో కంటెంట్ క్రియేటర్ అనుకూల వాతావరణాన్ని మరింత వృద్ధి చేయడంపై యూట్యూబ్ ప్రణాళికలు రూపొందించిందన్నారు. ద్వితీయ శ్రేణి నగరాల నుంచి మరికొందరు ఆన్‌లైన్‌లోకి వస్తున్నారని తెలిపారు. 2017లో యూట్యూబ్ 220 మిలియన్ నెలవారీ యాక్టివ్ యూజర్లను అధిగమించిందని, 330 మిలియన్ల మందికిపైగా స్మార్ట్‌ఫోన్ యూజర్లు, అందుబాటు ధరలోని డేటా ప్లాన్స్‌తో యూట్యూబ్ ద్వారా వినోదం పొందుతున్నట్లు చెప్పారు. యూట్యూబ్ ఫ్యాన్‌ఫెస్ట్‌లో అభిమానులు యూట్యూబ్ స్టార్స్‌ను కలుసుకున్నారు. అమృతనాయక్, దాయ్ బిస్కెట్, వైవా, మహాతల్లి, తెలుగు వన్, కంట్రీ గైస్, కిరాక్ హైదరాబాదీస్, మై విలేజ్ షో, గర్ల్ ఫార్ములా, షణ్ముఖ జస్వంత్, విజయ తుపురాసి, వరంగల్ డైరీస్, వైరల్లీ, మెల్విన్ లూయిస్ ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చారు.

ఆస్కార్ వేడుకలో సిటీ నగలు



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: సినీ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూసే ఆస్కార్ అవార్డుల వేడుకలో ఈసారి హైదరబాద్ 'నగ'ధగలు విరజిమ్మనున్నాయి. ఈ వేడుకల్లో ప్రదర్శించే ఆభరణాలశ్రేణిలో నగరానికి చెందిన కీర్తిలాల్స్, పీఎంజే జువెలర్స్ వజ్రాభరణాలకు స్థానం దక్కినట్టు ప్రసిద్ధ డైమండ్ బ్రాండ్ ఫరెవర్ మార్క్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్కార్ వేడుకలలో లాస్ ఏంజెల్స్‌లోని ఎలైట్ ఆస్కార్ సూట్ వద్ద వీటిని ప్రదర్శించనున్నారు.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
-137.10 ▼	-34.50 ▼	300 ▲	29,040	-100 ▼	41,700	65.17
34,046.94	10,458.35	29,300	ప్రొద్దుటూరు 28,980	39,600	ప్రొద్దుటూరు 41,129	
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	



లక్ష్య సాధనకు
సరైన ఆర్థిక ప్రణాళిక అవసరం

అనుకున్న లక్ష్యాలు సాధించాలంటే.. సరైన ఆర్థిక ప్రణాళిక అవసరం ఎంతైనా ఉంది. కొన్ని దీర్ఘకాలిక లక్ష్యాలుంటాయి.. మరికొన్నింటికి ఎక్కువ సమయం ఉండదు. ఈ రెండింటి విషయంలో సమన్వయం పాటిస్తూ ఉండేలా వ్యూహం రూపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే చక్కని ఆర్థిక జీవితం సాధ్యమవుతుంది.

29, 27 సంవత్సరాల వయసు గల దంపతులు సాఫ్ట్‌వేర్ రంగంలోనే పనిచేస్తున్నారు. సంపాదన ఇద్దరికీ కలిపి రూ.1,05,000. ఇక వారి ఖర్చుల విషయానికి వస్తే..

- సాధారణ బిల్లుల అంటే.. గ్యాసు, విద్యుత్, ఫోన్, కేబుల్ తదితరాలన్నీ కలిపి నెలకు రూ.5,000 వరకూ అవుతున్నాయి.
- ఇంటి అద్దె, నిత్యావసర వస్తువులు, మొదలైన వాటికి రూ.30వేల వరకూ కేటాయిస్తున్నారు.
- రవాణా ఖర్చుల కింద మరో రూ.6 వేలు ఖర్చవుతున్నాయి.
- విహారాలు, బయట విందులు, వినోదంలాంటి వాటికి దాదాపు రూ.16,000 వెళ్తున్నాయి.
- ఇటీవలే ఒక మనీ బ్యాక్ పాలసీ తీసుకున్నారు. దీనికోసం ఏడాదికి రూ.36వేలు చెల్లిస్తున్నారు. (నెలకు రూ.3వేలు)

అంటే మొత్తం ఖర్చులు రూ.60,000. ఇవి పోను మిగిలేవి రూ.45వేలు.

ఇతర అంశాలకు వస్తే..

- ఏడాది తర్వాత తమ జీవితంలోకి బిడ్డను ఆహ్వానించాలని నిర్ణయించుకున్నారు.
- వారు తమ పదవీ విరమణ తర్వాత జీవితానికి ఏ విధమైన ప్రణాళికా వేసుకోలేదు.
- వారి నెలవారీ ఆదాయంలో 15శాతం వరకూ విందులు, వినోదాలకు కేటాయిస్తున్నారు.
- అత్యవసర నిధి ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది.
- ఇద్దరికీ ఆరోగ్య బీమా పాలసీ వారు పనిచేస్తున్న కార్యాలయాలే అందిస్తున్నాయి.
- ప్రస్తుతం వారున్న ఆర్థిక పరిస్థితిని పరిశీలిస్తే.. 2019లో కారు కొనడం వారికి ఏమంత కష్టం కాదు.
- ఇక రెండో లక్ష్యం విషయానికి వస్తే.. ఇల్లు కొనుగోలు గురించి చూసినప్పుడు.. ఇంకా నాలుగేళ్ల సమయం ఉంది. కాబట్టి, వారు 2022 వరకూ నెలకు రూ.20 వేల చొప్పున మదుపు చేసుకుంటూ వెళ్తే సరిపోతుంది.

బ్యాంకులో ఉన్న నగదు రూ.2,00,000.

లక్ష్యాలేమున్నాయంటే..

- వచ్చే ఏడాది ఆఖరు నాటికి రూ.8 లక్షల విలువైన కారు కొనాలనే ఆలోచన ఉంది. దీనికోసం 90 శాతం వరకూ వాహన రుణం తీసుకోవాలనీ, మిగతా రూ.80 వేల వరకూ చేతి నుంచి చెల్లించాలనీ అనుకుంటున్నారు.
- సొంతింటి కల తీర్చుకునేందుకు 2022ను లక్ష్యంగా విధించుకున్నారు. ప్రస్తుతం రూ.50 లక్షల విలువైన ఇల్లు వారి ఆలోచనల్లో ఉంది. దీనికోసం 80 శాతం వరకూ రుణం తీసుకోవాలని అనుకుంటున్నారు. మిగతా రూ.10లక్షలను ఇప్పటి నుంచీ పొదుపు చేయాలనుకుంటున్నారు.



చేయాల్సింది ఏమిటంటే...

- భర్త తన పేరుమీద ఎండోమెంట్ పాలసీ తీసుకున్నారు. కానీ, దీనివల్ల అతనికి సరైన బీమా రక్షణ లభించడం లేదు. కాబట్టి, తప్పనిసరిగా ఇద్దరి పేరుమీదా కలిపి కనీసం రూ.కోటి మొత్తానికైనా టర్మ్ బీమా పాలసీ తీసుకోవాలి.
- ప్రస్తుతం వారికి నెలకు దాదాపు 60వేల వరకూ ఖర్చవుతోంది. కాబట్టి, కనీసం మూడు నెలల ఖర్చులు రూ.1,80,000 వరకూ అత్యవసర నిధిగా ఉండాలి. దీనికోసం ఇప్పటికే వారి వద్ద ఉన్న రూ.2 లక్షలు సరిపోతాయి. వీలైతే ఈ మొత్తాన్ని ఇంకా పెంచుకునే ప్రయత్నం కూడా చేయవచ్చు
- వారు తమ వినోదం కోసం మొత్తం ఆదాయంలో దాదాపు 15శాతం కేటాయిస్తున్నారు. నిజానికి ఇవి తక్షణం తగ్గించుకోవాల్సిన ఖర్చులు.
- భర్త వయసు 29ఏళ్లు. ఇప్పటికే అతను పదవీ విరమణ ప్రణాళికలు ప్రారంభించాల్సిన అవసరం ఉంది. పదవీ విరమణ తర్వాత నెలకు రూ.50వేలు ఖర్చవుతాయని ఇప్పటి లెక్కల ప్రకారం భావిస్తే.. భర్త వయసు 60కు చేరుకునే సరికి రూ.2,26,901 (ఏటా 5శాతం ద్రవ్యోల్బణం అంచనాతో) కావాలి. వారు 85 ఏళ్ల వరకూ జీవిస్తారని అనుకుంటే.. అతను పదవీ విరమణ చేసే నాటికి కనీసం రూ.4,89,18,945 చేతిలో ఉండాలి. దీనికోసం దంపతులు నెలకు రూ.14,124 చొప్పున 30 ఏళ్లపాటు కేటాయించాలి. ఈ మొత్తాన్ని 12 శాతం రాబడి వచ్చేలా చూసుకుంటూ.. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లకు కేటాయించాల్సి ఉంటుంది.
- 90శాతం రుణం తీసుకొని కారు కొనాలనే ఆలోచనతో ఉన్నారు. దీనికోసం ముందస్తు చెల్లింపు రూ.80వేలు. బ్యాంకులో ఉన్న మొత్తం దీనికి కేటాయించవచ్చు. అయితే, దాన్ని అత్యవసర నిధిగా భావిస్తున్న నేపథ్యంలో దాన్ని ముట్టుకోకపోవడే మంచిది. కారు కొనడంతోనే సరిపోదు. దానికి కొంత అదనపు పెట్టుబడీ అవసరం. కాబట్టి, దీనికోసం రూ.20వేలు పక్కన పెట్టాలి. అంటే, మొత్తంగా రూ.లక్ష వరకూ భర్త చేతి నుంచి ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉండాలి. కారు కొనబోయే ఏడాది ముందు నుంచీ ఈ మొత్తం సమకూర్చుకునేందుకు పెట్టుబడులు ప్రారంభించాలి.
- పిల్లలు వచ్చాక జీవితంలో కొన్ని మార్పులు వస్తాయి. ఆర్థికంగా కూడా ప్రభావం పడుతుంది. వారి ప్రాథమిక, ఉన్నత చదువుల కోసం ముందునుంచే ప్రణాళిక వేసుకోవాలి. సాధారణ ద్రవ్యోల్బణంతో పోలిస్తే.. విద్యా ద్రవ్యోల్బణం చాలా అధికంగా ఉంటుంది. పిల్లల చదువుల గురించి సరైన ప్రణాళిక లేకపోతే.. పదవీ విరమణ ప్రణాళికల విషయంలో రాజీ పడాల్సిన అవసరం ఏర్పడుతుంది.
- కారు, ఇల్లు కొనడం ఒక్కటే కాదు.. భవిష్యత్తులో వాటికి చెల్లించబోయే ఈఎంఐలను కూడా దృష్టిలో పెట్టుకోవాలి. ఒకసారి ఈ రుణాలు తీసుకున్నాక.. మీ ఆదాయంలో నుంచి సింహభాగం వీటికే ఖర్చవుతుంది. ఇలా పోగా మిగిలిన వాటినే మీరు ఖర్చు చేసినా, పెట్టుబడులు పెట్టినా!
- ఉదాహరణకు దంపతులు మరో నాలుగేళ్లలో ఇల్లు కొనాలనుకుంటున్నారు. వారు వార్షిక వడ్డీ రూ.8.3శాతం చొప్పున, 20ఏళ్ల వ్యవధికి రూ.40లక్షల వరకూ రుణం తీసుకుంటే.. నెలకు దాదాపు రూ.34,208 వరకూ ఈఎంఐ చెల్లించాల్సి వస్తుంది. ప్రస్తుతం వారికి నెలకు రూ.45వేలు మిగులుతున్నాయి. అంటే, వారు ఏ ఇబ్బందీ లేకుండా ఇల్లు కొనేందుకు అవకాశం ఉంది. ఇక కారు రుణం తీసుకుంటే.. ఏడేళ్లపాటు రుణ వ్యవధి, 9శాతం వడ్డీ రేటు అనుకుంటే.. దాదాపు రూ.11,584 అవుతుంది. అంటే, ఈ రెండు రుణాలకూ ఈఎంఐ చెల్లించిన తర్వాత వారి వద్ద మిగిలేదేమీ ఉండదు.
- ఈ రెండు రుణాలకూ నెలసరి వాయిదాలు చెల్లించడం ప్రారంభిస్తే... వారు జీవితంలో కొన్ని ముఖ్యమైన ఆర్థిక లక్ష్యాలకు పెట్టుబడులు పెట్టడానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పదవీ విరమణ, పిల్లల చదువులకు పెట్టుబడులు పెట్టడం సాధ్యం కాదు.

కాబట్టి, వారి ఆర్థిక పరిస్థితిని పరిగణనలోనికి తీసుకుంటే.. వారు ఇల్లు కొనాలనే ఆలోచనను వాయిదా వేసుకోవడమే ఉత్తమం అనిపిస్తోంది. (ఆదాయం పెరుగుతుంది కదా అనే అనుమానం రావచ్చు. కానీ, అదే రీతిలో ఖర్చులూ ఉంటాయని మర్చిపోవద్దు) ఇంటి రుణం ఒక దీర్ఘకాలిక రుణానుబంధం. కాబట్టి, తొందరపడి నిర్ణయం తీసుకుంటే ఆర్థికంగా చిక్కులు రావచ్చు.

- కారు కొనేప్పుడు అన్ని విధాలా మీకు ఏది అనువైనదో నిర్ణయించుకోండి. కారు కొనడంతోనే అయిపోదు. దానికి బోలెడు నిర్వహణ ఖర్చులూ ఉంటాయి. దీనివల్ల నెలవారీ బడ్జెట్‌పై ప్రభావం పడుతుంది. ఎంచుకునే కారును బట్టి కూడా ఈ ఖర్చులు ఆధారపడి ఉంటాయి. కాబట్టి, కారు రాకతో వచ్చే కొత్త ఖర్చులనూ లెక్కవేసుకోండి. పాత ఖర్చులను నియంత్రించుకోక తప్పదు.

సొంతిల్లు, కారు చాలామంది కల. వీటిని తీర్చుకోబోయే ముందు ఆర్థిక ప్రణాళికలపై ప్రభావం ఎలా ఉంటుందో తెలుసుకోవాలి. నెలసరి వాయిదాల భారం, ఇంధన, నిర్వహణ ఖర్చులు మన జీవితంలోని ముఖ్యమైన లక్ష్యాల సాధనకు అడ్డు తగలకుండా చూసుకోవాలి.



విశాలాంధ్ర సినిమా

'కణం' రెండో పాట 'జో లాలి జో' విడుదల



నాగశౌర్య, సాయిపల్లవి జంటగా ఎన్.వి.ఆర్. సినిమా సమర్పణలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై విజయ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కణం'. ఈ చిత్రం రెండో పాట 'జో లాలి జో'ను విడుదల చేసారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రానికి నిరవ్‌షా, శ్యామ్ సి.ఎస్, ఎల్.జయశ్రీ, స్టంట్ సిల్వ, ఆంటోని, విజయ్, సత్య, పట్టణం రషీద్, ఎం.ఆర్.రాజకృష్ణన్, కె.మణివర్మ, రామసుబ్బు, సప్న షా, వినయదేవ్, మోడేపల్లి రమణ, కె.భార్గవి, ప్రత్యూష, ఎస్.ఎం.రాజ్‌కుమార్, ఎన్.శివశరవణన్, షియామ్ పనిచేస్తున్న సాంకేతికవర్గం. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్.ప్రేమ్, సమర్పణ: ఎన్.వి.ఆర్. సినిమా, నిర్మాణం: లైకా ప్రొడక్షన్స్, దర్శకత్వం: విజయ్.

గులేబకావళిలో ప్రభుదేవా, హన్సిక



ప్రముఖ నటుడు, దర్శకుడు, నృత్య దర్శకుడు ప్రభుదేవా హీరోగా, హన్సిక హీరోయిన్‌గా, ప్రముఖ నటి రేవతి ఓ పవర్‌ఫుల్ పాత్రలో నటించిన తమిళ చిత్రం గులేబకావళి. కల్యాణ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం కోలీవుడ్‌లో సంక్రాంతికి విడుదలై సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది. కాగా ఇప్పుడు ఈ చిత్రాన్ని అదే పేరుతో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై మల్కాపురం శివకుమార్ తెలుగులోకి అనువదిస్తున్నారు. మార్చి 16న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం విశేషాలను ఆయన తెలియజేస్తూ తమిళంలో ఘనవిజయం సాధించిన ఈ చిత్రం తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందనే విశ్వాసంతో తెలుగులోకి అనువదిస్తున్నాను. గులేబకావళి అనే గ్రామంలో నిక్షిప్తమైన నిధి కోసం జరిగే అన్వేషణ నేపథ్యంలో ఈ కథ కొనసాగుతుంది. పూర్తి వినోదాత్మకంగా రూపొందిన ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ఆసక్తికరంగా వుంటుంది. ఇండియన్ మైఖేల్ జాక్సన్ ప్రభుదేవా నృత్యాలు, నటన ప్రధాన హైలైట్‌గా వుంటుంది అని తెలిపారు. ప్రభుదేవా, హన్సిక, రేవతి, మన్సూర్ అలీఖాన్, మధు, ఆనంద్‌రాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి స్టంట్స్: పీటర్ హెయిన్స్, సంగీతం: వివేక్ మెర్విన్, కెమెరా: ఆర్‌ఎస్ ఆనంద్‌కుమార్, ఆర్ట్: కదీర్, పాటలు: సాహితి, దర్శకత్వం: కల్యాణ్, నిర్మాత: మల్కాపురం శివకుమార్

విజయ్ దేవరకొండ సరసన మెహరీన్



విజయ్ దేవరకొండ ప్రస్తుతం టాక్సీవాల సినిమాలో నటిస్తున్నాడు. రాహుల్ సాంకృత్యాయన్ దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమా ఈ ఏడాది వేసవిలో విడుదల కానుంది. ఈ సినిమా తరువాత పరుసురం బుజ్జి సినిమా రానుంది. తాజా సమాచారం మేరకు విజయ్ నటించబోయే తమిళ్ సినిమా ఈ నెలలో ప్రారంభం కానుందని తెలుస్తోంది. ఆనంద్ శంకర్ ఈ సినిమాకు దర్శకత్వం వహించబోతున్నాడు. ఈ సినిమాలో మెహరీన్ హీరోయిన్‌గా నటించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. విజయ్ పక్కన మెహరీన్ బాగుంటుందని భావించిన దర్శకుడు ఆమెను సంప్రదించినట్లు తెలుస్తోంది. త్వరలో ఈ హీరోయిన్ పేరు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్ట్ తరువాత యస్ రంగినేని నిర్మించబోతున్న సినిమాలో నటిస్తాడు విజయ్.ఈ మూవీ మే నుండి ప్రారంభం కానుంది.

నాగచైతన్య ప్రేయసి



అక్కినేని నాగచైతన్య ఇప్పుడు వరుస సినిమాలతో బిజీ బిజీగా ఉన్నాడు. చందు మొండేటి దర్శకత్వంలో సవ్యసాచి సినిమా చేస్తుండగా.. మారుతి దర్శకత్వంలో శైలజారెడ్డి అల్లుడు సినిమా చేస్తున్నాడు. ఈ రెండు సినిమాల తర్వాత నిన్నుకోరి దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో ఓ లవ్‌స్టోరీ చేయబోతున్నాడట. డీవీవీ దానయ్య ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఈ సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఇందులో సమంత కూడా నటిస్తుండగా.. కోన వెంకట్ కథ, స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ఈ సినిమాకు ప్రేయసి అనే టైటిల్ పరిశీలనలో ఉంది.

వ్యాంకిష్ మీడియా సినిమా ఘనంగా ప్రారంభమైంది

వ్యాంకిష్ మీడియా పతాకంపై, ఆయూష్, వర్తిక హీరో హీరోయిన్లుగా,రవి కుమార్ పొన్నగంటి దర్శకత్వంలో, షేక్ గౌస్ నిర్మిస్తున్న నూతన చిత్రం గుంటూరులో ఘనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎం.ఎల్.ఎ క్లాప్‌నివ్వగా, వై.టి.నాయుడు ఎడిషనల్ ఎస్.పి. గుంటూరు అర్బన్ ఫస్ట్ షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు.

నిర్మాత షేక్ గౌస్ కెమెరా స్విచాన్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్లో చిత్ర నిర్మాత షేక్ గౌస్ మాట్లాడుతూ: నిన్నటి నుంచి నాన్ స్టాప్‌గా మార్చ్ 24 వరకు షూటింగ్ జరిపి సింగిల్ షెడ్యూల్‌లో చిత్రీకరణను పూర్తి చేస్తాము. పాటలను కలకత్తా, వైజాగ్, బ్యాంకాక్‌లో చిత్రీకరించడానికి సన్నాహాలు చేస్తున్నాము. సినిమాను ఏప్రిల్ చివరి వారంలో లేదా మే ఫస్ట్ వీక్‌లో రిలీజ్ చేస్తాము అన్నారు . సంగీత దర్శకుడు: అమ్మవందు, కెమెరా : దుర్గ ప్రసాద్.

మరోసారి తేజ సినిమాకి లక్ష్మి భూపాల్ మాటలు

తేజ దర్శకత్వంలో వెంకటేష్ నటించబోయే సినిమా ఈ నెల 12 న మొదటి షెడ్యూల్ ప్రారంభం కానుంది. శ్రీయ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. తాజా సమాచారం మేరకు హీరోయిన్ ఇషా రెబ్బ ఈ సినిమాలో ముఖ్య పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తోన్న ఈ సినిమాకు లక్ష్మి భూపాల్ మాటలు రాస్తున్నారు. గతంలో లక్ష్మి భూపాల్, తేజ నేనేరాజు నేనేమంత్రి సినిమాకు వర్క్ చేశారు. ఆ సినిమాలోని మాటలు తూటాల్లా పేలాయి. మళ్ళీ వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా రాబోతుండడం విశేషం. దాదాపు కొత్తవాళ్ళు ఈ సినిమాలో నటిస్తున్నారు. ఇటీవల ఆడిషన్స్ చేసి నూతన నటీనటుల్ని ఎంచుకోవడం జరిగింది. తమిళ్ కెమెరామెన్ రామానుజం ఈ సినిమాకు వర్క్ చెయ్యబోతున్నాడు. సురేష్ బాబు, అనిల్ సుంకర సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించబోతుండడం విశేషం.



నిఖిల్ మరో సినిమా ప్రారంభం



కిరాక్ పార్టీ ఇంకా థియేటర్లలోకి రాకముందే అప్పుడే మరో సినిమాను స్టార్ట్ చేశాడు నిఖిల్. విడుదలకు సిద్ధమైన కిరాక్ పార్టీ ఓ రీమేక్ మూవీ. ఇప్పుడు తన నెక్స్ట్ ప్రాజెక్ట్ కూడా ఓ రీమేక్ సినిమానే. తమిళ్‌లో హిట్ అయిన కనితన్ అనే సినిమాను తెలుగులో రీమేక్ చేస్తున్నాడు నిఖిల్. ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఒరిజినల్ వెర్షన్‌ను డైరక్ట్ చేసిన సంతోష్‌నే, ఈ రీమేక్ కోసం కూడా తీసుకున్నారు. హీరోయిన్ ఎవరనే విషయాన్ని ఇంకా ఫిక్స్ చేయలేదు. మొదట క్యాథరీన్‌ను అనుకున్నారు. తర్వాత అర్జున్ రెడ్డి ఫేం షాలినీ రెడ్డి పేరు తెరపైకొచ్చింది. కానీ ఏదీ పక్కా కాలేదు. మూవీ డైనమిక్ ఎల్ఎల్పీ బ్యానర్ పై రాజ్ కుమార్ నిర్మాతగా ఈ సినిమా తెరకెక్కుతోంది. అరవింద్ కృష్ణ ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్. కిరాక్ పార్టీ థియేటర్లలోకి వచ్చిన తర్వాత ఈ కొత్త రీమేక్ సంగతుల్ని అఫీషియల్‌గా బయటపెడతారు

మళ్లీ జంటగా రకుల్, కార్తి

హీరో కార్తి, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా నటించిన ఖాకీ సినిమా సక్సెస్ అవడంతో మళ్లీ ఈ జంట మరో సినిమాకు సైన్ చేసింది. డెబ్యూట్ డైరెక్టర్ రజత్ రవిశంకర్ డైరెక్షన్‌లో ఈ సినిమా తెరకెక్కనుంది. ప్రిన్స్ పిక్చర్స్ ఈ సినిమాను ప్రొడ్యూస్ చేస్తోంది. హ్యారిస్ జైరాజ్ మ్యూజిక్‌ను అందిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు శనివారం జరిగాయి. ఈ సినిమా కార్తి నటిస్తున్న 17వ సినిమా కావడం విశేషం. మార్చి 8 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. రమ్యకృష్ణ, ప్రకాష్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో కార్తి సోదరుడు, స్టార్ హీరో సూర్య, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆ జడ్జీపై కేంద్రం అక్కసు..!



న్యూఢిల్లీ: న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేసి..తన అదుపులోకి తీసుకోవటానికి మోడీ సర్కారు ఏమాత్రం వెనుకాడటం లేదంటే కేవలం ఆరోపణ కాదు. ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకంపై సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం తిప్పికొడుతోంది. తమకు వ్యతిరేకంగా వ్యవహరించే జడ్జీలకు ఉన్నత పదవులు దక్కకుండా మోడీ సర్కారు మోకాలడ్డుతోంది. తమకు తాబేదారులుగా పని చేసే న్యాయమూర్తులనే అందలం ఎక్కించేందుకు చట్టానికి తూట్లు పొడుస్తున్న వైనం ఇటీవల వెలుగు చూసింది. ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కెఎం జోసెఫ్‌ను సుప్రీంకోర్టు జడ్జిగా, పంజాబ్-హర్యానా హైకోర్టు జడ్జి సూర్యకాంత్‌ను హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేయగా.. వీటిని మోడీ సర్కారు పక్కనబెట్టింది. ఈ ఏడాది జనవరి 10న ఈ రెండు నియామకాలను కొలీజియం ప్రతిపాదించగా జడ్జిల నియామకంలో సీనియారిటీ సూత్రాన్ని పాటించలేదంటూ కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేసింది. కొలీజియంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్రా సహా సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, మరో ఇద్దరు న్యాయమూర్తులు సభ్యులుగా ఉన్నారు. 1990వ దశకంలో సుప్రీంకోర్టు ఇచ్చిన రెండు తీర్పులకూ కొలీజియం సిఫారసులు విరుద్ధంగా ఉన్నాయని కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. దేశంలోని 24 హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల సీనియారిటీ ప్రకారం జస్టిస్ జోసెఫ్ 12వ స్థానంలో, హైకోర్టు న్యాయమూర్తుల సీనియారిటీ ప్రకారం 45వ స్థానంలో ఉన్నందున సుప్రీంకోర్టు జడ్జిగా ఎలా సూచిస్తారని కొలీజియాన్ని కేంద్రం ప్రశ్నించింది. అయితే, వారి ఎంపికకు సంబంధించి కొలీజియం పరిగణనలోకి తీసుకున్న ఇతర అంశాలు కూడా ఉన్నాయి. అంతేగాక జస్టిస్ కెఎం జోసెఫ్‌పై కేంద్రం అభ్యంతరానికి వేరే కారణాన్ని పరిశీలకులు ఉటంకిస్తున్నారు. 2016లో ఉత్తరాఖండ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించగా.. జస్టిస్ కెఎం జోసెఫ్ నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం కేంద్ర ప్రభుత్వ చర్యను కొట్టివేసింది. అందుకే జస్టిస్ జోసెఫ్ పట్ల కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యతిరేకించినట్టు పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

యూపీలో దారుణం - చావు బతుకుల్లో చిన్నారి



లక్నో : ఉత్తర ప్రదేశ్ లో దారుణం చోటు చేసుకుంది. సొంత బాబాయే ఓ పసిపాపపై ఘాతుకానికి పాల్పడ్డాడు. ఆ మృగం చేతిలో చిక్కిన చిన్నారి ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. థాకూర్‌గంజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, లక్నో నగర్ నిగమ్ ప్రాంతానికి చెందిన చిన్నారి తండ్రి కూలీ పనులు చేసుకుంటున్నాడు. భార్య, ముగ్గురు పిల్లలతో జీవిస్తున్నాడు. అతని సోదరుడు(20) హోలీ సందర్భంగా ఇంటికి వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి బయట ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారిని ఆ యువకుడు తన వెంట తీసుకెళ్లాడు. ఓ పాడుబడ్డ బంగ్లాలోకి తీసుకెళ్లి చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఘటన తర్వాత పారిపోతున్న యువకుడిని గమనించిన స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పాపను కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ(కేజీఎంయూ)లో చేర్పించి చికిత్స అందజేయిస్తున్నారు. తీవ్ర రక్తస్రావంతో శస్త్ర చికిత్స అవసరమైందని, ప్రస్తుతం చిన్నారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. పోక్సో చట్టం ప్రకారం నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

రాజస్థాన్‌లో దారుణం

రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు దళితులు మృతి

జైపూర్ : రాజస్థాన్ భరత్‌పూర్, అల్వాల్ జిల్లాల్లో చోటుచేసుకున్న రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు దళితులు మృతిచెందారు. భరత్‌పూర్‌లో కాద్మికుదైన జస్వంత్ జాతవ్ (26)ను ముగ్గురు, నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు చావబాదారని పోలీసులు తెలిపారు. దుండగులు శుక్రవారం రాత్రి జస్వంత్ ఇంటికి నిప్పంపెట్టినట్టు తెలిపారు. పాత కక్షలే జస్వంత్ హత్యకు కారణమని కుమ్హర్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ. సీతారాం మీనా వెల్లడించారు. అంతర్గత గాయాల కారణంగా జస్వంత్ మరణించినట్టు పోస్టుమార్టం నివేదికలో తేలిందన్నారు. అల్వాల్ జిల్లాలో హోలీ వేడుకల్లో విషాదం జరిగింది. ఇరు వర్గాలకు చెందిన యువకుల మధ్య తలెత్తిన ఘర్షణ నీరవ్ జాతవ్ అనే 16ఏళ్ల బాలుడి ప్రాణాలు తీసింది. భివాడీ పట్టణంలో హోలీ ఆడే సమయంలో ఈ ఘర్షణ తలెత్తినట్టు పోలీసులు చెప్పారు. నీరవ్ తీవ్రంగా గాయపడినట్టు అదనపు ఎస్పీ పుష్పేంద్ర సొలంకీ తెలిపారు. ఆసుపత్రికి తరలించగా అతను అక్కడే మరణించినట్టు భివాడీ సర్కిల్ ఆఫీసర్ సిద్ధాంత్‌శర్మ వెల్లడించారు. నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు.

కలిసి పనిచేస్తాం...

- ప్రతినబూనిన మోడీ, క్వాంగ్
- భారత్, వియత్నాం ద్వైపాక్షిక చర్చలు
- రక్షణ, వాణిజ్య రంగాల్లో సహకారం బలోపేతం
- వ్యవసాయం, అణుశక్తి, వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు



న్యూఢిల్లీ : వియత్నాం అధ్యక్షుడు ట్రాన్ దయి క్వాంగ్ భారత్‌కు తొలిసారి విచ్చేశారు. ఆయన శనివారం ప్రధాని నరేంద్రమోడీతో భేటీ అయ్యారు. ఇరు దేశాధినేతల మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగాయి.

రెండు దేశాలకు సంబంధించిన కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరిగినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. రక్షణ, వాణిజ్య రంగాల్లో భారత్, వియత్నాం మధ్య సహకారాన్ని పెంపొందించుకోవాలని నేతలిద్దరూ నిర్ణయించారు. అదే విధంగా అణుశక్తి, ఇండో-పసిఫిక్ తదితర అంశాలపై చర్చించి కలిసిపనిచేయాలని సంకల్పించారు. సార్వభౌ మత్వం, అంతర్జాతీయ చట్టాలను గౌరవిస్తూనే అరమరికలు లేకుండా ఇండో-పసిఫిక్ ప్రాంతం సుసంపన్నతకు కలిసి పనిచేస్తామని మోడీ, క్వాంగ్ ప్రతినబూనారు. అదేవిధంగా ఏదైని వివాదం తలెత్తినప్పుడు చర్చల ద్వారా సమస్యను పరిష్కారించేందుకు కృషిచేస్తామని మోడీ స్పష్టంచేశారు. ఈ మేరకు ఆయన వియత్నాం అధ్యక్షుడి సమక్షంలో మీడియాకు ప్రకటన వెలువరించారు. వీరి చర్చల్లో దక్షిణ చైనా సముద్రం అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. ఏషియన్‌తో భారత్ కనెక్టివిటీకి మద్దతిస్తున్నట్టు క్వాంగ్ తెలిపారు. ఈ ప్రాంతంలో నావిగేషన్, ఫ్లైట్‌కు స్వేచ్ఛ ఉండాలన్నారు. అంతర్జాతీయ చట్టాల ఆధారంగా ఈ సమస్యకు పరిష్కారం కావాలని భారత్, అమెరికాతో సహా పలు ప్రపంచ శక్తులు ఒత్తిడి చేస్తుండగా చైనా మాత్రం ఆయా దేశాలతో ద్వైపాక్షిక కార్యాచరణను సమర్థిస్తోంది. చర్చల అనంతరం ఇరు దేశాల నేతలు వ్యవసాయం, అణుశక్తి, వాణిజ్య రంగాల్లో కుదిరిన మూడు ఒప్పందాలపై సంతకాలు చేశారు. అదే సమయంలో చమురు, గ్యాస్, పునరుత్పాదకశక్తి రంగాల్లో సహకారాన్ని మరింత పెంపొందించాలని నిర్ణయించారు. తొలుత, విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ వియత్నాం అధ్యక్షుడితో సమావేశమయ్యారు. వారు అన్ని రంగాల్లో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించడం, మరింత బలోపేతం చేయడంపై చర్చించినట్టు శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ వెల్లడించారు. రాష్ట్రపతి భవన్‌లో క్వాంగ్ కోసం ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు.

నీరవ్ మోడీ, చోక్సీలకు నాన్ బెయిలబుల్ వారెంట్

ముంబై : పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణానికి సంబంధించిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వజ్ర వ్యాపారి నీరవ్ మోడీ, ఆయన మామ చోక్సీలకు ముంబై పీఎంఎల్ఏ కోర్టు శనివారం నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీచేసింది. తన వ్యాపారానికి సంబంధించిన కార్యకలాపాల కారణంగా విదేశాల్లో ఉండాల్సి వస్తోందని, విచారణకు రాలేనని నీరవ్ మోడీ పేర్కొన్న అనంతరం వచ్చే వారం నుంచి జరిగే విచారణకు నీరవ్ తప్పనిసరిగా హాజరుకావాలని సీబీఐ ఆయనకు స్పష్టం చేసింది. తానున్న దేశ హైకమిషన్‌ను సంప్రదించాలని, అవసరమైన ప్రయాణానికి సంబంధించిన ఏర్పాట్లనూ సీబీఐ చేస్తుందని కూడా దర్యాప్తు సంస్థ వెల్లడించింది.

నైట్ షెల్టర్‌లో అగ్నిప్రమాదం-ఒకరి మృతి

న్యూఢిల్లీ : హోలీ పర్వదినాన ఢిల్లీలోని కాశ్మీరీ గేట్ ప్రాంతంలో గూడు లేని నిరుపేదలు ఆశ్రయం పొందుతున్న నైట్ షెల్టర్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్టు పోలీసు అధికారి శనివారం తెలిపారు. యమునా బజార్‌లో ప్రభుత్వేతర సంస్థ నిర్వహిస్తున్న నైట్‌షెల్టర్‌లో 25 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడని తెలిపారు. శుక్రవారం రాత్రి మంటలు ప్రారంభమయ్యేనాటికి ఆ ఆశ్రమంలో 12 మంది ఉన్నారని తెలిపారు. అగ్ని మాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారని తెలిపారు. షార్ట్ సర్క్యూటే అగ్ని ప్రమాదానికి కారణమని భావిస్తున్నామని, దర్యాప్తు సాగుతుం దన్నారు.

తప్పతాగి విధులు నిర్వహించిన ఎస్ఐ అరెస్ట్

పాట్నా : మద్య నిషేధం అమల్లో ఉన్న బీహార్‌లో ఆ నిబంధనలు ఉల్లంఘించి హోలీ రోజున మద్యం సేవించి విధులు నిర్వహించిన ఓ పోలీసు అధికారిని పోలీసులు అరెస్టు చేశారు. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు మదన్ మోహన్ ఝూను అరెస్టు చేసి నిహారా జైలుకు శుక్రవారం తరలించినట్టు పోలీసులు తెలిపారు. ఎస్ఐ మద్యం సేవించి విధులు నిర్వహించినట్టు ఉన్న వీడియో క్లిప్పింగ్స్ సోషల్ మీడియోలో ప్రసారం అయ్యాయి. ఈ వార్త తెలిసిన వెంటనే ఎస్ఐకు సమన్లు జారీ చేసి అరెస్టు చేసినట్టు చెప్పారు. దర్యాప్తు సాగుతుందని తెలిపారు.

మంచు దుప్పట్లో కాశ్మీర్

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని అనేక ప్రాంతాల్లో వరుసగా రెండవరోజైన శనివారం మంచు కురుస్తోందని, అడపాదడపా వర్షం కురుస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఉత్తర కాశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలోని గులాంమర్గ్‌లో ఉదయం మూడు అంగుళాలు మేర మంచు కురిసినట్టు నమోదైందని చెప్పారు. కుప్వారా, జోజిలా, షోపియాన్, గురేజ్, పలు ప్రాంతాల్లో మంచు కురిసిందని చెప్పారు. మైదానాల్లో వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. శ్రీనగర్‌లో 4.2 మి.మీ వర్షపాతం నమోదైందని చెప్పారు.

రెండు పరిశ్రమల్లో అగ్నిప్రమాదం

ముంబై : ముంబైలో శివారుల్లో అంధేరీలోని వస్త్ర, రసాయనాల తయారీ పరిశ్రమల్లో అగ్ని ప్రమాదం సంభవించిందని అధికారులు శనివారం తెలిపారు. అనల్గా గ్రామంలోని ఈ పరిశ్రమల్లో ఉదయం 11.45 గంటలకు ఒక దాని నుంచి మరొక దానికి మంటలు వ్యాపించాయని చెప్పారు. ఈ వార్త అందేనాటికి ప్రాణ నష్టం జరిగినట్టు సమాచారం ఏమీ లేదని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చినట్టు తెలిపారు. దర్యాప్తు సాగుతుందని చెప్పారు.

మహిళ రక్షణకు పోలీసులను ఆదేశించిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ : లాండ్ మాఫియా నుంచి ప్రాణభయం ఉందని ఆశ్రయించిన మహిళకు పోలీసులు రక్షణ కల్పించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. దక్షిణ ఢిల్లీలోని జామియానగర్‌లో తనకు స్థలం ఉందని, దాని కోసం ప్రయత్నిస్తున్న లాండ్ మాఫియాపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులే రాజీకి యత్నాలు చేస్తున్నట్టు ఆమె పిటిషన్‌లో పేర్కొంది. పిటిషన్‌ను స్వీకరించిన కోర్టు ఈ కేసు విచారణను సీనియర్ మహిళా పోలీసు అధికారి విచారణ చేపట్టాలని, ఢిల్లీ మహిళ కమిషన్ (డీసీడబ్ల్యు) కూడా ఆమెకు రక్షణ కల్పించాలని ఆదేశించింది.

కేరళ సీఎం పినరాయికి వైద్య పరీక్షలు

చెన్నై : కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్‌కు వైద్యపరీక్షలు చేస్తున్నామని చెన్నై అపోలో ఆస్పత్రి శనివారం బులిటెన్‌ను విడుదల చేసింది. పరీక్షల నిమిత్తం శుక్రవారం సాయంత్రం చేరారని ఆదివారం ఆయన్ను డిశ్చార్జి చేస్తామని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కేరళలో ఆహార వస్తువులు దొంగిలించాడన్న కారణంగా గిరిజన యువకుడు మధును కొట్టి చంపిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాన్ని ఆయన శుక్రవారం సందర్శించి వారిని ఆదుకుంటానని భరోసా ఇస్తూ, దోషులను కఠినంగా శిక్షిస్తామని స్పష్టం పినరాయి చేశారు.

బృహదీశ్వరాలయంలో విగ్రహాలు మాయం

తిరుచొత్తియూరు: ప్రపంచ ప్రసిద్ధి పొందిన తంజావూరు బృహదీశ్వర ఆలయంలో రాజరాజచోళన్, రాణి లోకమాదేవి కోట్ల విలువ చేసే బంగారం, పంచలోహ విగ్రహాలు అద ృశ్యమైనట్లు తనిఖీల్లో తెలిసింది. రాష్ట్రంలోని పలు ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో విగ్రహాలు మాయం అవుతున్నాయి. వీటిపై ఫిర్యాదు అందడంతో మద్రాసు హైకోర్టు రాష్ట్రంలో విగ్రహాలకు సంబంధించి ఐజీ పొన్‌మాణిక్యవేల్ నేత ృత్వంలో విగ్రహాల చోరీలపై విచారణ చేసేందుకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో విగ్రహాల తనిఖీ కోసం 250కు పైబడిన పోలీసులను నియమించారు. ఈ క్రమంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన బ ృహదీశ్వర ఆలయంలో ఉన్న రాజరాజచోళన్, రాణి లోకమాదేవి బంగారు విగ్రహాలు అదృశ్యమై ఉన్నట్టు తెలిసింది. పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి ఆలయ నిర్వాహకులు జాయింట్ కమిషనర్ మాజీ కార్యదర్శులు సహా నలుగురిని అరెస్టు చేశారు.

ఎన్ఈఆర్ఐఎస్టీ డైరెక్టర్ నియామకం : ప్రకాశ్ జవదేకర్

ఇటానగర్ : ఈశాన్య ప్రాంత సైన్సు, సాంకేతిక (ఎన్ఈఆర్ఐఎస్టీ) విద్యా సంస్థల్లో సోమవారం నాటికి శాశ్వత డైరెక్టర్‌లను నియమిస్తామని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ భరోసా ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం అరుణాచల్ ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి హోన్‌చుంగ్ న్గాదంతో టెలిఫోన్‌లో మాట్లాడుతూ ఆయన ఈ విషయం స్పష్టం చేశారు. శనివారం నుంచి ఎన్ఈఆర్ఎస్టీ విద్యార్థులు డైరెక్టర్‌ను నియమించాలంటూ ఆందోళన నిర్వహిస్తున్నారు. డైరెక్టర్ నియామక పత్రాలను చూసే వరకు నిరసన ఆందోళనను విరమించబోమని విద్యార్థి సంఘం అధ్యక్షుడు బంటూ నతంగ్ స్పష్టం చేశారు. ఎవరిపై నిరసనతో గాని, ఇష్టంతో కాని నిరసనలు చేపట్టడంలేదని, విద్యాసంస్థ టాప్ 10 ర్యాంకు నుంచి 100లోకి దిగజారిపోవడంతో ఈ ఆందోళన నిర్వహిస్తు న్నామన్నారు. రాష్ట్ర గవర్నర్ (విశ్రాంత) బీడీ మిశ్రా కూడా ఈ విషయంపై జవదేకర్‌తో మాట్లాడతామన్నారు. 1984లో ప్రారంభించిన ఈసంస్థ ఇక్కడి సాంకేతిక అవసరాలకు ఉపయోగపడే విధంగా విద్యార్థులను అందిస్తోందన్నారు. ఎన్ఈఆర్ఐఎస్టీ ప్రస్తుతం ఆచార్యుల కొరత ఎదుర్కొంటోందని సిబ్బందికి జీతాలు చెల్లించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రాలకు కాంగ్రెస్ ఇచ్చిన బహుమతి ఈ విద్యాసంస్థని, ఈ పరిస్థితికి కారణం రాష్ట్రం, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి కిరణ్‌రిజిజుయేనని కాంగ్రెస్ మాజీ ఎంపీ తకం సంజయ్ విమర్శించారు.

మాకు అపాయింట్‌మెంట్ ఇవ్వరా...

ప్రధానిపై స్టాలిన్ ఫైర్



చెన్నై : కావేరీ మేనేజ్‌మెంట్ బోర్డు (సీఎస్‌బీ) ఏర్పాటు కోసం తమిళ ప్రతినిధులతో సమావేశానికి ప్రధాని మోడీ నిరాకరించారని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ వెల్లడించారు. దీంతో రాష్ట్ర ప్రజలపై మోడీకి ఏమాత్రం శ్రద్ధాశక్తులు లేవని వెల్లడైందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పళనిస్వామి వెంటనే అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించి ఈ విషయంపై చర్చ చేపట్టాలని ఆయన డిమాండు చేశారు. కావేరీ జలాలపై ఆశాఖకు చెందిన రాష్ట్ర మంత్రితో చర్చించాలని మోడీ సలహా ఇచ్చారన్నారు. దీనిపై తీవ్ర నిరసన తెలిపిన స్టాలిన్ తమిళనాడు ఎంపీలను మూకుమ్మడిగా రాజీనామాలు ప్రస్తావనతో కేంద్రాన్ని ఇరుకున పెట్టాలని ఆయన కోరారు. శనివారం ఉదయం సీఎస్‌బీ ఏర్పాటుపై చర్చించేందుకు సచివాలయంలో పళనిస్వామిని కలిశారు. ఎంపీల రాజీనామాలపై సీఎం చర్చిద్దామన్నారని ఆయన వివరించారు. కావేరీ జలాల రెగ్యులేటరీ కమిటీని 6 వారాల్లోగా ఏర్పాటు చేయాలని, 192 టీఎంసీ నుంచి 177.25 టీఎంసీకి కావేరీ జలాలను తగ్గిస్తూ అత్యున్నత న్యాయస్థానం ఫిబ్రవరి 16న తీర్పు వెలువరించింది.


కోరెగావ్ కుట్రదారుడికి పద్మశ్రీ..!?



ముంబై: దళితులు, ముస్లింలపై పైశాచిక దాడులు జరిపే హిందోన్మా దులకు బీజేపీ సర్కార్లు అవార్డులతో సత్కరించటానికి ఏమాత్రం సిగ్గుపడటం లేదు. కులాలు, మతాల పేరిట అల్లర్లు, అలజడి, కల్లోలం సృష్టించే హిందుత్వ ఉగ్రవాదులను దేశభక్తులుగా.. పద్మశ్రీ, పద్మవిభూషణ్ పదవులతో కీర్తించేందుకు బీజేపీ సర్కార్లు తెగబడుతున్నాయి. తాజాగా భీమా-కొరెగావ్ అల్లర్ల కేసులో నిందితుడు.. సంగిలికి చెందిన హిందూ త్వ నేత మనోహర్ అలియాస్ శంభాజీ భిడే పేరును మహారాష్ట్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' అవార్డుకు సిఫారసు చేసింది. ఈ ఘనకార్యం సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి వచ్చింది. పదిమంది సీనియర్ మంత్రులతో కూడిన హైపవర్ కమిటీ భిడేను 'పద్మశ్రీ' అవార్డు కోసం సిఫారసు చేస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే దీనికి సంబంధించిన పత్రాలు ఇంకా ప్రభుత్వం వద్దకు చేరుకోలేదు. శంభాజీ భిడే(84) అలియాస్ భిడే గురూజీ ఆది నుంచీ వివాదాస్పదుడే. మేవార్ సైన్యానికి నివాళులు అర్పించేందుకు వచ్చిన దళితులపై దాడి చేసిన కేసులో భిడేతోపాటు రైట్ వింగ్‌కు చెందిన మరో నేత మిలింద్ ఎక్బోటేపై కేసు నడుస్తోంది. అంతేకాదు, సంగ్లి జిల్లాలోని మిరాజ్-సంగ్లిలో జరిగిన గణేష్ నిమజ్జనోత్సవంలో మత ఘర్షణలు రేకెత్తించారనే ఆరోపణలతో శంభాజీ భిడేపై మరో కేసు కూడా ఉంది. 2008లో 'జోధా-అక్బర్' సినిమా విడుదలను నిరసిస్తూ చేపట్టిన ఆందోళనలో థియేటర్లను దోచుకున్న కేసు కూడా అతడిపై నమోదైంది. ఇన్ని కేసులు ఉన్న ఓ నిందితుడిని 'పద్మశ్రీ' పౌర పురస్కారానికి మహారాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మోడీ డిగ్రీ వివాదం

- ఆ వివరాలు బహిర్గతం చేయలేం
- ఢిల్లీ హైకోర్టుకు తెలిపిన యూనివర్సిటీ



ఢిల్లీ: ప్రధాని మోడీ డిగ్రీని బహిర్గతం చేయ లేమని ఢిల్లీ హైకోర్టుకు ఢిల్లీ యూనివర్సిటీ తెలిపింది. మోడీ డిగ్రీ వివరాలు తెలపాలని 2016లో సమాచార హక్కు చట్టం ద్వారా నమోదైన పిటిషన్‌కు సమాధానమిస్తూ... తమకున్న పరిమితుల దృష్ట్యా విద్యార్థుల సమాచారాన్ని బహిర్గతం చేయలేమని కోర్టుకు స్పష్టం చేసింది. తమకు విద్యార్థులతో 'విశ్వసనీయ బంధం' ఉందని.. వారి డిగ్రీలకు సంబంధించిన విషయాలను తెలపబోమని చెప్పింది. పిటిషనర్లు స్వార్థ ప్రయోజనాలనాశించి కోరుతున్నారని ఆరోపించింది. సమాచార కార్యకర్తలు అంజలీ భరద్వాజ్, నికిల్ డే, అమృత జోహ్రిలు.. ప్రధాని మోడీ డిగ్రీ వివరాలను తెలపాలని కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ)ను కోరారు. దీంతో వివరాలు అందించాలని ఢిల్లీ యూనివర్సిటీకి సీఐసీ ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల అఫిడవిట్‌లో మోడీ దాఖలు చేసిన వివరాలు (1978వ బ్యాచ్ బీ.ఏ డిగ్రీ) పరిశీలిం చడానికి అనుమతినివ్వాలని యూనివర్సి టీని సీఐసీ కోరింది. అయితే దీనికి యూనివర్సిటీ అంగీకరించలేదు. సీఐసీ ఉత్తర్వులను నిలిపివే యాలని కోర్టులో పిటిషన్ వేసింది. దీంతో కోర్టు దీనిపై నిలుపుదల ఉత్తర్వులు జారీ చేసింది. యూనివర్సిటీయే ఆ వివరాలు బయటపెట్టాలని ఈ యేడాది జనవరిలో తెలిపింది. కోర్టు నిర్ణయంపట్ల సమాచార కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది ప్రజలకు తెలియాల్సిన విషయమని.. ఇలా చేస్తే సమాచార శాఖను నియంత్రించినట్టే అవుతుందని వాపోయారు.

మేఘాలయకు అహ్మద్‌పటేల్, కమల్‌నాథ్

న్యూఢిల్లీ : అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు అహ్మద్ పటేల్, కమల్‌నాథ్ హుటాహుటిన మేఘాలయ రాజధాని షిల్లాంగ్ బయలుదేరి వెళ్లారు. మేఘాలయలో హంగ్ అసెంబ్లీ ఏర్పడటంతో తదుపరి ప్రభుత్వ ఏర్పాటునకు గల అవకాశాలను పరిశీలించడానికి ఆ ఇద్దరు వెళ్లినట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ ఏర్పాటునకు ఇండిపెండెంట్లతో సంప్రదింపులు జరపడానికి వారిద్దరూ ఉదయమే వెళ్లారు. మరోవైపు బీజేపీ సైతం యూడీపీ, ఎన్‌పీపీ మద్దతుతో ప్రభుత్వ ఏర్పాటునకు ప్రయత్నాలు ప్రారంభించింది. కాంగ్రెస్ ఏకైక పెద్దపార్టీగా ఆవిర్భవించింది. గోవా, మణిపూర్‌లో ఏకైక పెద్దపార్టీగా ఆవిర్భవించినప్పటికీ ప్రభుత్వ ఏర్పాటు కోసం కనీసం ప్రయత్నించలేదన్న విమర్శలు వెల్లువెత్తడంతో ఈసారి ఆ పార్టీ జాగ్రత్త పడింది. ముందుగానే ఇద్దరు నేతలను అక్కడికి పంపింది.

గౌరీలంకేశ్ హత్య కేసులో పురోగతి

- హిందూ యువసేన కార్యకర్త అరెస్టు
- ఈ కేసులో ఇదే మొదటి అరెస్టు
- అక్రమ ఆయుధాల కేసులో అరెస్టుతో నిందితుడి గుర్తింపు



బెంగళూరు : ప్రముఖ సామాజిక కార్యకర్త, సీనియర్ జర్నలిస్టు గౌరీలంకేశ్ హత్య కేసులో సిట్ స్వల్ప పురోగతి సాధించింది. సుదీర్ఘకాలం తర్వాత ఈ కేసులో ఒకరిని అరెస్టు చేసింది. నిందితుడు హిందూ యువసేనకు చెందిన కేటీ నవీన్ కుమార్(37)గా దర్యాప్తు అధికారులు వెల్లడించారు. అక్రమంగా బుల్లెట్లు కలిగి ఉన్నందుకుగాను బెంగళూరు పోలీసులు నిందితుడు నవీన్‌ను ఫిబ్రవరి 18న అరెస్టు చేశారు. గౌరీ లంకేశ్ హత్య కేసులో ఇదే మొదటి అరెస్టు. నిందితుడు మాండ్యాలోని మద్దూరు వాసి. అక్రమ ఆయుధాల కేసులో దర్యాప్తు సందర్భంగా నిందితుడు ఈ హత్య కేసు విషయం వెల్లడించాడు. బెంగళూరులో మేజిస్ట్రేట్ కోర్టులో వాంగ్మూలం ఇచ్చాడు. గౌరీ లంకేశ్ హత్య కేసులో నవీన్ అరెస్టుకుగాను వారెంటు ఇవ్వాల్సిందిగా సిట్ ముందు కోరింది. అయితే, ఆ అవసరం లేకుండా ఆ హత్య కేసులో నవీన్‌కు సంబంధం ఉన్నట్టు అతని మిత్రుడు స్వచ్ఛందంగా ప్రకటన చేశారు. హత్య కేసులో తన ప్రమేయంపై నవీన్ ఇచ్చిన వాంగ్మూలాన్ని సిట్ అధికారులు అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందుంచారు. హత్య కేసు కుట్ర, ఇతర అంశాలన్నింటిపై కూలంకషంగా దర్యాప్తు జరపడానికిగాను నిందితుడిని 8 రోజులపాటు పోలీసు కస్టడీకి అప్పగించాలని అసిస్టెంటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిర్మలా రాణి మేజిస్ట్రేట్‌కు విజ్ఞప్తి చేశారు. 'గౌరీ లంకేశ్ హత్య కేసులో ఇప్పటికి ఒక్క నిందితుడినే పట్టుకున్నాం. ఒక్కడి పేరే నమోదు చేశాం. దర్యాప్తు తర్వాత ఇతర నిందితుల వివరాలు బహిర్గతమవుతాయి. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ఈ అనుమానితుడిని కనుగొన్నాం' అని రాణి చెప్పారు. అక్రమ ఆయుధాలతో ఉన్నట్లు ముందుగానే సమాచారం అందడంతో బెంగళూరు పోలీసులు సిటీ బస్టాండ్ వద్ద నిందితుడు నవీన్‌ను అరెస్టు చేసినట్టు ఆమె వివరించారు. తుపాకులు, బుల్లెట్ల గురించి మద్దూరులోని తన మిత్రులతో నవీన్ మాట్లాడటంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆ కేసులో అరెస్టు చేస్తే గౌరీ లంకేశ్ కేసులోనూ తనకు సంబంధం ఉన్నట్టు బయటపడింది. నవీన్ కుమార్ హిందూ యువసేన సభ్యుడు. దీనితోపాటు సనాతన సంస్థాన్ సంస్థతోనూ, హిందూ జన జాగృతి సమితితోనూ నవీన్‌కు సంబంధాలు ఉన్నట్టు రుజువైంది. 2017 సెప్టెంబరు 5న గౌరీలంకేశ్‌ను ఆమె ఇంటివద్దే నిందితులు కాల్చిచంపారు. నవీన్ దగ్గర లభించిన బులెట్లు, గౌరీ లంకేశ్ హత్యకు ఉపయోగించిన బుల్లెట్లు ఒకేరకమైనవని అధికారులు గుర్తించారు.

అయిదుగురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు అరెస్టు

రూ.8లక్షల ఎర్రచందనం స్వాధీనం



విశాలాంధ్ర - పొదలకూరు : ఎర్రచందనాన్ని పోలీసుల కళ్లుగప్పి అత్యంత చాకచక్యంగా సరిహద్దులు దాటించేందుకు సిద్ధమవుతున్న అంతర్రాష్ట్ర స్మగ్లర్లను నెల్లూరుజిల్లా టాస్క్‌ఫోర్సు అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఈమేరకు ఆత్మకూరు డీఎస్పీ రామాంజనేయరెడ్డి పొదలకూరు సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు ఆత్మకూరు డీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్సు సిబ్బంది, పొదలకూరు, దక్కిలి, వరికుంటపాడు ఎస్సైలు సంయుక్తంగా ఏకకాలంలో మూడుచోట్ల దాడులు నిర్వహించి రూ.8లక్షల విలువైన పన్నెండు ఎర్రచందనం దుంగలను, ఒక స్కార్పియో వాహనాన్ని, నాలుగు సెల్‌ఫోన్లను, రూ.1500 నగదును స్వాధీనం చేసుకోవడంతోపాటు అయిదుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టుచేసినట్లు తెలిపారు. వారిలో తమిళనాడు సేలం జిల్లాకు చెందిన అంతర్రాష్ట్ర స్మగ్లర్ సత్యరాజుతోపాటు దక్కిలి మండలానికి చెందిన చలంచర్ల అక్కయ్య, బండి ఏడుకొండలు, వరికుంటపాడు మండలానికి చెందిన గుడి రత్నయ్య, పొదలకూరు మండలానికి చెందిన గిలకా నాగరాజులను అరెస్టుచేసినట్లు తెలిపారు. వీరందరూ వెలిగొండ పరిధిలోని అటవీప్రాంతంలో ఎర్రచందనం చెట్లను నరికి దుంగలుగా చేసి చెన్నైకి తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు వెలిగొండ,పెద్దిరెడ్డిపాడు అటవీప్రాంతంలో అన్వేషిస్తుండగా స్మగ్లర్లు పోలీసులపై రాళ్లు, కర్రలతో దాడికి యత్నించి వారి వాహనంతో గుద్దించబోయినట్లు, త్రుటిలో పోలీసులు తప్పించుకున్నట్లు ఆయన తెలిపారు. పోలీసుల రాకను పసిగట్టిన మరికొందరు స్మగ్లర్లు తప్పించుకున్నట్లు, వారిని పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

పట్టుబడిన స్మగ్లర్లను కోర్టులో హాజరు పరచనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పొదలకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ, పొదలకూరు ఎస్సై జగన్‌సింగ్, దక్కిలి ఎస్సై మరిదినాయుడు, వరికుంటపాడు ఎస్సై ముత్యాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులే దేశ భవిష్యత్తు

విశాలాంధ్ర - తిరుపతి (ఎస్వీయూ) : విద్యార్థులే దేశ భవిష్యత్తు అని ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. అమర్‌నాథ్‌గౌడ్ పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం శ్రీనివాసం ఆడిటోరియంలో ఎస్సీ, ఎస్టీ, బీసీల జాక్ ఆధ్వర్యంలో శనివారం 'బీసీ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఎంపవర్‌మెంట్ త్రూ సోషియో ఎడ్యుకేషన్' అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులన్నారు. విద్యార్థులు కష్టపడి చదవడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవచ్చున్నారు. కళాశాల దశలోనే విద్యార్థులు కష్టపడితే ఉన్నతస్థానాలను చేరుకోవచ్చు అని హైకోర్టు న్యాయమూర్తి అమరనాథ్ గౌడ్ పేర్కొన్నారు. విద్యార్థి దశలో వచ్చే ప్రతి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. బడుగువర్గాల వారి అభ్యున్నతి ద్వారానే సమాజం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఏదైనా సమాజంలో సంఘటితంగా చేస్తేనే సాధ్యమవుతుందన్నారు. తాను సైన్సులో చేరినా దానిని వదిలి మధ్యలో లా కోర్సులో చేరి అంచెలంచెలుగా ఎదిగానని వెల్లడించారు. అవకాశం తలుపు తట్టినప్పుడు మనం సిద్ధంగా ఉండాలన్నారు. ప్రణాళికా బద్ధంగా చదవడం, శ్రద్ధగా పాఠాలను అవగాహన చేసుకోవడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చున్నారు. మరొకరి సహాయం లేకుండానే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అత్యున్నత స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు.. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ వీసీ దామోదరం, ప్రిన్సిపాల్స్ శివరయ్య, డీన్ విజయభాస్కరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి మరింత భరోసా!

- 100 రోజుల పనిదినాలు పెంచేందుకు కొత్త విధానం
- 100 రోజులకు రూ.19,700 వచ్చేలా ఏర్పాట్లు

విశాలాంధ్ర - జామి : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులు పూర్తయిన వారికి ఊరట కల్గించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఉపాధి కూలీలకు మరింత భరోసా కలిగించే ఈ విధానంతో మరిన్ని అదనపు పనిరోజులు కల్పించనుండటంతో ఉపాధి కూలీలు ఆనందం వ్యక్తపరుస్తున్నారు. ఈ ప్రక్రియతో కూలీలకు కొంత ఆర్థిక భరోసా కల్పించినట్లయింది. ఈ ఉపాధి పథకంలో ఇప్పటివరకు 100 రోజుల పనిదినాలు పూర్తయిన వారికి అనంతరం పనులను కల్పించేవారు కాదు. దీంతో ఆ కుటుంబం ఇతర పనులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్పడేది. ఒక కార్డుపై కుటుంబం అంతా పనిచేస్తే అందరి పనిదినాలను లెక్క కట్టేవారు. దీంతో కొద్దిరోజులకే ఆయా కుటుంబాల వంద దినాలు పూర్తయ్యేవి. ఈ నేపథ్యంలో జిల్లాలో పనిదినాల కల్పనలో సిబ్బంది సైతం అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ నూతన విధానాన్ని ప్రభుత్వం అన్ని జిల్లాల్లో అమలయ్యేలా ఆదేశాలు జారీచేసింది. ఉపాధి కూలీకి కనీస వేతనం రూ.197 అమలుకు ఇప్పటికే ఉపాధి అధికారులు, సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. కానీ ఈ వేతనం అందుకోకుండానే వారి పనిదినాలు ముగిసిపోతున్నాయి. కానీ ఇకపై వేతనం రూ.197 వచ్చేవరకు ఒకే పనిదినంగా లెక్కకట్టనున్నారు. ఉదాహరణకు రోజుకు రూ.90 వచ్చే కూలీకి రెండు రోజులను ఒక పనిదినంగా నమోదు చేస్తారు. అంతకన్నా తక్కువగా వేతనం వస్తే అదనంగా రోజులను ఒక దినంగా మారుస్తారు.



100 పనిదినాలకు రూ.19,700 వేతనం

ప్రతి ఉపాధి కూలీకి వంద రోజుల పనిదినాలతో పాటు కనీస వేతనంగా రూ.19,700 చెల్లింపే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళిక తయారుచేసింది. ఈ మేరకు ఆదేశాలను అన్ని మండలాలలో అమలు చేస్తున్నారు. జిల్లాలో 3,51,378 జాబ్ కార్డులు వుండగా వాటి పరిధిలో 5,76,063 మంది ఉపాధి పనులు చేస్తున్నారు. వీరిలో ఇప్పటివరకు 50,508 మందికి 100 రోజుల పనిదినాలు పూర్తయ్యాయి. అయితే వీరికి ప్రభుత్వం అమలు చేసిన కొత్త విధానంతో అదనంగా పనిదినాలు కల్పిస్తారు. ఈ ఏడాది ఇప్పటికే వంద దినాలు పని కల్పించడంతో విజయనగరం జిల్లా గరివిడి మండలం ప్రథమస్థానంలో నిలవగా, చీపురుపల్లి ద్వితీయస్థానంలో నిలిచింది. భోగాపురం మండలం మాత్రం చివరిస్థానంలో వుంది.

సిబ్బందికి ఇబ్బందే..

కొత్త విధానంతో ఉపాధి సిబ్బందికి ఇబ్బంది ఎదురుకానుంది. ఇప్పటికే వంద రోజుల పనులను కల్పించేందుకు కష్టించి పనిచేశారు. అనుకున్న లక్ష్య సాధనకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు వేతనాన్ని బట్టి పనిదినాలను నమోదు చేస్తుండడంతో పనుల కల్పనపై కుస్తీలు పట్టాల్సిందేనని పలువురు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఈ కొత్త ఆదేశాలు వెంటనే అమల్లోకి రావడంతో కొన్ని మండలాలలోని పనిదినాలపై తీవ్ర ప్రభావం కనిపించింది.

మూడున్నర కేజీల బంగారం పట్టివేత

విశాలాంధ్ర - తెనాలి : బెంగుళూరు నుండి కాకినాడ వెళుతున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఎలాంటి ఆధారాలు లేకుండా ఇద్దరు వ్యక్తులు తరలిస్తున్న మూడున్నర కేజీల బంగారు బిస్కెట్లను గుంటూరుజిల్లా తెనాలి రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం రైల్వే ఎస్పీ కె.వి.మోహనరావు విలేఖర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజమండ్రిలోని జ్యూయలరీ షాపుల్లో పనిచేసే ప్రభాకరరావు, అంజిబాబులు చెన్నైలో బంగారు బిస్కెట్‌లను కొనుగోలు చేశారు. వీటికి సంబంధించి ఎటువంటి బిల్లులు, ఆధారాలు లేకుండా శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో తీసుకువెళుతున్న క్రమంలో తమకు లభించిన సమాచారం మేరకు వారిని తెనాలి రైల్వే స్టేషన్‌లో ఎస్ఐ వెంకయ్య తమ సిబ్బందితో తనిఖీ చేసి వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ మోహనరావు తెలిపారు. కాగా ప్రభాకరరావు నుండి ఒక కేజీ బంగారు బిస్కెట్‌లను, అంజిబాబు నుండి రెండున్నర కేజీల బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.1కోటి 10లక్షల వరకు ఉంటుందని ఎస్పీ వివరించారు. అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను, వారి నుండి స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్లను మీడియా ముందు ప్రవేశపెట్టారు.

సిరియా మారణహోమంపై ఐరాస స్పందించాలి



విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : సిరియాలో జరుగుతున్న మారణకాండను ఆపేందుకు ఐక్యరాజ్యసమితి తక్షణం చర్యలు తీసుకోవాలని ముస్లిం ఐక్యవేదిక అంజుమన్ ఇస్లామిక్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కె.జలీల్ డిమాండ్ చేశారు. విజయవాడలోని ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 74శాతం ముస్లింలున్న సిరియాలో జరుగుతున్న హింసాత్మక చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆ దేశంలో లెవన్‌టైన్స్, ఖర్దు, టుర్కుమెన్, సిర్కాసియన్స్, గ్రీకులు, జ్యూలు, ఆర్మేనియన్లు తదితర ఎన్నో తెగల వాళ్లు ఉన్నారని తెలిపారు. సిరియా అధ్యక్షుడు బషర్ ఆల్ అస్సాద్ నేతృత్వంలో ప్రభుత్వ దళాలు అమాయక పౌరుల్ని కవచాలుగా వాడుకుంటూ దాడులకు దిగుతుండటంతో జనం దిక్కుతోచక అల్లాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 1970లో అధికారంలోకి వచ్చిన హాఫిదల్ అల్ అసద్ వారసత్వాన్ని కొనసాగించడంలో గత ఏడాది ముందు అరబ్ ప్రపంచాన్ని కుదిపేసిన తిరుగుబాటు ఉద్యమాలు సిరియా ప్రజలకు కొత్త ప్రేరణ నిచ్చాయన్నారు. ఇప్పటికైనా సిరియాలో జరుగుతున్న మారణకాండపై ఐక్యరాజ్య సమితి త్వరగా జోక్యం చేసుకోవాలని కోరారు. ఢిల్లీలోని సిరియా ఎంబసీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపేందు కు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 9వ తేదీన ప్రార్థనల అనంతరం విజయవాడలోని పంజా సెంటర్‌లో సిరియాపై దాడులకు నిరసనగా ముస్లిం ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఐక్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు అహ్మద్ బాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీ మౌలానా షేక్ ఆరీఫ్, నగర అధ్యక్షులు అబ్దుల్ రహిమాన్, కోశాధికారి ఆరీఫ్ మహమ్మద్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు షాజీ తదితరులు పాల్గొన్నారు.



తాటిశీలలో డయేరియా విజృంభణ

చిన్నారి మృతి, 12 మందికి అస్వస్థత

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం : విజయనగరం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం చెముడుగూడ పంచాయతీ తాటిశీల గ్రామంలో డయేరియా మహమ్మారి విజృంభించింది. ఈ వ్యాధి బారినపడి 10 నెలల చిన్నారి కద్రక నమత శనివారం ఉదయం మృతిచెందగా, మరో 12 మంది అస్వస్థులైనట్లు గ్రామస్తులు తెలిపారు. రెండు రోజు ల నుంచి చిన్నారికి వ్యాధిసోకి వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నట్లు బాలిక తల్లిదండ్రులు తెలిపారు. అస్వస్థ తకు గురైన తన కుమార్తెను గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వైద్యుల సూచనల మేరకు స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. సకాలంలో వైద్యం అంది ఉంటే తమ బిడ్డ తమకు దక్కేదని బాధిత కుటుంబీకులు గుండెలు బాదుకుంటున్నారు. ఇదిలాఉంటే గ్రామంలో గత రెండురోజులుగా 12 మంది అతిసార లక్షణాలతో బాధ పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. వీరిలో చిన్నారులే ఎక్కువగా ఉండడం గమనార్హం. బాధితులలో కొండగొర్రి చరిష్మా (3), కద్రక కల్పన (2), సర్వాన్(3), నిమ్మల సుజీత్ (1 1/2), మీనక హర్షవర్ధన్ (5), అభిమార్ (4), అరిక ఎర్రన్న (60), కద్రక కోటేశ్వరరావు (30), అరిక రమేష్ (25), కద్రక సురేష్ (29), తోయక మగ్గారావు (42) ఉన్నారు.

గజం పండుగ తర్వాత నుండే : తాటిశీల గ్రామంలో మూడు రోజుల కిందట అయిదు రోజుల పాటు గిరిజన సాంప్రదాయ గజం పండుగ నిర్వహించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. పండగ సందర్భంగా వారి ఆచార వ్యవహారాలతో పాటు ఆహారపు అలవాట్ల వల్ల బాక్టీరియా వెలువడిందని పలువురు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. మరికొందరు గ్రామ పరిసరాలు, తాగునీరు, మారుతున్న వాతావరణం, ముదురుతున్న ఎండలు కూడా అతిసార వ్యాధికి కారణం అయిఉండవచ్చని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తపరుస్తున్నారు. తాటిశీలతోపాటు అదే గ్రామానికి చెందిన కిలోమీటరు దూరంలో ఉన్న పిల్లిగూడలో కూడా డయేరియా లక్షణాలున్నట్లు గ్రామస్తులు గుర్తించారు. దీంతో ఇక్కడ కూడా 18 నెలల చిన్నారులు నలుగురు ఈ వ్యాధి బారిన పడ్డారు. వీరిలో బిడ్డిక అమృత, బిడ్డిక కార్తీక్, కొండగొర్రి వరుణ్, చాందిని ఉన్నారు. పై రెండు గ్రామాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్యసిబ్బంది గ్రామంలో పర్యటించి ప్రథమచికిత్స అనంతరం గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ వైద్యశాలకు బాధితులను తరలిస్తున్నారు.

పాలకుల మెడలు వంచైనా హోదా సాధిస్తాం

సామూహిక దీక్షల్లో వామపక్షాల నేతలు



విశాలాంధ్ర - అనంతపురము అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచైనా ఏపీకి ప్రత్యేక హోదా సాధిస్తామని వామపక్షాల నేతల పేర్కొన్నారు. సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, కాంగ్రెస్ ఆధ్వర్యంలో వచ్చే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీల అమలు, బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజి ప్రకటించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సామూహిక దీక్షలు నిర్వహించారు. ఈ దీక్షలకు సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు ఎస్. శ్రీరాములు, నాగేంద్ర కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు డి.జగదీష్, రాంభూపాల్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి కేవీ రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా అయిదు కోట్ల మంది రాష్ట్ర ప్రజల హక్కుగా మారిపోయిందన్నారు. ప్రత్యేక హోదాతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, సంజీవని లాంటిదని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారన్నారు. ఇలాంటి ప్రత్యేక హోదా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. హోదాపై రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రాన్ని నిలదీయడంలో విఫలమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక హోదాపై ప్రజలు ఆందోళనలు చేస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యమాలను నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యేక హోదాకు ముఖ్యమంత్రే ప్రధాన అడ్డంకి మారాడని ఆరోపించారు. ఇప్పటికైనా చంద్రబాబు వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో తమ పార్లమెంట్ సభ్యులతో రాజీనామా చేయించి వైసీపీ నేతల తరహాలో అవిశ్వాస తీర్మానానికి సిద్ధం కావాలన్నారు. లేకపోతే రాష్ట్ర ప్రజలు టీడీపీ ప్రభుత్వాన్ని క్షమించరన్నారు. ప్రత్యేక హోదాపై మరింత ఒత్తిడి పెచ్చేందుకు ఈ నెల 6న ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు.

సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలపై కేంద్ర ప్రభుత్వం మాటల గారడీతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఈ మోసానికి నిరసనగా వామపక్షాల ఆధ్వర్యంలో నెల రోజులుగా అనేక ఆందోళనలు చేపట్టామన్నారు.. రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా దగా చేస్తోందని మండిపడ్డారు. ఈ మోసాలకు నిరసనగా పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీలో వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి కేవీ రమణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సి.జాఫర్, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమయ్య, సీపీఐ నగర సహాయ కార్యదర్శులు కె.అల్లీపీరా, బి.రమణ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు నరసింహులు, కాంగ్రెస్ నగర అధ్యక్షులు దాదాగాంధీ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు సి.నాగరాజు, వీరనారప్ప, మహిళా సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు చిరంజీవమ్మ, అధ్యక్షురాలు బి.వరలక్ష్మి, నగర కార్యదర్శి జయలక్ష్మి, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

విషజ్వరాలతో 8మంది మృతి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఏజెన్సీలో విషజ్వరాలు, వింత వ్యాధితో పలువురు మృత్యువాత పడుతున్నారు. తాజాగా తూర్పుగోదావరిజిల్లా వై.రామవరం మండలం కానివాడ సమీపంలో వింత వ్యాధితో ఆరుగురు మృతిచెందారు. మరికొందరి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. ఊట్లబంద గ్రామంలో ఏగురు, పెదమామిళ్లలో ఇద్దరు, జీడీ మామిడిలో ఒకరు మృత్యువాత పడినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి మొదటి వారం నుండి ఈ ప్రాంతంలో ప్రతి ఇంట్లో దగ్గు, ఆయాసం, మలేరియాతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇప్పటివరకూ 8మంది మృత్యువాత పడ్డారు. కానివాడలో ఫైబర్‌నెట్ సదుపాయం కల్పించాక ఫోన్ సౌకర్యం అందుబాటులోకి రావడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, రంపచోడవరం ఎమ్మెల్యే వంతల రాజేశ్వరిని అక్కడికి పంపించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. శనివారం వంతల రాజేశ్వరి ఈ ప్రాంతంలో పర్యటించి బాధితులను పరామర్శించారు. అయితే ఇప్పటికీ కూడా ప్రతి ఇంట్లో ఒక్కరూ, ఇద్దరు చొప్పున దగ్గు, ఆయాసంతో బాధపడుతున్నట్లు సమాచారం. మృతుల పేర్లు, వివరాలు తెలియాల్సి ఉంది.

చిత్తూరుకు రూ.20వేల కోట్ల పెట్టుబడులు

మంత్రి అమరనాథరెడ్డి



విశాలాంధ్ర - చిత్తూరు : పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం రాష్ట్రంలో ఉందని పరిశ్రమల శాఖామంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక పరిశ్రమల కేంద్రం ప్రాంగణంలో రూ.3కోట్లతో నిర్మించనున్న నూతన పరిశ్రమలశాఖ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లాకు 54 ఎంఓయూలు, రూ.20వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, 70వేల మందికి ఉపాధి కలగనుందని వివరించారు. రానున్న కాలంలో అన్ని వసతులతో పరిశ్రమల శాఖ భవనం పూర్తి చేస్తామన్నారు. తూర్పుగోదావరి, చిత్తూరు, గుంటూరు జిల్లాల్లో పరిశ్రమల శాఖకు చెందిన నూతన భవన నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు. అన్ని రాష్ట్రాల కంటే వేగంగా ఏపీలో పరిశ్రమలస్థాపనకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. ఐటీకి సంబంధించిన విధానాలు సరళీకృతంగా ఉండడంతో పరిశ్రమలకు అనుకూల వాతావరణం ముఖ్యమంత్రి కల్పించారని, అధికారులు పారదర్శకంగా బాధ్యతగా పని చేయాలని సూచించారు. 7 రోజుల్లో పరిశ్రమల స్థాపనకు అనుమతులు ఇవ్వాలని తెలిపారు. నిర్దేశించిన గడువులోపు అనుమతులు ఇవ్వకుంటే అధికారిని బాధ్యులను చేస్తామని పేర్కొన్నారు. పరిశ్రమలకు అన్ని సదుపాయాలు కల్పించడమే ఇండస్ట్రియల్ కారిడార్ లక్ష్యమన్నారు. ఎంఎల్‌సీ రాజసింహులు, జెడ్పీ చైర్మన్ గీర్వాణి, ఎండపల్లి శ్రీనివాసులు, జేసీ గిరీషా, నగర మేయర్ కఠారి హేమలత, శ్రీసిటి నుంచి రమేష్, జీఎం అనిల్ కుమార్, ఏపీఐఐసీజెడ్‌ఎం రాం, ఈఈ గోపీచంద్, వైపీ రాజేశ్వరి, డిక్కీ ప్రెసిడెంట్ డేవిడ్ పాల్గొన్నారు.

విధులు మూరెడు..ఆస్తులు బారెడు

విశాలాంధ్ర - విశాఖపట్నం : రెవెన్యూ, జీవీఎంసీలలో పనిచేస్తున్న అవినీతి అధికారుల గుట్టును అవినీతి నిరోధక శాఖ అధికారులు శనివారం బట్టబయలు చేశారు. గత కొంత కాలంగా వరుస దాడులతో వివిధ ప్రభుత్వ అవినీతి అధికారుల్లో గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తున్న ఏసీబీ అధికారులు శనివారం దాడులతో విశాఖ జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖలలో గుబులు పుట్టించారు. ఈ మేరకు శనివారం ముగ్గురు అవినీతి అధికారుల ఇళ్లపై ఏకకాలంలో దాడులు చేశారు.

అర్బన్ వీఆర్వో వెంకటేశ్వరరావు ఇంటిపై



అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు ఇంటిపై ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఫిర్యాదు మేరకు శనివారం ఏసీబీ అధికారులు దాడులు చేయగా వారికి విస్తుపోయే ఆస్తులు కనిపించాయి. ఈ సోదాల్లో మారుతి షిఫ్ట్-ఏపీ 31-7362 తో పాటు గాజువాక శ్రామికనగర్‌లో 290 గజాల స్థలం, గాజువాకలో రెండంతస్తుల భవనంతో పాటు రూ.4.75 లక్షల విలువచేసే 190 గ్రాముల బంగారం, రూ.4 లక్షల విలువైన వస్తువులు, రూ.3.70 లక్షల నగదు ఉండగా ఇంకా లాకర్ ఓపెన్ చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. వీటితో సహా బ్యాంకు అకౌంట్లు, చెక్‌బుక్‌లు, భూమికి సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈయనకు రెండు ఇళ్లు, కుమారుడి పేరిట బ్యాంకులో రూ.30 లక్షలు, కాపులుప్పాడలో 5 ఎకరాల భూమి వున్నట్లు తేలింది. గ్రామ పరిపాలనాధికారిగా వెంకటేశ్వరరావు 2008లో విధుల్లో చేరారు. అప్పటి నుంచి అర్బన్ తహశీల్దార్ కార్యలయంలోనే పని చేస్తున్నారు. మధ్యలో మూడు నెలల పాటు పరవాడ తహశీల్దార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లినా మరలా పాత విభాగంలోకే తిరిగి వచ్చారు. పదేళ్ల నుంచి అర్బన్ వీఆర్వోగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు ఆదాయానికి మించి ఆస్తులు భారీగా కూడబెట్టారన్న అభియోగాల మేరకు ఏసీబీ దాడులు చేసి అయన్ను అరెస్ట్ చేశారు.

ములగాడ వీఆర్వో సంజీవ్‌కుమార్ ఇంటిపై



అవినీతి నిరోధక శాఖ అధికారులు శనివారం నిర్వహించిన దాడుల్లో ములగాడ వీఆర్వో కాండ్రేగుల సంజీవ్ కుమార్ పట్టుబడ్డారు. శనివారం ఉదయం సీతమ్మధారలోని ఆయన నివాసంలో దాడులు చేసిన అధికారులు పెద్ద మొత్తంలో ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. ఈయనకు అనకాపల్లిలో నాలుగంతస్తుల కలిగిన 2800 ఎస్ఎఫ్‌టి ఇళ్లు, రెండు కార్లు, భార్య రమ్య పేరిట మరో 385 గజాల ఇంటి స్థలం, ఓ అపార్ట్‌మెంట్ ఉందని అధికారులు గుర్తించారు. గాజువాక చిన గంట్యాడవద్ద మరో రెండంతస్తుల భవనంతో పాటు కుమారుడు దినేష్ కుమార్ పేరిట 3 మెడికల్ సెంటర్లు, ఆటోనగర్‌లో దినేష్ సిమెంట్ ఇటుకల పరిశ్రమలు ఉన్నట్టు గుర్తించారు. స్నేహితుల పేరుతో మరి కొన్ని స్థలాలు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ల పేరిట మొత్తం నాలుగు కోట్లకు పైగా ఉన్నట్టు గుర్తించారు. ఇవి కాకుండా రూ.18 లక్షల విలువైన బంగారం, మరో 6 లక్షల విలువైన గృహోపకరణాలు, లక్షా ఇరవై మూడు వేల బాండు లభ్యమైంది. సంజీవ్‌కుమార్‌పై చాలా కాలంగా అవినీతి ఆరోపణలున్నట్టు తెలుస్తోంది. ప్రతి పనికి ఆయన లంచం ఇస్తే తప్ప చేయరని పలువురు ఆరోపణలు గుప్పిస్తున్నారు. శనివారం ఆయన నివాసంతో పాటు, పనిచేస్తున్న కార్యాలయం, బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఈయన బ్యాంకు ఖాతాలో పెద్ద మొత్తంలో నగదు ఉన్నట్టు తెలిసింది. ఏసీబీ అధికారులు ఈయన్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

జీవీఎంసీ చైర్మన్ నాగేశ్వరరావు ఇంటిపై



మహా విశాఖ నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో చైర్మన్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావు ఇంటిపై కూడా శనివారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. నగరంలోని కృష్ణా కాలేజీ దరిన ఆయన నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ దాడుల్లో హెచ్‌బీ కాలనీలోని రెండంతస్తుల 3046 ఎస్ఎఫ్‌టి విస్తీర్ణం కలిగిన భవనంతోపాటు 3 కార్లు, ఒక మోటార్ సైకిల్, గంభీరం వద్ద 320 గజాల రెండు ఇళ్ల స్థలాలతో పాటు హెచ్‌బీ కాలనీలో మరో 1080 ఎస్ఎఫ్‌టీ భవనంతో పాటు రూ.11.10 లక్షల విలువైన 5555 గ్రాములు బంగారం, పలభై వేల వెండి, రూ.3 లక్షల వస్తువులు, 41 లక్షల బ్యాంకు బాలెన్స్, రూ.5 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు లక్షా ఇరవై ఒక వెయ్యి నగదు మొత్తం కోటిన్నరకు పైగా ఆస్తి ఉన్నట్టు అధికారులు గుర్తించారు. నాగేశ్వరరావుతోపాటు ఇంక వేరే అధికారులకు ఇందులో భాగస్వామ్యం ఉందా అనే కోణంలో ఏసీబీ అధికారులు దృష్టిసారించారు. వివిధ ప్రాంతాలలో భవన నిర్మాణాలు, అక్రమ కట్టడాలు జరుగుతున్న సమయంలో నాగేశ్వరరావు తన చేతి వాటం ప్రదర్శించే వారని ఆరోపణలు ఉన్న నేపథ్యంలో అతని ఇంటిపై సోదాలు నిర్వహించిన అధికారులు మరిన్ని వివరాలు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

గత కొన్ని రోజులుగా దాడులు నిర్వహిస్తూ వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న అవినీతి అధికారులకు గుబులు రేపుతున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు శనివారం నాటి ఘటనతో అవినీతి అధికారులకు మరింత చెమటలు పట్టించారు. కీలక శాఖలైన రెవెన్యూ, జీవీఎంసీలలోని చిరు ఉద్యోగులపై సైతం దృష్టి సారించడంతో చాలా మంది చిన్న స్థాయిలలో పనిచేస్తున్న అవినీతిపరులకు దడ మొదలయినట్లయింది.

ఇలా చిన్న స్థాయిలలో పనిచేస్తున్న చిరు ఉద్యోగుల అవినీతిపై చాలా కాలంగా ఆరోపణలు, ఫిర్యాదులున్నాయి. చేసేది చిరు ఉద్యోగమైనా పెద్దమొత్తంలో ఇలాంటి వారు ఆస్తులు కూడబెడుతున్నారన్న ఫిర్యాదులు సైతం అందుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం దాడులు నిర్వహించిన ఏసీబీ అధికారులు ఊహించిన దానికన్నా ఎక్కువగానే అక్రమాస్తులు వీరు కూడబెట్టారన్న విషయాలు తెలుసుకుని ఆశ్చర్యానికి గురయ్యారు. ములగాడ వీఆర్వో సంజీవకుమార్, అర్బన్ వీఆర్వో వెంకటేశ్వరరావు, జీవీఎంసీ చైర్మన్ నాగేశ్వరరావులపై దృష్టి సారించిన అధికారులు ఏసీబీ డీఎస్పీ కింజరాపు రామకృష్ణ ప్రసాద్ నేతృత్వంలో అధికారులు బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో దాడులు చేశారు. ఈ దాడుల వ్యవహారం విశాఖలోని పలు ప్రభుత్వ శాఖలతో చర్చనీయాంశమైంది.

కార్మికులు కన్నెర్ర చేస్తే పతనం తప్పదు

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు చలసాని వెంకట రామారావు హెచ్చరిక



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన కోర్కెల పరిష్కారంలో ప్రభుత్వం వివక్ష చూపుతోందని, వారు కన్నెర్ర చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవల్సి వస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు చలసాని వెంకట రామారావు హెచ్చరించారు. స్థానిక ఎన్జీఓ అసోసియేషన్ హాలులో వివిధ కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చలసాని మాట్లాడుతూ గత పక్షం రోజులుగా విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక ఆందోళనా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.కనీసం వారి సమస్యలు వినడానికి కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధంగా లేకపోవడం కార్మిక సంక్షేమం పట్ల ఆయన చిత్తశుద్ధి వెల్లడవుతోందన్నారు. పైగా కార్మిక ఉద్యమాలను ఉక్కుపాదంతో అణచివేయాలని ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఆందోళనకు ఏఐటీయూసీ పూర్తి అండగా వుంటుందని ప్రకటించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎంఏ గఫూర్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ అటు యాజమాన్యాలు కాని, ఇటు ప్రభుత్వాలు కాని దాని అమలుకు చర్యలు తీసుకోకపోవడం దారుణ మన్నారు. పైగా పనిలోకి వెళ్లకపోతే కొత్త రిక్రూట్‌మెంట్ చేపడతామని సమ్మె చేస్తున్న కార్మికులపై మంత్రులు, ఎమ్మెల్యేలు బెదిరింపులు దిగుతున్నారన్నారు. ఈవిధంగా కార్మిక ఉద్యమాలను అణచివేయాలనుకోవడం అవివేకమేనని, దీనివల్ల ఉద్యమం మరింత ఉధృతమువుతుందని హెచ్చరించారు. ఈనెల 5న అన్ని కేంద్ర కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొనాలని, 7వ తేదీ నిర్వహించే చలో విద్యుత్ సౌధ కార్యక్రమంలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఈసమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీ యూసీ నాయకులు వెంకట సుబ్బయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు పోలారి తదితరులు కార్మికుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను తీవ్రంగా విమర్శించారు. విద్యుత్ కార్మికుల సమ్మె విజయవంతానికి సహకరిస్తామని ప్రకటించారు.

ఆలస్యంగా ఇంటర్ పరీక్షలు

- ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు
- నిడమానూరు సెంటర్‌లో రోజూ ఇదే తంతు

విశాలాంధ్ర, విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలం నిడమానూరు గ్రామంలో జరుగుతున్న ఇంటర్ పరీక్షల్లో 15 నుంచి 20 నిమిషాలు ఆలస్యంగా ఇస్తూ, నిర్ణీత పరీక్ష సమయానికి జవాబు పత్రాలు తీసుకొంటున్నారని పరీక్షాకేంద్రం ముందు విద్యార్థుల తలిదండ్రులు నిరసన నినాదాలు చేశారు. నిడమానూరు గ్రామంలోని శ్రీచైతన్య రామన్‌భవన్‌లోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రం 05094లో గత మూడు రోజులుగా ఇంటర్మీడియట్ పరీక్షలు యిదే విధంగా జరుగుతున్నాయని ఆలస్యంగా ప్రశ్న పత్రం పంపిణీచేస్తే ఆ ఆలస్యాన్ని ఉదారంగా తీసుకొంటారని అయితే ఆ పద్ధతి పాటించటం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈప్రక్రియతో ఎ1 గ్రేడ్ విద్యార్థికి ఎ గ్రేడ్, ఎ గ్రేడ్ విద్యార్థికి బి గ్రేడ్ రావటంతో పాటు విద్యార్థిపై ఒత్తిడి పెరిగి డిప్రెషన్‌కు గురి అవుతున్నారని ఆక్రోశం వ్యక్తం చేశారు. పరీక్షా పత్రం ఆలస్యంగా పంపిణీ చేయటం నివారించాలని లేదా ఆ ఆలస్య సమయం పొడిగించేందుకు తగు చర్యలు చేపట్టాలని విద్యార్థులు డిమాండు చేస్తున్నారు. గత మూడు రోజులుగా ఈ పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు జరిగిన నష్టం పూరించేందుకు మార్కులు కలిపేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వంతెనలు... వాగ్దానాల్లోనే ... పడవలపైనే ప్రమాదకర ప్రయాణం



విశాలాంధ్ర - అమరావతి : కృష్ణానదిపై వంతెనల నిర్మాణం ఎన్నికల వాగ్దానంగా తయారైంది.దీంతో పడవలపై ప్రయాణం చేస్తున్న తీర గ్రామాల ప్రజల ప్రాణాలకు భద్రత లేకుండా పోయింది. సిమెంట్ లోడ్ లారీలు పంటు, పడవల ద్వారానే నదిని దాటుతున్నాయి. విజయవాడ నుంచి జగ్గయ్యపేట వరకు ఒక్క వంతెన కూడా లేకపోవడంతో జగ్గయ్యపేట, నందిగామ, కంచిక చర్ల, ఇబ్రహీంపట్నం ప్రాంతాల వారు గుంటూరు జిల్లా అచ్చంపేట, అమరావతి, క్రోసూరు, సత్తెనపల్లి తదితర మండలాలకు వెళ్లేందుకు విజయవాడ మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాలి. ఇందుకు అధిక వ్యయప్రయాసలకు గురి కావల్సివస్తుండటంతో ప్రయాణికులు, స్థానికులు ఎక్కడికక్కడ నదిని దాటుతున్నారు. ఈ పడవల్లో రక్షిత పరికరాలు, లైఫ్ జాకెట్లు ఉండవు. అనుభవం కల్గిన గజ ఈతగాళ్లు ఉండరు. నిబంధనలకు విరుద్ధంగా రాత్రిళ్లు కూడా నడుపుతుంటారు. పడవలపై ప్రయాణం సురక్షితం కానప్పటికీ, గత్యంతరం లేని స్థితిలో ఆశ్రయించక తప్పటం లేదు. ముక్త్యాల, మాదిపాడు, రామన్నపేట, పుట్లగూడెం మధ్య వంతెనలు నిర్మించాలని ఎప్పటి నుంచో ప్రతిపాదనలు ఉన్నాయి. ఇక్కడ నది వెడల్పు తక్కువ, లోతు ఎక్కువ దీంతో వంతెన నిర్మాణం కష్టం కావటంతో ప్రభుత్వం పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. చందర్లపాడు మండలం పొక్కునూరు బొల్లాయిపాడు మధ్య, కంచికచర్ల మండలం చెవిటికల్లు, గుంటూరు జిల్లా అమరావతి మధ్య నదిపై రిజర్వాయర్ కమ్ వంతెన నిర్మించాలన్న ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. ఇక్కడ నది మూడు కిలోమీటర్లకు పైగా వెడల్పు ఉంటుంది. అమరావతి వైపు నీటి ప్రవాహం ఉండగా, చెవిటికల్లు వైపు అంతా ఇసుక ఉంటుంది. ఇక్కడి నుంచి ట్రాక్టర్లపై వెళ్లి, లాంచీ ద్వారా నది దాటి అమరావతి వెళుతుంటారు. సీఆర్‌డీఏ అవుటర్ రింగ్ రోడ్డులో భాగంగా చెవిటికల్లు ఎగువభాగంలో మున్నలూరు సమీపంలో నదిపై వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది...?

బల్లకట్టు, పడవలకు వేలం నిర్వహించే అధికారులు నిబంధనలు గురించి పట్టించుకోవడంలేదనే విమర్శలు న్నాయి. పడవలలో, బల్లకట్లలో భద్రతాపరమైన చర్యలు నామమాత్రమే. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించటంతో పాటు రక్షణపరంగా తీవ్రమైన నిర్లక్ష్యాన్ని నిర్వాహకులు చూపుతున్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే బల్లకట్లను నిర్వహించాల్సి ఉండగా రాత్రి 10 గంటల వరకు యదేచ్ఛగా నడుపుతున్నారు. బల్లకట్టును నడిపే డ్రైవర్‌కు సరైన శిక్షణ ఉండదు. ఎవరు తక్కువ జీతానికి పనిచేస్తే వారినే బల్లకట్టు చోదకులుగా యజమానులు నియమించుకుంటారు. నది మధ్యలో బల్లకట్టు నిలిచిన సంఘటనలు కోకొల్లలు. బల్లకట్టు నిర్వాహకులు ప్రభుత్వం ప్రకటించిన ధరలను పట్టించుకోకుండా తమ ఇష్టం వచ్చినట్లు చార్జీలు వసూలు చేస్తున్నా అడ్డుచెప్పే వారే లేరని ప్రయాణీకులు వాపోతున్నారు.



ఏపీ భవన్‌లో ప్రత్యేక హోదాపై ధర్నా

పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో- న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండు చేస్తూ ఏపీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆందోళన జరిగింది. ఏపీ భవన్‌లో జరిగిన ఈ ఆందోళనలో ప్రభుత్వ ఉద్యోగులు, నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ, ఏపీ నిరుద్యోగ పోరాట సమితి నాయకులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరశిస్తూ ఉద్యమకారులు నినాదాలు చేశారు. జేఏసీ నాయకులు అప్పికట్ల శ్రీహరినాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండు చేశారు. ఏపీ పునర్విభజన బిల్లులో పేర్కొన్న విధంగా 10 సంవత్సరాల పాటు రాష్ట్రానికి హోదా ఇవ్వాలన్నారు. విశాఖ రైల్వే జోన్, ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థలు నెలకొల్పాలని, రాజధాని నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, పోలవరం ప్రాజెక్టును నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రత్యేక హోదా ద్వారానే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని, కేంద్రం స్పందించే వరకు కూడా తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ ధర్నాలో వివిధ జెఏసీ సంఘాల నేతలు కోటి రెడ్డి, అయ్యసామి, గోడవర్తి కోటేశ్వరరావు, గంగాధర్, వివి వరప్రసాద్, సీహెచ్ విజయకుమార్‌లు పాల్గొన్నారు.

ఉత్తమ శిక్షణా కేంద్రాలుగా ఏపీ స్టడీ సర్కిల్స్

ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి నక్కా ఆనందబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : అంబేద్కర్ స్టడీ సర్కిల్స్‌ను అత్యుత్తమ శిక్షణా కేంద్రాలుగా తీర్చిదిద్దడం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు చెప్పారు. శనివారం విజయవాడ ఆరండల్‌పేటలోని డా.బి.ఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణనందించేందుకు అంబేద్కర్ స్టడీ సర్కిల్స్ పనిచేస్తున్నాయన్నారు. గత ఏడాది గ్రూప్-2కు నిర్వహించిన పరీక్షల్లో విజయవాడకు చెందిన స్టడీ సర్కిల్ ద్వారా నలుగురు అభ్యర్థులు డిప్యూటీ తహశిల్దార్లుగా ఎంపిక కావడమే ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రైవేట్ సంస్థలకు ధీటుగా నగరంలోని శిక్షణా కేంద్రం తరగతుల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులకు మరింతగా స్టడీ మెటీరియల్‌లను అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి తెలిపారు. శిక్షణ ఇచ్చే బోధనా సిబ్బంది సబ్జెక్ట్‌ల వారీగా టైమ్‌టేబుల్‌ను రూపొందించుకొని బోధన అందించాల్సి ఉందన్నారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా వసతి సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. గత 12 సంవత్సరాలుగా అంబేద్కర్ స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్-1 నుంచి కానిస్టేబుల్ వరకు, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ వంటి ఎన్నో పోటీ పరీక్షలకు శిక్షణ పొంది ఇప్పటివరకు సుమారు 160 మందికి పైగా అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారని వివరించారు. ప్రస్తుతం 100 మంది అభ్యర్థులకు మాత్రమే అందిస్తున్న శిక్షణను 200 మందికి పెంచాల్సిన అవశ్యకత ఉందన్నారు. కృష్ణాజిల్లా విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి శివారు నామినగర్ గ్రామానికి చెందిన మొండ్రు భద్రయ్యతో మంత్రి ఈసందర్భంగా ఫోన్‌లో మాట్లాడి డిప్యూటీ తహశిల్దార్‌గా గ్రూప్-2 పోస్టుకు ఎంపికైనందుకు అభినందనలు తెలిపారు. ఆకస్మిక తనిఖీలో స్టడీ సర్కిల్ కోర్సు కోఆర్డినేటర్ జి.భాస్కర్, పర్యవేక్షకులు వి.ఆంజనేయులు పాల్గొన్నారు.

త్రిపురలో వామపక్షాలకు 45 శాతం ఓట్లు

- అగర్తలాలో ఆర్ఎస్ఎస్, బీజేపీ గూండాల విధ్వంసం
- వామపక్ష కార్యకర్తలపై దాడులు

కోల్‌కతా : త్రిపుర ఎన్నికల ఫలితాల్లో సీపీఎం అన్ని పార్టీల కంటే అత్యధికంగా దాదాపు 45 శాతం ఓట్లు సాధించినప్పటికీ, ఆశ్చర్యకరమైన రీతిలో సంభవించిన పరిణామాల నేపథ్యంలో వామపక్ష సంఘటన తగినన్ని స్థానాలు సాధించలేకపోయింది. బీజేపీ తన వేర్పాటువాద భాగస్వామి ఐపీఎఫ్‌టితో కలిసి 41 సీట్లను గెలుచుకోగలిగింది. సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు, ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ తన ప్రత్యర్థి కన్నా 3,300 ఓట్ల ఆధిక్యతతో ఉన్నా బీజేపీ అడ్డంకులు సృష్టించడంతో అక్కడ ఫలితాన్ని ప్రకటించడంలో ఆలస్యం జరిగింది.

కాగా, త్రిపురలో ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుండి బీజేపీ, ఆర్ఎస్ఎస్ గూండాలు రెచ్చిపోయి అగర్తలాలో విధ్వంసాన్ని సృష్టించారు. పలు పట్టణ ప్రాంతాల్లో వామపక్ష కార్యకర్తలపై దాడులకు దిగారు. రాత్రికి ఇళ్ళలో ఉంటే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొంటారని వారిని బెదిరించారు. ఈ మేరకు ధన్‌పూర్ (ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ నియోజకవర్గం), ఖవాయి, అగర్తలా, ప్రతాప్‌నగర్, ఇంకా అనేక పట్టణ ప్రాంతాలలో ఇదే వాతావరణం నెలకొంది.





ప్రత్యేక హోదాపై

పోరాటం క్లైమాక్స్‌కు చేరింది

- రేపు ఢిల్లీలో ధర్నా, పార్లమెంటులో పోరాటం
- మార్చి 21న ఎన్డీయే ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం
- ఎంపీలకు జగన్మోహన్‌రెడ్డి దిశానిర్దేశం

విశాలాంధ్ర - ఒంగోలు : ప్రత్యేక హోదా పోరాటం చివరి దశకు చేరుకుందని వైసీపీ అధినేత వైఎస్ జగన్ వెల్లడించారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా జిల్లాలోని దర్శి నియోజకవర్గంలోని తాళ్లూరు మండలంలోని శివరాంపురంలో నిర్వహించిన పార్టీ నాయకులతో, కార్యకర్తలతో, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యనాయకులు, సమన్వయకర్తలకు జగన్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారని, ఆయన మంత్రులు పదవులు వదులుకోకపోవడమే దీనికి నిదర్శనమని విమర్శించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేదాకా అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాబోమని జగన్ పేర్కొన్నారు. ఇప్పటికీ చంద్రబాబు తమ ఎమ్మెల్యేలను ప్రలోభ పెడుతున్నారని, అయినా ఎమ్మెల్యేలు లొంగడంలేదని, వారిపట్ల నాకు మరింతగా గౌరవం పెరిగిందన్నారు. మార్చి 5నుంచి పార్లమెంటు బడ్జెట్ మలివిడత సమావేశాలు ప్రారంభమవుతాయని, తమ పార్టీకి చెందిన ఐదుగురు ఎంపీలు పోరాటం చేస్తారన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వకపోతే మార్చి 21న కేంద్రంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని వెల్లడించారు. టీడీపీ 20 మంది ఎంపీలు అవిశ్వాసానికి మద్దతు ఇచ్చేలా చూడాల్సిన బాధ్యతపవన్‌పై ఉందన్నారు. ఎంపీ వైవీ సుబ్బారెడ్డి 184 నిబంధన కింద ప్రత్యేక హోదాపై లోక్‌సభలో చర్చకు యత్నిస్తున్నారని, అవిశ్వాస తీర్మానం సందర్భంగా కూడా గళాన్ని గట్టిగా వినిపిస్తామని వైఎస్ చెప్పారు. ఏప్రిల్ 6న స్పీకర్ ఫార్మాట్లో ఉన్న ఐదుగురు ఎంపీలు లోక్‌సభకు రాజీనా చేస్తారని జగన్ స్పష్టంచేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేదాకా అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాబోమన్నారు. బడ్జెట్‌సమావేశాల సందర్భంగా ప్రతిపక్షం గైర్హాజరు కావడంతో దేశ వ్యాప్తంగా చర్చకు దారితీస్తుందని, ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యం పరిహాసం అవుతున్న తీరు, రాజ్యాంగ ఉల్లంఘనలపై మరోసారి దేశ వ్యాప్తంగా గట్టి చర్చ జరుగుతుందని జగన్ వివరించారు. త్వరలో జరగనున్న రాజ్య సభ ఎన్నికల సందర్భంగా ఫలితాన్ని తారుమారు చేయడానికి ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు భారీగా ఆఫర్లు ఇస్తున్నారని, ఇంతకన్నా సిగ్గుచేటు ఏముంటుందని చంద్రబాబుపై జగన్ ధ్వజమెత్తారు.

మళ్లీ కాషాయపార్టీ కుట్రలు



అగర్తలా/దిమాపూర్/కోహిమా : ఈశాన్య భారతంలో త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ రాష్ట్ర శాసనసభల ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడ్డాయి. ఈ మూడు రాష్ట్రాల్లో బీజేపీకి కొంత మెరుగైన ఫలితాలు వచ్చాయి. ఈ మూడు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వం ఏర్పాటుకు మెజార్టీ మార్కు 31 స్థానాలుగా ఉంది.

త్రిపుర సీఎం రేసులో బిపల్ కుమార్ దేబ్..?

త్రిపురలో భారతీయ జనతా పార్టీ(బీజేపీ), దాని మిత్రపక్షం దేశీయ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ)లు ఘన విజయం సాధించాయి. 25 ఏళ్లుగా రాష్ట్రంలో అధికారంలో కొనసాగిన సీపీఎం నేతృత్వంలోని వామపక్ష ఫ్రంట్ చివరి వరకు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ బీజేపీనే అధికారం చేజిక్కించుకుంది. ఇక్కడ బీజేపీ మూడింట రెండింతల మెజార్టీని దక్కించుకుంది. త్రిపుర రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బిపల్ కుమార్ దేబ్ తదుపరి ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీజేపీ, దాని మిత్రపక్షాలు 43 స్థానాల్లో ముందంజలో ఉండగా, సీపీఎం 16 స్థానాల్లో ఆధిక్యం కనబరుస్తోంది. ఇక్కడ మొత్తం 60 స్థానాలకుగాను 59 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. సీపీఎం అభ్యర్థి మరణించడంతో చార్లీ నియోజకవర్గంలో ఎన్నిక మార్చి 12కి వాయిదా పడింది. రాష్ట్రంలో 1998 నుంచి సీపీఎంకు చెందిన మాణిక్ సర్కార్ ప్రభుత్వం అధికారంలో ఉంది. అంతకుముందు ఐదేళ్లు సీపీఎం నుంచి నృపేన్ చక్రవర్తి అధికారంలో కొనసాగారు. 2013 ఎన్నికల్లో 50 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 49 స్థానాల్లో డిపాజిట్ కోల్పోయింది. 2008లో 49 స్థానాలకుగాను 49 స్థానాల్లోనూ డిపాజిట్ కోల్పోయింది. కాగా రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలపై సీపీఎం శనివారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేసింది. గిరిజన, గిరిజనేతరుల ఐక్యత కోసం, అన్ని పల్లాల శ్రామిక ప్రజల అభ్యున్నతి కోసం తమ కృషిని కొనసాగిస్తామని త్రిపుర ప్రజలకు హామీ ఇస్తున్నట్లు పార్టీ ఆ ప్రకటనలో పేర్కొంది.

నాగాలాండ్‌లో పార్టీల పాకులాటే..!

నాగాలాండ్‌లో అధికారం కోసం పార్టీలు ఒకదానికొకటి పాకులాడే పరిస్థితి కనిపిస్తోంది. అధికార నాగా పీపుల్స్ ఫ్రంట్(ఎన్‌పీఎఫ్), దాని మిత్రపక్షాలు 29 స్థానాల్లో గెలుపొందగా, నాగాలాండ్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ-బీజేపీల కూటమి 29 స్థానాలు దక్కించుకుంది. అయితే కాంగ్రెస్ ఖాతా తెరవలేదు. స్వతంత్రులు మాత్రం రెండు స్థానాల్లో గెలుపొందారు. ఇక్కడ స్వతంత్ర అభ్యర్థులు కీలకంగా మారారు. బీజేపీతో జట్టుకట్టిన నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(ఎన్‌డీపీపీ) అధికార నాగా పీపుల్స్ ఫ్రంట్(ఎన్‌పీఎఫ్)కు గట్టి పోటీ ఇచ్చింది. రాష్ట్ర ఎన్నికలలో బీజేపీ 20, కొత్త పార్టీ ఎన్‌డీపీపీలు 40 స్థానాల్లో పోటీ చేశాయి. అయితే 60 మంది సభ్యుల రాష్ట్ర శాసనసభలో 31 స్థానాల మెజార్టీ(హాఫ్ మార్కు)కు కూడా చేరుకోలేకపోయింది. కాగా రాష్ట్రంలో మూడు పార్టీల కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అధికార ఎన్‌పీఎఫ్‌తో బీజేపీ 'అవగాహన' కుదుర్చుకోవచ్చు. బీజేపీ సీనియర్ నాయకుడు రామ్‌మాధవ్ నాగాలాండ్ చేరుకున్నారు. దిమాపూర్ విమానాశ్రయం వద్ద శనివారం సమావేశం నిర్వహించారు. అయితే ముఖ్యమంత్రి టి.ఆర్.జెలియాంగ్‌కు చెందిన నాగా పీపుల్స్ ఫ్రంట్ కూడా ఏమాత్రం వెనుకబడి లేదు. ఎన్‌పీఎఫ్ 29 స్థానాలతో రెండో స్థానంలో ఉంది. మూడుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన ఎన్‌డీపీపీకి చెందిన నైఫియూ రియో అనగామి-2 నియోజకవర్గం నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జనతాదళ్ (యునైటెడ్), నేషనల్ పీపుల్స్ ఫ్రంట్‌లు చెరొక స్థానంలో విజయం సాధించాయి. ఈ సందర్భంగా జెలియాంగ్ మాట్లాడుతూ పాత మిత్రపక్షం బీజేపీతో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయడం తమకు సంతోషమేనని తెలిపారు. ఇదిలాఉండగా, తన ప్రత్యర్థి, తన పార్టీ మాజీ సహచరుడు నైఫియూ రియో ఏర్పాటు చేసిన కొత్త పార్టీ ఎన్‌డీపీపీతో పొత్తు పెట్టుకునే అవకాశమే లేదని జెలియాంగ్ స్పష్టం చేశారు. 'ఎన్నికలు.. ఎన్నికలే. కొన్నిసార్లు ఊహించని ఫలితాలు వస్తాయి. కానీ మిత్రులతో కలిసి మెజార్టీ పొందుతామని నమ్ముతున్నాం. బీజేపీతో మా పొత్తు కొనసాగుతుంది. మేము ఏ సమయంలోనూ విడిపోలేదు. బీజేపీ నుంచి నా కేబినెట్‌లో ఇద్దరు మంత్రులు ఉన్నారు. బీజేపీకి చెందిన కొంతమంది నాయకులు నాతో సంప్రదిస్తున్నారు' అని ముఖ్యమంత్రి టి.ఆర్.జెలియాంగ్ చెప్పారు.

మేఘాలయలో కొరవడిన మెజార్టీ

మేఘాలయలో హంగ్ ఏర్పడే పరిస్థితులే స్పష్టంగా ఉన్నాయి. బీజేపీ దాని మిత్రపక్షం ఎన్‌పీపీకన్నా అధికార కాంగ్రెస్ పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. 60 అసెంబ్లీ స్థానాలకుగాను 59 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. ఎన్‌సీపీ అభ్యర్థి జోనాథోన్ ఎస్.సంగ్మా హత్యకు గురవడంతో విలియం నగర్ స్థానంలో ఎన్నికను ఈసీ రద్దు చేసింది. మేఘాలయ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ అభ్యర్థి ముకుల్ సంగ్మా అంపతి, సాంశాక్ నియోజకవర్గాల నుంచి విజయం సాధించారు. అంపటి స్థానంలో తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి బకుల్ చా హాజోంగ్‌పై 6 వేల ఓట్ల తేడాతో గెలుపొందారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 59 మంది స్థానాల్లో, బీజేపీ 47 స్థానాల్లో, ఎన్‌పీపీ 52 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టాయి. ఎన్‌పీపీ తురా పర్వత ప్రాంతాల్లో తన బలాన్ని నిలుపుకుంది. కేంద్రంలో, మణిపూర్‌లో బీజేపీతో ఎన్‌పీపీ పొత్తు పెట్టుకుంది. ఇదిలా ఉండగా, ఎన్నికలకు ముందు పొత్తు పెట్టుకున్న యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ(యూడీపీ), హిల్ స్టేట్ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(హెచ్ఎస్‌పీడీపీ), గారో నేషనల్ కౌన్సిల్ (జీఎన్‌సీ)లపైనే ఇపుడు అందరి చూపు ఉంది. ప్రభుత్వం ఏర్పాటులో ఈ పార్టీలే కీలకం కానున్నాయి. మేఘాలయలో ఫిబ్రవరి 27న ఎన్నికలు జరిగాయి. 18.09 లక్షల ఓటర్లకుగాను 13.5 లక్షలకుపైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 75 శాతం ఓటింగ్ నమోదయ్యింది.

మేఘాలయలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం : కాంగ్రెస్ నేత కమల్‌నాథ్


మేఘాలయలో ప్రభుత్వం ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించేందుకు రాష్ట్రానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు అహ్మద్ పటేల్, కమల్‌నాథ్‌లను పార్టీ అధిష్టానం పంపింది. పటేల్ మాట్లాడుతూ మణిపూర్, గోవా పరిస్థితులను పునరావృత్తం కానివ్వబోమన్నారు. 'మేము ప్రభుత్వం ఏర్పాటు చేయడమన్నది స్పష్టం. మేఘాలయ ప్రజల సంకల్పం కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతిఫలిస్తుంది. ప్రతి ఒక్కరితో సంప్రదిస్తున్నాం. ప్రతి ఒక్కరూ మాతో సంప్రదిస్తున్నారు' అని ఆయన పేర్కొన్నారు. అయితే సాధ్యమైనంత వరకు విఘాతం కలిగించేందుకు ధన బలాన్ని వినియోగించేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందని కమల్‌నాథ్ ఆరోపించారు.

మోడీ నాయకత్వాన్ని ఆమోదించడమే : బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా

త్రిపుర, నాగాలాండ్‌లలో బీజేపీ విజయం మోడీ నాయకత్వాన్ని ఆమోదించడమేనని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా పేర్కొన్నారు. త్రిపురలో ప్రచారం నిర్వహించిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు అమిత్ షా ఎన్నికల వ్యూహరచనతోపాటు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఆయన విధానాలకు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పనితీరుకు ఇచ్చిన గౌరవంగా చెప్పుకొచ్చారు. త్రిపుర ఫలితాలు పశ్చిమ బెంగాల్ రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయని బీజేపీ పేర్కొంది. ఆరు నెలల్లో బెంగాల్ రాజకీయ ముఖచిత్రం మారనున్నట్లు బెంగాల్ రాష్ట్ర బీజేపీ విభాగం తెలిపింది.

టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొడతాం

బీజేపీ రాష్ట్ర శాసనసభాపక్షం నిర్ణయం



విశాలాంధ్ర-విశాఖపట్నం : ముఖ్యమంత్రి చంద్రబాబు సహా ఆ పార్టీ ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ నిర్ణయించింది. బీజేపీపై బురద జల్లేందుకు టీడీపీ చేస్తున్న ప్రయత్నాలపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇప్పటివరకు బీజేపీ రాష్ట్రానికి ఏం చేసింది, ఇంకా చేయబోయే విషయాలను అసెంబ్లీలో ప్రస్తావించనున్నారు. కేంద్రం నుంచి ఏ రాష్ట్రం సాధించనన్ని నిధులు తెచ్చినట్లు గతంలో చంద్రబాబు చేసిన విషయాలను ప్రస్తావించాలని బీజేపీ భావిస్తోంది. శనివారం విశాఖలోని ఓ హోటల్‌లో బీజేపీ శాసనసభాపక్ష నేతల సమావేశం జరిగింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ కంభంపాటి హరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో ఎంపీ గోకరాజు గంగరాజు, ఆలిండియా జాయింట్ జనరల్ సెక్రటరీ సతీష్, మంత్రులు కామినేని శ్రీనివాస్, పైడికొండల మాణిక్యాలరావు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, ఆకుల సత్యనారాయణ, ఎమ్మెల్సీలు కె సత్యనారాయణరాజు, సోము వీర్రాజు, పివిఎన్ మాధవ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ రవీంద్రరాజు, విశాఖ నగర పార్టీ అధ్యక్షులు కె నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. దాదాపుగా నాలుగు గంటల పాటు రాష్ట్ర రాజకీయ పరిణామాలు, మిత్రపక్షంగా ఉన్న టీడీపీ చేస్తున్న వ్యాఖ్యలను ఎలా తిప్పికొట్టాలన్న విషయమై చర్చించారు.



నా వంతు కృషి చేస్తా

మన దేశంలో ఎందరో ప్రతిభ గల ఆటగాళ్లు ఉన్నారు: కోహ్లి

ఢిల్లీ: దేశంలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని అంటున్నాడు భారత పరుగుల యంత్రం విరాట్ కోహ్లి. 'మన దేశంలో ఎందరో ప్రతిభ గల ఆట గాళ్లు ఉన్నారు. వారిని వెలికి తీయాల్సిన అవసరం ఉంది. దేశంలో క్రీడాభివృద్ధికి, క్రీడా సంస్కృతిని పెంచేందుకు నా వంతు కృషి చేస్తా' అని కోహ్లి అన్నాడు. 'నా జీవిత లక్ష్యం ఒకటే. అందేంటంటే మన దేశంలో క్రీడా సంస్కృతిని పెంచాలి. ప్రజలందరికీ అన్ని క్రీడల పట్ల అవగాహన కల్పించాలి. అప్పుడే అన్ని క్రీడలకు విశేష ఆదరణ దక్కుతుంది. ఇదంతా జరగడానికి 10నుంచి 15 సంవత్సరాలు పట్టొచ్చు. ఫుట్‌బాల్ అంటే మన దేశంలో గోవా గుర్తుకొస్తుంది. ఒకవేళ నేను దేశం తరఫున ఫుట్‌బాల్ ఆటగాడిని అవ్వాలి అనుకుంటే గోవా వెళ్లి శిక్షణ పొందుతాను' అని తెలిపాడు.

మరిన్ని లీగ్‌లు నిర్వహించాలి

'ప్రజలకు అవగాహన పెరగాలంటే మరిన్ని లీగ్‌లు నిర్వహించాలి. అంతేకాదు వాటిని టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం చేయాలి. అప్పుడే ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. భారత ఆటగాళ్లను గుర్తించగలుగుతారు. ఇటీవల భారత్‌లో అండర్-17 ఫుట్‌బాల్ ప్రపంచకప్ నిర్వహించారు. టీవీల్లో ప్రసారం చేయడంతోనే దీని గురించి అందరికీ తెలిసింది. మన ప్రతిభ కూడా అప్పుడే బయటపడుతుంది. నా విషయంలోనూ అదే జరిగింది' అని విరాట్ చెప్పాడు.

గుర్తింపు వచ్చేది కాదేమో

'నేను అండర్-19 ప్రపంచకప్ ఆడినప్పుడు ఆ మ్యాచ్‌లన్నింటినీ ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఒకవేళ అదే జరగకపోతే ఇప్పుడు ఈ స్థాయిలో ఉండే వాడిని కాదేమో. ఇంత గుర్తింపు వచ్చేది కాదేమో. మ్యాచ్‌లను ప్రసారం చేయడం ద్వారా మా ప్రతిభ బయటికి వచ్చింది. లీగ్ మ్యాచ్‌ల ప్రసారాలే ఆటగాళ్ల ప్రతిభను బయటికి తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తాయి' అని కోహ్లి వివరించాడు. లంకలో జరిగే ముక్కోణపు టోర్నీ నుంచి కోహ్లికి బీసీసీఐ విశ్రాంతి కల్పించిన సంగతి తెలిసిందే. దీంతో రోహిత్ శర్మకు నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. మార్చి 6 నుంచి ఈ టోర్నీ ప్రారంభంకానుంది.



శతకంతో ఒంటరి పోరాటం

వెల్లింగ్టన్: ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేలో ఇంగ్లండ్ నాలుగు పరుగుల తేడాతో విజయం సాధించింది. న్యూజిలాండ్‌కు నిర్దేశించిన 235 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకుని విజయం సాధించింది. తద్వారా వరుసగా రెండో విజయాన్ని సాధించి సిరీస్‌లో 2-1 ఆధిక్యం సంపాదించింది. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ కడవరకూ పోరాటం చేసినా ఫలితం దక్కలేదు. ప్రధానంగా న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అజేయ శతకంతో ఒంటరి పోరాటం చేసినా జట్టును గెలిపించలేకపోయాడు. విలియమ్సన్ 143 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 112 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అయితే అతనికి మరో ఎండ్‌లో తగినంత సహకారం లభించలేదు. మిగతా న్యూజిలాండ్ ఆటగాళ్లలో కోలిన్ మున్రో(49), సాంత్నార్ (41)లు ఆకట్టుకున్నా జట్టును గెలిపించడంలో విఫలమ య్యారు. న్యూజిలాండ్ 50 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 230 పరుగులకే పరిమితమైంది. ఇంగ్లండ్ బౌలర్లలో వోక్స్, రషీద్ తలో రెండు వికెట్లు సాధించగా, మొయిన్ అలీ మూడు వికెట్లతో మెరిశాడు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లలో 234 పరుగులు చేసింది.

కేన్ విలియమ్సన్ అరుదైన ఘనత

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ మరో అరుదైన ఘనత సాధించాడు. వన్డే క్రికెట్‌లో 5000 పరుగులు పూర్తిచేసుకున్న కివీస్ కెప్టెన్, ఈ ఫార్మాట్లో అతి వేగంగా ఈ ఫీట్ సాధించిన ఐదో క్రికెటర్ గా నిలిచాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో వన్డేలో భాగంగా ఐదువేల పరుగులు పూర్తి చేసిన విలియమ్సన్., న్యూజిలాండ్ తరఫున అతివేగంగా ఈ రికార్డు అందుకున్న తొలి క్రికెటర్ అయ్యాడు. వెల్లింగ్టన్‌లో శనివారం జరిగిన వన్డేలో కివీస్ ఇన్నింగ్స్ 8వ ఓవర్ ఇంగ్లండ్ బౌలర్ మార్క్ వుడ్ వేయగా.. ఓవర్ చివరి బంతిని క్లాస్ ఆటగాడు విలియమ్సన్ బౌండరీకి తరలించి ఐదువేల పరుగులు పూర్తిచేశాడు. వెస్టిండీస్ క్రికెటర్ గ్రీనిడ్జ్ (121 ఇన్నింగ్స్‌లు)ను అధిగమిస్తూ విలియ మ్సన్ ఈ ఫీట్ అత్యంత వేగంగా చేరుకున్న ఐదో క్రికెటర్ అయ్యాడు.





ఒకే రోజు రెండు హ్యాట్రిక్స్

ఆక్లాండ్: న్యూజిలాండ్‌కు చెందిన క్రికెటర్లు లాగోన్ వేన్ బీక్, మ్యాట్ మెక్ ఇవాన్‌లు శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఒకే రోజు హ్యాట్రిక్స్ సాధించి సరికొత్త చరిత్ర సృష్టించారు. న్యూజిలాండ్ దేశవాళీ లీగ్‌లో భాగంగా ప్లంకెట్ షీల్డ్ ట్రోఫీలో వెల్లింగ్టన్ ఫైర్‌బర్డ్స్ ఆటగాడు వేన్ బీక్., కాంటర్‌బరీ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ముందుగా హ్యాట్రిక్ సాధించాడు. ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో భాగంగా చివరి రెండు బంతులకి రెండు వికెట్లు సాధించిన వేన్ బీక్.. ఆరో ఓవర్ మొదటి బంతికి వికెట్ తీసి హ్యాట్రిక్ నమోదు చేశాడు. ఇది ప్లంకెట్ షీల్డ్‌లో 40వ హ్యాట్రిక్‌గా పుస్తకాల్లోకెక్కగా, ఆపై అతని స్నేహితుడు మ్యాట్ వాన్ కూడా హ్యాట్రిక్ సాధించాడు. వేన్ బీక్ సాధించిన హ్యాట్రిక్ తరహాలో వాన్ వరుస మూడు వికెట్లను ఖాతాలో వేసుకున్నాడు. ఆక్లాండ్ తరఫున ఆడిన ఇవాన్.. నార్తరన్ డిస్ట్రిక్ట్స్ జట్టు హ్యాట్రిక్ సాధించాడు. ఇన్నింగ్స్ 26 ఓవర్ ఆఖరి రెండు బంతుల్లో రెండు వికెట్లు సాధించగా, 28 ఓవర్ తొలి బంతికి మరో వికెట్ తీసి హ్యాట్రిక్ నమోదు చేశాడు. ఇది ఇది ప్లంకెట్ షీల్డ్‌లో 41 హ్యాట్రిక్. ఫలితంగా 112 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న ప్లంకెట్ ఫీల్డ్‌లో రెండు హ్యాట్రిక్‌లు ఒకే రోజు నమోదు కావడం ఇదే తొలిసారి.



పోరాడి ఓడింది

అజ్లాన్‌షా కప్‌లో అర్జెంటీనా చేతిలో 2-3 తేడాతో భారత్ ఓటమి

ఇపో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్‌షా హాకీ కప్ ఆరంభ పోరులో సర్దార్ సింగ్ నేతృత్వంలోని భారత జట్టు పోరాడి ఓడింది. ప్రపంచ నంబర్ 2 అర్జెంటీనా చేతిలో 2-3 తేడాతో ఓటమి పాలైంది. ప్రకృతి సహకరించని ఈ పోరులో చివరి వరకు టీమిండియా కఠోరంగా శ్రమించిన విజయం వరించలేదు. అర్జెంటీనాలో గొంజాలో పిలాట్ 3, భారత్‌లో అమిత్ రోహిదాస్ 2 గోల్స్ సాధించారు. అనుభవజ్ఞులు లేని యువ జట్టును సర్దార్ సింగ్ బాగానే నడిపించాడు. హోరా హోరీగా ప్రారంభమైన మ్యాచ్‌లో తొలి క్వార్టర్ ముగుస్తుందనగా అర్జెంటీనాకు పెనాల్టీ కార్నర్ లభించింది. 13వ నిమిషంలో గొంజాలో గోల్ చేసి ఆ జట్టును 1-0తో ఆధిక్యంలో నిలిపాడు. 24వ నిమిషంలో లభించిన మరో పెనాల్టీ కార్నర్‌నూ గొంజాలో సద్వినియోగం చేశాడు. దీంతో అర్జెంటీనా 2-0తో దూసుకుపోయింది. ఈ క్రమంలో భారత్‌కు 26వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ లభించింది. కుర్రాడు అమిత్ రోహిదాస్ మాస్టర్‌ఫుల్ స్ట్రోక్‌తో స్కోరును 1-2కు తగ్గించాడు. 28వ నిమిషంలో అర్జెంటీనాకు లభించిన పెనాల్టీ కార్నర్‌ను భారత్ చక్కగా అడ్డుకుంది. అర్ధభాగం ముగిసే సరికి భారత్ 1-2తో నిలిచింది రెండో అర్ధభాగం ప్రారంభం కాగానే 31వ నిమిషంలో భారత్‌కు రెండో పెనాల్టీ కార్నర్ లభించింది. అమిత్ రోహిదాసే మళ్లీ గోల్ చేసి స్కోరు 2-2తో సమం చేశాడు. ఆ ఆనందం ఎక్కువసేపు మిగల్లేదు. 33వ నిమిషంలోనే గొంజాలో మంచి స్ట్రోక్‌తో మూడో గోల్ చేసి అర్జెంటీనాను 3-2తో ఆధిక్యంలో నిలిపాడు. ఆ తర్వాత ప్రత్యర్థి జట్టుకు పీసీ లభించినా భారత్ అడ్డుకుంది. మరో 11 నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా భారీ వర్షం రావడంతో కాసేపు ఆట నిలిపివేశారు. వర్షం కాస్త తగ్గడంతో మళ్లీ ఆడారు. అయిన భారత్‌కు చివరి పది నిమిషాల్లో ఏ అవకాశం దక్కలేదు.

ఫెస్టివ్ క్రికెట్ టోర్నీ విజేత డీజీ ఎలెవన్



విశాలాంధ్ర- విజయవాడ స్పోర్ట్స్: మూలపాడులోని ఏసీఏ స్టేడియంలో శనివారం నిర్వహించిన ఫెస్టివ్ క్రికెట్ టోర్నీలో సీఎస్(ఐఏఎస్ అధికారులు) ఎలెవన్ జట్టుపై డీజీ (ఐపీఎస్ అధికారులు) ఎలెవన్ జట్టు 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన డీజీ ఎలెవన్ ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన సీఎస్ ఎలెవన్ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 88 పరుగులు చేసింది. సీఎస్ ఎలెవన్ జట్టులో ప్రద్యుమ్న 37 పరుగులు (నాటౌట్), హరేంద్రప్రసాద్ 14 పరుగులు (నాటౌట్), మహేష్ 3 పరుగులు, విజయరామ రాజు 9 పరుగులు, బాబు అహ్మద్ 2 పరుగులు, సాయిప్రసాద్ 2 పరుగులు సాధించారు. ఎక్స్ట్రా పరుగులు 21 వచ్చాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన డీజీ ఎలెవన్ జట్టు 11.2 ఓవర్లలో 89 పరుగులు చేసి గెలుపొందింది. డీజీ ఎలెవన్ జట్టులో కాంతిరాణా 20 పరుగులు(నాటౌట్), విజయ్‌రావు 25 పరుగులు, విశాల్ గున్నీ 23 పరుగులు చేశారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా కాంతిరాణ(విజయవాడ జాయింట్ పోలీస్ కమిషనర్), బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా పీఎస్ ప్రద్యుమ్న, బెస్ట్ బౌలర్‌గా అబురాజ్ నిలిచారు. విజేతలకు డీజీపీ మాలకొండయ్య ట్రోఫీని బహూకరించారు. తొలుత డీజీపీతోపాటు విజయవాడ సీపీ డి.గౌతంసవాంగ్ ఈ మ్యాచ్‌ను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యం, అందరికీ క్రీడలు అనే ప్రభుత్వ స్ఫూర్తితో ఈ మ్యాచ్ నిర్వహించినట్లు తెలిపారు. విధి నిర్వహణలో బిజీగా ఉండే అధికారులకు ఈ పోటీలు ఆటవిడుపుగా ఉంటాయన్నారు. ఏసీఏ స్టేడియం బాగుందని కితాబిచ్చారు. ఈ మ్యాచ్‌కు శాప్ ఓఎస్‌డీ రామకృష్ణ సమన్వయకర్తగా వ్యవహరించారు.

ప్రత్యేక హోదాతోనే న్యాయం

- చంద్రబాబు ప్రశ్నించే హక్కు కోల్పోయారు
- జేఎఫ్‌సీకి రాజకీయ లబ్ధి లేదు
  - 11 అంశాలపై చర్చ
- కప్పదాటుతో సమస్య పరిష్కారం కాదు : పవన్‌కళ్యాణ్



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలుగు రాష్ట్రాలు విభజన జరిగిన తరువాత ఏపీలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు నాడు ప్రత్యేక ప్యాకేజీని మెచ్చుకున్నారని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో నేడు చంద్రబాబు ప్రశ్నించే హక్కు కోల్పోయి సమాధానం చెప్పే పరిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జేఎఫ్‌సీ సమావేశం శనివారం హైదరాబాద్‌లోని అవాసా హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు, అమలుతీరు, రాష్ట్రానికి వచ్చిన నిధులు, ఖర్చులు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జేఎఫ్‌సీ 11 అంశాలపై చర్చించింది. ఈ సమావేశంలో పవన్‌కళ్యాణ్‌తో పాటు జయప్రకాష్ నారాయణ, ఉండవల్లి అరుణ్‌కుమార్, తోట చంద్రశేఖర్, పద్మనాభయ్య, ఐవైఆర్ కృష్ణారావులు, గోపాల గౌడజీ హాజరయ్యారు. సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పవన్ మాట్లాడుతూ, కమిటీ ఎవ్వరినీ కూడా తప్పు పట్టడం లేదని అదే సమయంలో కమిటీకి ఏలాంటి రాజకీయ ప్రయోజనం కూడా లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనలో ప్రజల పాత్ర లేదని అది కేవలం రాజకీయపరంగా తీసుకున్న నిర్ణయం అయినప్పటికీ ప్రజలు నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంకు ప్రత్యేక హోదా డిమాండుకు మద్దతు ఇవ్వాలని జేఎఫ్‌సీ నిర్ణయించినట్లు ప్రకటించారు. ముఖ్యంగా అత్యంత వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.20వేల కోట్లు ఇవ్వాలని డిమాండు చేశారు. అలాగే 10వ షెడ్యూల్‌లోని ఉమ్మడి ఆస్తులను సమానంగా పంచాలని కోరారు. విభజన హామీలో ఉన్న ప్రకారం పోలవరం ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నిధులను కేటాయించి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అదే సమయంలో కేంద్రం ప్రకటించిన వివిధ రకాల సంస్థల నిర్మాణాలను వచ్చే ఏడాదిలోగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విరుద్ధమైన ప్రకటనలు చేశారని, అందుకే బీజేపీ ప్రభుత్వాన్ని తిరుపతి, కాకినాడ సభల్లో తాను ప్రశ్నిస్తే హడావిడిగా ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించారని గుర్తుచేశారు. అయితే అప్పట్లో ప్రత్యేక హోదా కంటే ప్రత్యేక ప్యాకేజీ బాగుందని ప్రకటించిన చంద్రబాబు నేడు అందుకు విరుద్ధంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. అపార రాజకీయ అనుభవం వున్న చంద్రబాబు వంటి వారు ఇలా అయోమయ స్థితిలో ఉండడం తనకు అర్థం కావడం లేదన్నారు. రాష్ట్ర విభజన తరువాత ఆయన మేధాశక్తి, చంద్రబాబు రాజకీయ అనుభవం ఏమైందని ప్రశ్నించారు. అసలు విభజన హామీలను నెరవేర్చడానికి అధికార పార్టీకి ఉన్న సమస్యలు ఏంటో అర్థం కావడం లేదన్నారు. ఈ సమావేశంలో ప్రొ.అమీర్‌ఉల్లాఖాన్‌జీ, ప్రొ.నాగేశ్వర్, ప్రొ.ఆర్.వి.రామారావు, ఆలవిలిశ్రీనివాస్, తారాకృష్ణస్వామి, అరుణ, పేరిమహేశ్వర్, ప్రమోద్‌రెడ్డి, రాకేష్‌రెడ్డిలు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపు జరిగిందిలా...

అంతకుముందు సమావేశంలో రాష్ట్రానికి జరిగిన వివిధ రకాల నష్టాలపై కమిటీ లోతుగా చర్చించింది. ఈ సందర్భంగా ఇటీవల వారు సేకరించిన వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. 2014 -15 ఆర్థిక సంవత్సరంలోనే ఏపీ ప్రభుత్వం రూ.16078.76కోట్ల ఆర్థికలోటును చవిచూసిందని వెల్లడించారు. ఇందులో ప్రధానంగా వ్యవసాయం తగ్గుదల కారణంగా రూ.3068.35కోట్లు, రైతు సాధికారిక సంస్థ నిధుల కేటాయింపు వల్ల 4001.32కోట్లు, డిస్కంలకు నిధుల కేటాయింపుతో 1500కోట్లు వృద్ధాప్య పింఛన్ల వల్ల రూ.3391.20కోట్లు ఉన్నాయని, ఇవి నాలుగు కూడా కొత్త పథకాలు కావడంతో వాటికి నిధుల కేటాయింపు చేయలేమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. కేంద్ర విడుదల చేయాల్సిన రూ.4117.89 కోట్లకు సంబంధించి రూ.3979.50కోట్లను విడుదల చేసింది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.138.39కోట్లు రావాల్సి ఉందని ఇందులో పింఛన్లు గతంలో ఉన్నవే అని కేంద్ర సూచన మేరకు పింఛన్లు పెంచడం జరిగిందని, అదే సమయంలో డిస్కంలకు ఇచ్చిన కేటాయింపులు కూడా కేంద్ర సూచనల మేరకే ఉన్నట్లు రాష్ట్రం వాదిస్తున్నట్లు తెలిపారు. అలాగే వేతనాల సవరణ వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై రూ.5325కోట్లు భారం పడిందని కేంద్రానికి సూచించగా దానికి కూడా కేంద్రం అంగీకరించ లేదన్నారు. కేంద్రం ప్రకటించిన 11 జాతీయ ప్రాజెక్టులకు సంబంధించి 9 ప్రాజెక్టులను కేంద్రం ప్రకటించిందని ఇంకా అనంతపూరం, విజయనగరం సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ కేటాయించాల్సి ఉందన్నారు. అయితే ఇంతవరకు ప్రకటించిన ప్రాజెక్టులకు మొత్తం రూ.11672.95కోట్లు కేటాయించాల్సి ఉండగా ఇంతవరకు రూ.576 కోట్లు కేటాయించగా 2017-18 బడ్జెట్‌లో మరో రూ.277కోట్లు కేటాయించారని తెలిపారు. అలాగే ఏపీ ప్రభుత్వం నీతి అయోగ్‌కు జనవరి 2015లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం రూ.24350కోట్లు కేటాయించాలని కోరగా దీనిపై ఇంకా కేంద్రం నుండి వివరాలు అందలేదని, అయితే రూ.350కోట్లు ప్రతి జిల్లాకు మాత్రం రూ.50కోట్లకు జిల్లాకు చొప్పున ఏపీలోని 7 జిల్లాలకు కేటాయించినట్లు వివరించారు. దీంతో గడిచిన మూడు సంవత్సరాలలో రూ.1050 కోట్లు విడుదలయ్యాయని, మరో రూ.1050కోట్లు రానున్న కాలంలో విడుదల చేయనున్నట్లు తెలిపిందన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.